www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 13-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 88 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి మ. 3.06 తదుపరి అష్టమి; నక్షత్రం: హస్త రా. 7.15 తదుపరి చిత్ర; వర్జ్యం: తె. 4.12 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 5.52-7.35; అమృతఘడియలు: మ.12.28-2.16; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.52, సూర్యాస్తమయం: 6.49 | హైదరాబాద్ సిటీ*


Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





# పీఎస్‌యూలకు కాయకల్ప చికిత్స

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకూ ఫుల్ స్టాప్.. మారిన మోదీ వైఖరి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై మోదీ సర్కారు వెనక్కి తగ్గుతోంది. నష్టాల్లో ఉన్న పీఎస్‌యూలను అమ్మేయడం లేదా మూసేయడం, లాభాల్లో ఉన్న పీఎస్‌యూల్లో పెట్టుబడుల ఉపసంహరణ దూకుడుగా చేస్తామని 2021లో మోదీ సర్కార్ గొప్పగా ప్రకటించింది. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో అది కాస్తా బెడిసి కొట్టింది. కీలక సంకీర్ణ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జేడీయూ ఎడాపెడా పీఎస్‌యూల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నాయి. దీంతో ఈ సంస్థల ప్రైవేటీకరణకు బదులు వాటి మిగులు భూములు, కీలకేతర ఆస్తులు అమ్మి వాటిని ఆర్థికంగా మరింత పటిష్ఠం చేయాలని మోదీ సర్కారు భావిస్తున్నట్టు సమాచారం. ఈ నెల 23న ప్రకటించే కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి సీతారామన్ దీనిపై స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

### అది నుంచీ నత్త నడకే

బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచీ పీఎస్‌యూలకు ప్రైవేటీకరణ భయం పట్టుకుంది. గతంలో యూపీఏ సర్కారు హయాంలోనూ కొన్ని సంస్థల ప్రైవేటీకరణ జరిగింది. అయితే అప్పటి సంకీర్ణ పక్షాలు ముఖ్యంగా వామ పక్షాల ఒత్తిడితో మన్మోహన్ సర్కారు ఈ విషయంలో పెద్దగా దూకుడు ప్రదర్శించలేదు. 2014లో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ రావడంతో ఇక దేశంలో పీఎస్‌యూలు ఉండవనే ఆందోళన జోరందుకుంది. కొందరు కేంద్ర మంత్రుల ప్రకటనలు ఈ భయాల్ని మరింత పెంచాయి. అయినా గత పదేళ్లలో 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో తప్ప ఏనాడూ పీఎస్‌యూల పెట్టుబడుల లక్ష్యం ఆశించిన స్థాయిని చేరుకోలేదు. గత ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.51,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా నిర్ణయిస్తే రూ.14,564 కోట్లకు మించి సాధ్యం కాలేదు. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే పరిస్థితి. గత రెండేళ్లలో ఎయిర్ ఇండియా తప్ప, మరే ప్రధాన పీఎస్‌యూ ప్రైవేటీకరణ సాధ్యం కాలేదు. ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ కూడా సెంటిమెంట్‌తో టాటా గ్రూపు కొనడం వల్లే సాధ్యపడింది.

### రెట్టింపైన మార్కెట్ క్యాప్

గత ఏడాది కాలంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 22 శాతం పెరిగింది. ఇదే సమయంలో బీఎస్‌ఈ పీఎస్‌యూ సూచీ 100 శాతం పెరిగింది. దీంతో మూడో సారీ బంపర్ మెజారిటీతో గెలిస్తే పెద్ద ఎత్తున పీఎస్‌యూలను ప్రైవేటీకరించి, ద్రవ్య లోటు మరింత పూడ్చుకోవచ్చని మోదీ సర్కారు భావించింది. అయితే ఓటర్లు అందుకు బ్రేక్ వేయడంతో ఆ ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఇపుడు పీఎస్‌యూల ప్రైవేటీకరణకు బదులు, వాటిని మరిత బలోపేతం చేసి, వాటి నుంచి పెద్ద మొత్తంలో డివిడెండ్ ఆదాయం రాబట్టాలనేది మోదీ సర్కారు వ్యూహంగా కనిపిస్తోంది. దీంతో బీపీసీఎల్, రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఒక బీమా కంపెనీ ప్రైవేటీకరణ కథ కూడా కంచికి చేరనుంది. పెద్దగా వ్యతిరేకత రాని ఎన్ఎండీసీ స్టీల్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ) ప్రైవేటీకరణ తప్ప, మిగతా పీఎస్‌యూల ప్రైవేటీకరణ ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

### ప్రభుత్వ రంగంలోనే వీఎస్‌పీ

తాజా రాజకీయ పరిణామాల పుణ్యమాని విశాఖ స్టీలు ప్లాంటు (వీఎస్‌పీ) ప్రైవేటీకరణ కూడా అటకెక్కినట్టే. ఆంధ్ర ప్రదేశ్ ప్రజల మనో భావాలతో ముడిపడి ఉన్న ఈ ప్లాంటును ప్రైవేటు పరం చేసే ప్రకస్తే లేదని కేంద్ర ఉక్కు, గనుల శాఖ మంత్రి కుమార స్వామి ఇప్పటికే స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంలో కీలక భాగస్వామ్య పక్షమైన టీడీపీ ఒత్తిడి ఇందుకు కారణమని వేరే చెప్పనవసరం లేదు. వీఎస్‌పీని నష్టాల నుంచి బయట పడేసేందుకు వీలైన అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి కుమార స్వామి ప్రకటించడం మరో కొసమెరుపు.

## ధరల హోరు..

**» జూన్ ద్రవ్యోల్బణం 5.08 శాతం**



న్యూఢిల్లీ: దేశంలో ధరలు హోరెత్తిపోతున్నాయి. ఆహార వస్తువులు ప్రత్యేకించి కూరగాయల ధరలు ప్రియం అయిన కారణంగా జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.08 శాతానికి పెరిగింది. ఇది నాలుగు నెలల గరిష్ఠ స్థాయి. మే నెలలో ఇది 4.8 శాతం ఉండగా గత ఏడాది జూన్‌లో 4.87 శాతం ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి తగ్గుముఖంలో ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో తిరిగి పైకి ఎగసింది. ఆహార వస్తువుల ధరలు జూన్ నెలలో 9.36 శాతం మేరకు పెరిగాయి. వడ్డీరేట్లపై నిర్ణయం కోసం ఆర్‌బీఐ రిటైల్ ద్రవ్యోల్బణాన్నే గీటురాయిగా తీసుకుంటుంది.

### ఏడు నెలల గరిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి

పారిశ్రామిక రంగం మే నెలలో మెరుగైన పనితీరు ప్రదర్శించింది. పారిశ్రామికోత్పత్తి వృద్ధిరేటు 7 నెలల గరిష్ఠ స్థాయి 5.9 శాతంగా నమోదయింది. ప్రధానంగా పవర్, మైనింగ్ రంగాలు ఇందుకు దోహదపడ్డాయి. గత ఏడాది అక్టోబరులో నమోదైన గరిష్ఠ వృద్ధి 11.9 శాతం తర్వాత నమోదైన గరిష్ఠ వృద్ధి ఇదే. కాగా ఏప్రిల్‌లో ఇది 5 శాతం ఉండగా గత ఏడాది మేలో 5.7 శాతం ఉంది. ఈ మే నెలలో మైనింగ్ రంగం 6.6 శాతం, విద్యుత్ రంగం 13.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. తయారీ రంగం వృద్ధి మాత్రం 4.6 శాతానికి దిగజారింది.

## కొత్త ఫార్ములేషన్‌తో గుడ్‌నైట్

హైదరాబాద్: గోద్రెజ్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ (జీసీపీఎల్) బహుళ జనాదరణ పొందిన దోమల నివారిణి గుడ్‌నైట్ ఫ్లాష్ లిక్విడ్ వాపొరైజర్‌లో రెనోఫ్లూత్రిన్ ఫార్ములేషన్‌ను ప్రవేశపెట్టింది. దోమల నివారణ విషయంలో జీసీపీఎల్ శాస్త్రవేత్తలు సాధించిన ఘన విజయం ఇది. వారు తమ భాగస్వామితో కలిసి పరిశోధన చేసిన అనంతరం దేశీయంగా అభివృద్ధి చేసి, పేటెంట్ పొందిన రెనోఫ్లూత్రిన్ వల్ల గుడ్‌నైట్ లిక్విడ్ మరింత సమర్థవంతంగా దోమలను నివారించగలుగుతుందని జీసీపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది.



| బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో) | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 73,750 ▲ | 67,600 ▲ | 1,00,000 ▲ |
| ముంబై | 72,660 ▲ | 66,560 ▲ | 92,204 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| 13వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 530 | విజయవాడ | 555 |
| వరంగల్ | 532 | గోదావరి | 555 |
| చిత్తూరు | 573 | విశాఖపట్నం | 575 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 108 | విజయవాడ | 113 |
| వరంగల్ | 108 | గుంటూరు | 113 |
| కరీంనగర్ | 108 | ఒంగోలు | 113 |
| మహబూబ్‌నగర్ | 108 | చిత్తూరు | 118 |
| కర్నూలు | 108 | నెల్లూరు | 118 |
| విశాఖపట్నం | 105 | అనంతపురం | 113 |
| గోదావరి | 113 | | |

## ఒప్పో రెనో12 5జీ ఫోన్లు

**» ప్రారంభ ధర రూ.32,999**



న్యూఢిల్లీ: చైనా స్మార్ట్‌ఫోన్ కంపెనీ ఒప్పో శుక్రవారం భారత మార్కెట్లో రెనో 12-5జీ సిరీస్ ఫోన్లను విడుదల చేసింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఫీచర్లతో కూడిన ఈ ఫోన్ మూడు వేరియంట్లలో లభించ నుంది. 8జీ ర్యామ్, 256 జీబీ స్టోరేజీ సామర్థ్యంతో కూడిన రెనో 12 5జీ ఫోన్ రేటు రూ.32,999 కాగా, రెనో 12 ప్రో 5జీలో 12జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజీ వెర్షన్ ధరను రూ.36,999గా నిర్ణయించింది. 12జీబీ ర్యామ్, 512 జీబీ స్టోరేజీ వెర్షన్ రూ.40,999కు లభించనుంది. భారత్‌లో రెనో 12 ప్రో 5జీ ఫోన్ల విక్రయాలు ఈనెల 18 నుంచి ప్రారంభమవుతాయని, రెనో 12 5జీ ఫోన్ మాత్రం ఈనెల 25వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందని కంపెనీ వెల్లడించింది.

## అమెజాన్ 'ప్రైమ్ డే'లో వెయ్యి కొత్త ఉత్పత్తులు




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెజాన్ ఇండియా తన ప్రైమ్ సభ్యుల కోసం ఈ నెల 20-21 తేదీల్లో పెద్ద ఎత్తున 'ప్రైమ్ డే'ని నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్లు, గృహోపకరణాలు, హోమ్ డెకార్, ఫ్యాషన్, బ్యూటీ కేర్‌కు సంబంధించి 450 కంపెనీలు, వెయ్యికిపైగా కొత్త ఉత్పత్తులను తమ ఇ-కామర్స్ వెబ్‌సైట్ ద్వారా అమ్మకానికి పెట్టబోతున్నట్టు అమెజాన్ డైరెక్టర్ (షాపింగ్ ఎక్స్‌పీరియన్స్, ఇండియా అండ్ ఎమర్జింగ్ మార్కెట్స్) తోట కిశోర్ విలేకరులతో చెప్పారు. సాంసంగ్, మోటరోలాతో సహా ఏడు ప్రముఖ కంపెనీలు కూడా ప్రైమ్ డే సమయంలో తమ కొత్త ఉత్పత్తులను విడుదల చేయబోతున్నట్టు తెలిపారు. దాదాపు అన్ని కంపెనీలు తమ బ్రాండ్లు, ఉత్పత్తులపై ప్రత్యేక డిస్కౌంట్లు, కాష్‌బ్యాక్‌లు ఆఫర్ చేస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రైమ్ డే రోజు అమెజాన్ ద్వారా కొనే వస్తువుల్లో 10 లక్షల వస్తువులను అదే రోజు, మరో 14 లక్షల వస్తువులను మరుసటి రోజు ప్రైమ్ సభ్యులకు డెలివరీ చేస్తామన్నారు.

## ఫారెక్స్ నిల్వల్లో ఆల్‌టైం రికార్డు

విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఈనెల 5తో ముగిసిన వారంలో ఇవి 515.8 కోట్ల డాలర్ల వృద్ధితో 65,715.5 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది. అంతక్రితం రెండు వారాల్లో నిల్వలు స్వల్పంగా తగ్గాయి.

# ఐటీ షేర్లు జిగేల్

**» రూ.452 లక్షల కోట్లు దాటిన సంపద**




ముంబై: ఐటీ, టెక్నాలజీ షేర్లలో భారీగా కొనుగోళ్లతోపాటు ఫెడ్ రేట్ల తగ్గింపు ఆశలతో స్టాక్ మార్కెట్ సూచీలు వారాంతంలో సరికొత్త ఉన్నత శిఖరాలకు ఎగబాకాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 996.17 పాయింట్లు పెరిగి 80,893.51 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 622 పాయింట్ల లాభంతో మరో జీవన కాల గరిష్ఠ స్థాయి 80,519.34 వద్ద క్లోజైంది. నిఫ్టీ సైతం ఒకదశలో 276.25 పాయింట్లు ఎగబాకి 24,592.20 వద్ద ఇంట్రాడే రికార్డును నమోదు చేసినా చివరికి 186.20 పాయింట్ల లాభంతో 24,502.15 వద్ద మరో రికార్డు స్థాయిలో ముగిసింది. టీసీఎస్ జూన్ త్రైమాసిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించడంతో ఐటీ రంగ వృద్ధి పునరుద్ధరణపై అంచనాలు పెరిగాయి. దాంతో టీసీఎస్, ఇన్ఫోసిస్ సహా ఐటీ షేర్లన్నీ ర్యాలీ తీశాయి. అలాగే, గత నెలకు అమెరికా ధరల సూచీ ఏడాది కనిష్ఠానికి జారుకుంది. దాంతో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపును ఈ సెప్టెంబరు నుంచే ప్రారంభించవచ్చన్న అంచనాలు బలపడటం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచింది.

- ఈ ర్యాలీలో బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.1.17 లక్షల కోట్లు పెరిగి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.452.38 లక్షల కోట్లకు (5.42 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.
- టీసీఎస్ 6.68 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.94,866 కోట్లకు పైగా పెరిగి రూ.15.14 లక్షల కోట్లకు చేరుకుంది.
- చిన్న, మధ్యస్థాయి కంపెనీల షేర్లలో అమ్మకాలు కొనసాగడంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.22 శాతం వరకు నష్టపోయాయి.
- ఆప్టికల్ అండ్ డిజిటల్ సొల్యూషన్స్ కంపెనీ స్టెరిలైట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఎస్‌టీఎల్) తన గ్లోబల్ సర్వీసెస్ బిజినెస్‌ను ప్రత్యేక సంస్థగా విభజించేందుకు షేర్‌హోల్డర్లతో పాటు రుణదాతల నుంచి ఆమోదం లభించింది.

# హెచ్‌సీఎల్ టెక్ భళా

**» ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్**

న్యూఢిల్లీ: హెచ్‌సీఎల్ టెక్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. జూన్ త్రైమాసికానికి కంపెనీ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 20.4 శాతం వృద్ధి చెంది రూ.4,257 కోట్లకు చేరుకుంది. ఆదాయం 6.6 శాతం పెరిగి రూ.28,057 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయం వృద్ధి 3-5 శాతంగా నమోదుకావచ్చని కంపెనీ అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. అర్హులైన వాటాదారుల రికార్డు తేదీని ఈనెల 23గా నిర్ణయించిన కంపెనీ.. వచ్చేనెల 1న డివిడెండ్ చెల్లింపులు జరపనుంది.

## వాట్సప్ ద్వారా త్వరలో రైలు టిక్కెట్లు: మెటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మెటా నిర్వహణలోని వాట్సప్ యాప్ వ్యాపార సేవలను పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. హైదరాబాద్ మెట్రో సహా ఇప్పటికే పలు నగరాల్లో మెట్రో రైలు టిక్కెట్లను అందిస్తున్న వాట్సప్, త్వరలో రైల్వే రిజర్వేషన్ టిక్కెట్లు అందించేందుకూ సిద్ధమవుతోంది. ఇందుకోసం ఐఆర్‌సీటీసీతో చర్చలు జరుపుతున్నట్టు మెటా డైరెక్టర్ (బిజినెస్ మెసేజింగ్) రవి గార్గ్ చెప్పారు. క్రమంగా ఈ సేవలను వివిధ రాష్ట్రాల బస్సు సర్వీసులకూ విస్తరించనున్నట్టు తెలిపారు. వాట్సప్ బిజినెస్ ప్లాట్‌ఫాం ద్వారా పెద్ద పెద్ద వ్యాపార సంస్థలతో పాటు చిన్న చిన్న వ్యాపార సంస్థలకూ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్రత్యేక సేవలు అందించనున్నట్టు తెలిపారు. చిన్న చిన్న వ్యాపార సంస్థలకు ప్రకటనలు, ప్రచార రూపకలప్పనలో తమ ఏఐ ఆధారిత అసిస్టెంట్లు, ఏజెన్సీల ద్వారా ఉచితంగా తోడ్పడనున్నట్టు రవి గార్గ్ తెలిపారు.

# స్పోర్ట్స్




# మళ్లీ ఆ ఇద్దరే!

## ఫైనల్లో అల్కారజ్ X జొకోవిచ్

**మెద్వెదెవ్, ముసేటికి నిరాశ**

లండన్: మళ్లీ ఆ ఇద్దరి మధ్యే ఫైనల్‌కు వింబుల్డన్ సెంటర్ కోర్టు సిద్ధమైంది ఏడుసార్లు విజేత నొవాక్ జొకోవిచ్, డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్ వరుసగా రెండో ఏడాది తుదిపోరులో అమీతుమీ తేల్చుకోనున్నారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో 2021 యూఎస్ ఓపెన్ విజేత, రష్యన్ స్టార్ డానిల్ మెద్వెదెవ్‌ను మూడోసీడ్ అల్కారజ్ 6-7(1-7), 6-3, 6-4, 6-4తో చిత్తుచేయగా.. ఇటలీకి చెందిన 22 ఏళ్ల కుర్రాడు లోరెంజో ముసేటి జోరుకు చెక్ పెడుతూ రెండోసీడ్ జొకోవిచ్ 6-4, 7-6(7-2), 6-4తో గెలుపొందాడు. నిరుడు ఇదే వేదికపై హోరాహోరీగా జరిగిన ఫైనల్లో 24 గ్రాండ్‌స్లామ్‌ల వీరుడు జొకోవిచ్ ఆధిపత్యానికి గండికొడుతూ 21 ఏళ్ల అల్కారజ్ తొలిసారి ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో విజేతగా నిలిచాడు. మరి.. ఈసారీ అదే ఫలితాన్ని పునరావృతం చేసి స్పెయిన్ కుర్రాడు అల్కారజ్ అద్భుతం చేస్తాడా.. లేదంటే 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో సెర్బియా యోధుడు నొవాక్ చరిత్ర సృష్టిస్తాడా అన్నది ఆదివారం తేలనుంది.

**తొలిసెట్ మినహా..:** నిరుడు ఇక్కడే తనను ఓడించి ఫైనల్ చేరిన అల్కారజ్‌ను అడ్డుకోవడంలో ఐదోసీడ్ మెద్వెదెవ్ వరుసగా రెండోసారీ విఫలమయ్యాడు. రెండు గంటలా 55 నిమిషాల పాటు సాగిన సెమీస్ పోరులో మెద్వెదెవ్ తొలి సెట్ మినహా ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయాడు. అల్కారజ్ 6 ఏస్‌లు, 55 విన్నర్లను సంధించగా.. మెద్వెదెవ్ 5 ఏస్‌లు, 31 విన్నర్లకు పరిమితమయ్యాడు. ఆదివారం ఫైనల్లో గనక గెలిస్తే అల్కారజ్.. ఒకటి కంటే ఎక్కువసార్లు వింబుల్డన్ అందుకున్న 22 ఏళ్లలోపు వయసు ఆటగాడిగా దిగ్గజాలు బోరిస్ బెకర్, జాన్ బోర్గ్‌ల సరసన చేరతాడు.

**జొకో అలవోకగా..:** తనకు అచ్చొచ్చిన వేదికపై జొకోవిచ్ మరోసారి విజృంభించాడు. తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన ముసేటిపై రెండు గంటలా 48 నిమిషాల పాటు పోరాడి విజయం సాధించాడు. 37 ఏళ్ల జొకోవిచ్ ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో ఫైనల్ చేరడం ఇది పదోసారి.

**మహిళల ఫైనల్ నేడే**



క్రెజికోవాతో పాలిని ఢీ

(సా. 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో)

## సింధు, ప్రణయ్‌లకు సులువైన డ్రా

**పారిస్ ఒలింపిక్స్**

న్యూఢిల్లీ: ఈనెలలో జరగబోయే పారిస్ ఒలింపిక్స్‌లో భారత షట్లర్లకు కాస్త అనుకూలమైన డ్రా ఎదురైంది. మహిళల సింగిల్స్‌లో డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు, పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్‌కు తమ గ్రూపు ఆరంభ మ్యాచ్‌ల్లో బలహీన ప్రత్యర్థులు ఎదురుకానున్నారు. ప్రపంచ 13వ ర్యాంకర్ సింధుకు గ్రూప్ ఎంలో క్రిస్టిన్ కూబా (ఎస్టోనియా), ఫాతిమాత్ నబాహ (మాల్దీవులు) పోటీ ఇవ్వనున్నారు. అయితే ప్రీక్వార్టర్స్‌లో ఆమెకు ఆరో సీడ్ హే బింగ్ జియావో (చైనా)తో సవాల్ తప్పదు. ఇక తొలిసారి ఒలింపిక్ బరిలోకి దిగుతున్న 13వ సీడ్ హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ తమ గ్రూపుల్లోని ప్రత్యర్థులను ఓడిస్తే.. ఇద్దరూ ప్రీక్వార్టర్స్‌లో తలపడాల్సి ఉంటుంది. అలాగే మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీష క్రాస్టోలకు క్లిష్టమైన డ్రా ఎదురైంది. మరోవైపు సాత్విగ్-చిరాగ్ తలపడుతున్న పురుషుల డబుల్స్ ఈవెంట్ డ్రాను సాంకేతిక కారణాలరీత్యా వాయిదా వేశారు.



కాలిఫోర్నియాలో జరిగిన ఈఎస్‌పీవై అవార్డుల కార్యక్రమంలో అమెరికా మాజీ టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్

# మూడోరోజే ముగించారు

**» అట్కిన్సన్‌కు ఐదు వికెట్లు**
**» తొలి టెస్టులో విండీస్‌పై ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విజయం**

వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌ను ఇంగ్లండ్ ఘనంగా ఆరంభించింది. అరంగేట్ర పేసర్ గస్ అట్కిన్సన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ ఐదు వికెట్లతో చెలరేగాడు. దీంతో ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మూడో రోజు శుక్రవారం 79/6 స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన విండీస్ 136 పరుగులకే కుప్పకూలింది. మోటీ (31 నాటౌట్) మాత్రమే రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లు కేవలం గంటన్నరలోనే మ్యాచ్‌ను ముగించారు. అండర్సన్‌కు 3, స్టోక్స్‌కు 2 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 371, విండీస్ 121 రన్స్ చేశాయి. మొత్తమ్మీద 12 వికెట్లు తీసిన అట్కిన్సన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

| అండర్సన్ టెస్టు కెరీర్ ఇలా.. | మ్యాచ్‌లు | పరుగులు | వికెట్లు | ఉత్తమ బౌలింగ్ |
|---|---|---|---|---|
| | 188 | 1353 | 704 | 7/42 |



'హేయ్ జిమ్మీ! నీ 22 ఏళ్ల అద్భుత స్పెల్‌తో క్రికెట్ ప్రేమికులను అలరించావు. అలాగే నీ బౌలింగ్ శైలి, వేగం, కచ్చితత్వం, స్వింగ్, ఫిట్‌నెస్‌తో ముందు తరాలకు ఆదర్శంగా నిలిచావు. ఇకముందు కుటుంబంతో కొనసాగించే సరికొత్త ఇన్నింగ్స్ సుఖఃసంతోషాలతో సాగాలని కోరుకుంటున్నాను'

\- సచిన్ టెండూల్కర్

# సిరీస్‌పైనే గురి

- ఆత్మవిశ్వాసంతో భారత్
- ఒత్తిడిలో జింబాబ్వే

**నేడు నాలుగో టీ20**

సా. 4.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో



గిల్

హరారే: తొలి మ్యాచ్‌లో అనూహ్య పరాజయం ఎదురైనప్పటికీ.. జింబాబ్వేతో ఐదు టీ20ల సిరీస్‌లో యువ భారత్ ఆశించినరీతిలోనే ముందుకు సాగుతోంది. వరుసగా రెండు విజయాలతో జోష్‌లో ఉన్న గిల్ సేన ఇప్పుడు సిరీస్‌పై కన్నేసింది. శనివారం హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ జరుగనుంది. 2-1 ఆధిక్యంతో ఉన్న భారత్ ఈ మ్యాచ్ గెలిస్తే సిరీస్ వశమవుతుంది. అందుకే ఎలాంటి అలసత్వానికి తావీయకుండా మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను ముగించాలనుకుంటోంది. అటు జింబాబ్వే అద్భుత ప్రదర్శన ఒక్క మ్యాచ్‌కే పరిమితమైంది. భారత్‌ను అడ్డుకోవడంతో పాటు తమ ఆశలను సజీవంగా ఉంచుకోవాలనుకున్నా.. వారికీ మ్యాచ్ గెలవడం తప్పనిసరి. అలాగైతేనే చివరి పోరు ఇరువురికీ కీలకమవుతుంది.

**మార్పులుంటాయా?:** మూడో టీ20లో భారత జట్టు మూడు మార్పులతో బరిలోకి దిగింది. దీంతో టీమ్‌లో జైస్వాల్, గిల్, అభిషేక్, రుతురాజ్‌ల రూపంలో నలుగురు ఓపెనర్లు టాప్-4లో ఆడాల్సి వచ్చింది. మిడిలార్డర్ బ్యాటర్ లేని లోటును నేటి మ్యాచ్‌లో పూరించాలనుకుంటున్నారు. అదే జరిగితే అభిషేక్ స్థానంలో రియాన్ పరాగ్‌కు చాన్స్ దక్కవచ్చు. ఇక బౌలింగ్‌లో రెండో టీ20లో ఖలీల్‌ను, మూడో టీ20లో ముకేశ్‌ను ఆడించలేదు. ఇప్పుడు పేసర్ అవేశ్‌కు విశ్రాంతినిచ్చి హర్షిత్‌ను పరీక్షించవచ్చు.

**తుది జట్లు (అంచనా)**

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, గైక్వాడ్, పరాగ్, రింకూ సింగ్, దూబే, శాంసన్, సుందర్, బిష్ణోయ్, హర్షిత్, ముకేశ్.

జింబాబ్వే: మరుమని, ఇన్నోసెంట్, బెన్నెట్, మదెవెరె, సికిందర్ రజా (కెప్టెన్), మదండె, క్యాంప్‌బెల్, జోంగ్వే, మసకద్జ, ఎన్‌గరవ, ముజరబాని.



# పేస్ యోధుడు ముగించాడు

**21 ఏళ్ల కెరీర్‌కు అండర్సన్ వీడ్కోలు**

**700 వికెట్లు తీసిన ఏకైక పేసర్‌గా రికార్డు**

ప్రపంచ క్రికెట్‌లో ఓ పేస్ యోధుడి శకం ముగిసింది. ఒకటా.. రెండా.. ఏకంగా 21 ఏళ్లపాటు అత్యంత సవాల్‌తో కూడిన టెస్టు ఫార్మాట్‌ను శాసించిన ఇంగ్లండ్ గ్రేట్ జేమ్స్ మైకేల్ అండర్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు అధికారికంగా వీడ్కోలు పలికాడు. వెస్టిండీస్‌తో జరిగే తొలి టెస్టే తన కెరీర్‌లో ఆఖరిదని 41 ఏళ్ల జిమ్మీ గతంలోనే ప్రకటించాడు. తాజాగా ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో ఇంగ్లండ్ విజయం సాధించడంతో.. తన అరంగేట్ర టెస్టు వేదిక లార్డ్స్‌లోనే ఆఖరి మ్యాచ్‌ను కూడా ఘనంగా ముగించినట్టయ్యింది. అలాగే ఈ మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసి గెలుపులోనూ భాగస్వామ్యం కావడం మరో విశేషం. అద్భుత స్వింగ్-సీమ్‌తో మైదానంలో ప్రత్యర్థి బ్యాటర్లను వణికించిన ఈ పేసర్ బయట వివాదరహితుడిగా కొనసాగాడు. వాస్తవానికి క్రికెట్‌లో ఓ బౌలర్ ఇంత సుదీర్ఘ ప్రయాణం కొనసాగించడమంటే ఆషామాషీ కాదు. గాయాలను తట్టుకుంటూ.. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకుని.. సుదీర్ఘ ఫార్మాట్‌లో తనదైన ముద్రను వేస్తూ ఇంగ్లండ్ తరఫున అత్యంత విజయవంతమైన బౌలర్‌గా అండర్సన్ నిలిచిన విధానం ఓ అద్భుతం. తన తరంతోపాటే కాదు.. తర్వాతి తరంతోనూ ఆడి మురిపించడం అతడికి మాత్రమే సాధ్యమైంది. అందుకే ఓ పేసర్ కెరీర్‌లో ఎవరికీ సాధ్యం కాని రీతిలో 700 వికెట్లకు పైగా తీయగలిగాడు. 2002లో వన్డేల్లో అరంగేట్రం చేసిన అండర్సన్ తర్వాతి ఏడాది తొలి టెస్టును ఆడాడు. అలాగే చివరి టీ20ని 2009లో.. చివరి వన్డేను 2015లో ఆడగా, అప్పటి నుంచి పూర్తిగా టెస్టులపైనే దృష్టి సారించాడు. ఇక మూడు ఫార్మాట్లలో కలిపి ఆడిన 401 మ్యాచ్‌ల్లో 991 వికెట్లు తీశాడు. రికార్డుల విషయానికి వస్తే.. మురళీధరన్ (800), వార్న్ (708) తర్వాత టెస్టుల్లో అత్యధిక వికెట్లు (704) తీసిన మూడో బౌలర్‌గా కొనసాగుతున్నాడు. అలాగే సచిన్ (200) తర్వాత ఎక్కువ టెస్టులు (188) ఆడింది కూడా జిమ్మీనే.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

## అమ్మాయిల ఆసియా కప్‌లో ఫ్యాన్స్‌కు ఎంట్రీ ఫ్రీ

**19న భారత్, పాక్ మ్యాచ్‌తో టోర్నీ షురూ**

కొలంబో: మహిళల టీ20 ఆసియా కప్‌లో అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. ఈ మేరకు శ్రీలంక క్రికెట్ బోర్డు ఈ విషయాన్ని శుక్రవారం వెల్లడించింది. మొత్తం ఎనిమిది జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీ తొలి మ్యాచ్ 19న భారత్-పాక్ జట్ల మధ్య జరుగనుంది. గ్రూప్-ఎలో భారత్, పాకిస్థాన్, యూఏఈ, నేపాల్ ఉండగా.. ఆతిథ్య శ్రీలంక, బంగ్లాదేశ్, మలేసియా, థాయ్‌లాండ్‌లకు గ్రూప్-బిలో చోటు దక్కింది. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి. ఈనెల 28న ఫైనల్ జరగనుంది.

## గ్రామీణ క్రికెటర్ల కోసం ఏం చేశారో చెప్పండి?

**హెచ్‌సీఏకు ముంబై హైకోర్టు నోటీసులు**

ముంబై: తెలంగాణలో గ్రామీణ క్రికెటర్ల అభివృద్ధి కోసం ఏం చేశారో తెలపాలంటూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)కు ముంబై హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలో గ్రామీణ స్థాయిలో క్రికెట్ అభివృద్ధికి చేసిన కార్యకలాపాలపై ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాలంటూ హెచ్‌సీఏను బీసీసీఐ ఆదేశించి మూడేళ్ల గడుస్తున్నా, ఆ ఆదేశాలను హెచ్‌సీఏ ఇప్పటికీ పట్టించుకోలేదంటూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ముంబై హైకోర్టును ఆశ్రయించింది. బీసీసీఐ ఆదేశాల అంశంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలంటూ తాము ఎన్నిసార్లు లేఖలు రాసినా హెచ్‌సీఏ నుంచి, అలాగే బీసీసీఐ నుంచి ఎలాంటి స్పందనా లేదనీ.. గ్రామీణస్థాయిలో క్రికెటర్లను హెచ్‌సీఏ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందంటూ హైకోర్టులో వేసిన ఆ పిటిషన్‌లో టీసీఏ కార్యదర్శి గురవారెడ్డి పేర్కొన్నాడు. దీనిపై గురువారం విచారణ చేపట్టిన కోర్టు.. ఈ పిటిషన్‌పై మూడు వారాల్లోగా సమాధానం చెప్పాలని హెచ్‌సీఏతో పాటు బీసీసీఐకి నోటీసులు పంపింది.



న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లా..

## రాయదుర్గంలో టి-స్క్వేర్

1 నాలెడ్జ్ సిటీ దగ్గర్లో ఐకానిక్ ప్లాజా
1 ఏర్పాటు ప్రణాళికల్లో టీజీఐఐసీ
1 పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే యోచన
1 ఆగస్టు 9లోగా బిడ్ దాఖలుకు చాన్స్

12

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


శనివారం | 13-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 88 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ*

# గెలవాలంటే గ్రేటరే

## పెరగనున్న అసెంబ్లీ సీట్లు.. అధికం గ్రేటర్ హైదరాబాద్, హెచ్ఎండీఏలోనే

### నియోజకవర్గాల పునర్విభజనకు అనుగుణంగానే ముఖ్యమంత్రి రేవంత్ పావులు

- ఈ నేపథ్యంలోనే రాజధాని ప్రాంతంపై సీఎం ప్రత్యేక దృష్టి
- మూసీ సుందరీకరణ, ఓఆర్ఆర్ దాకా జీహెచ్ఎంసీ విస్తరణ
- శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణం, మెట్రో లైన్ పొడిగింపు
- టి-స్క్వేర్ వంటి పలు అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి దృష్టి
- రాజకీయంగానూ కాంగ్రెస్ బలోపేతానికి ప్రయత్నాలు
- జీహెచ్ఎంసీ పరిధిలో 24 సీట్లు 50కి పెరిగే అవకాశం
- రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 153కు
- మొత్తం సీట్లలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూడోవంతు!
- అధికారాన్ని సాధించడానికి అత్యంత కీలకమైన ప్రాంతమిది
- ఈ ఏడాది చివర్లో మొదలుకానున్న జనగణన ప్రక్రియ!



ముఖ్యమంత్రి రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రకాశ్‌గౌడ్. చిత్రంలో పట్నం మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. డీలిమిటేషన్ అంటూ జరిగితే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఎక్కువగా సీట్లు పెరిగే అవకాశం ఉండడం, గత ఎన్నికల్లో ఈ ప్రాంతంలో కాంగ్రెస్ ఆశించిన రీతిలో పట్టు చూపలేకపోయిన నేపథ్యంలో.. వచ్చే ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేసే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో రకరకాల అభివృద్ధి ప్రాజెక్టులకు ఎక్కువగా ప్రాధాన్యమిస్తూ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణలో తదుపరి శాసనసభ ఎన్నికలు పెరిగిన నియోజకవర్గాలతోనే జరుగుతాయి. పునర్విభజనతో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెరగడంతో పాటు ఇప్పుడున్న వాటి పరిధులు కూడా మారుతాయి. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాలు పునర్విభజనతో 153కు పెరగాలి. అయితే, తాజా జనాభా

మిగతా 9వ పేజీలో...

### కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

1 సీఎం సమక్షంలో చేరిన బీఆర్ఎస్ సభ్యుడు
1 కాంగ్రెస్‌లో 8కి పెరిగిన గులాబీ ఎమ్మెల్యేలు
1 నేడు చేరనున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

11



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ భేటీలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి



## రాష్ట్రంలో నిస్సిగ్గుగా

# ఫిరాయింపులు

- నడిరోడ్డుపై రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారు
- గాంధీభవన్, తెలంగాణ భవన్‌ల మధ్య తేడా లేదు
- రాష్ట్రాన్ని దోచి ఢిల్లీకి సూట్‌కేసులు పంపుతున్నారు
- సీఎం రేవంత్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం
- కేసీఆరే ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి పంపుతున్నారు
- రాహుల్.. దమ్ముంటే ఓయూకు రా: సంజయ్
- బీజేపీ అధికారంలోకి వస్తే కార్యకర్తే సీఎం: ప్రధాన్
- ఇంజనీరింగ్, వైద్య కళాశాలల నుంచి
- ట్రిపుల్ ఆర్ ట్యాక్స్.. అందుకే అధిక ఫీజులు: ఈటల
- ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి
- కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసు కూడా..
- బీజేపీ రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశంలో 15 అంశాలతో తీర్మానం

12

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిస్సిగ్గుగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని సీఎం రేవంత్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి రాజ్యాంగాన్ని నడిరోడ్డుపై అవహేళన చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రధానంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం, రాష్ట్రాన్ని దోపిడీ చేసి ఢిల్లీకి సూట్‌కేసులు పంపించడం మాత్రమే జరుగుతున్నాయని చెప్పారు. పార్టీ ఫిరాయించినవారిని అనర్హులుగా ప్రకటించాలంటూ ఎన్నికల ముందు న్యాయ్‌పత్ర్‌లో పేర్కొన్న కాంగ్రెస్, ఇప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. ఈ విషయంలో బీఆర్ఎస్ కంటే తామేం తక్కువ కాదన్నట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. అప్పులు చేయడం, భూములు, మద్యం అమ్మకాలతోనే రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొస్తోందని విమర్శించారు. బెల్టు షాపులను ఎత్తివేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక వాటి సంఖ్య పెంచేశారని ఆరోపించారు. శుక్రవారం శంషాబాద్‌లో కిషన్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి

మిగతా 12వ పేజీలో...

# కలెక్టర్లు కదలాలి

**క్షేత్రస్థాయిలో పర్యటించాలి**

- స్కూళ్లు, ఆస్పత్రులను తనిఖీ చేయాలి
- తాగునీరు, పారిశుధ్యం పరిశీలించాలి
- పింఛన్ల అమలును సమీక్షించాలి
- ప్రజలతో కలిసిపోయి మాట్లాడాలి
- అధికారులూ పర్యటించేలా చూడాలి
- అప్పుడే ప్రభుత్వంపై విశ్వాసం
- 5లోపు 'టూర్‌డైరీ' సీఎస్‌కు పంపాలి
- పనితీరుతోనే రివార్డులు, పనిష్మెంట్లు
- స్పష్టం చేసిన సర్కారు.. ఉత్తర్వులు



ఖమ్మం జిల్లా మిట్టపల్లిలో రైతులతో సంభాషిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్(ఫైల్)

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్లు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు కూడా పర్యటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించింది. లబ్ధిదారులతో, స్థానిక ప్రభుత్వ సిబ్బందితో మమేకం కావాలని, వారితో ఇష్టాగోష్ఠిగా మాట్లాడి... పథకాలు, కార్యక్రమాలు ఏ మేరకు చేరుతున్నాయి, లక్ష్యసాధనలో ఆయా పథకాలు ఎంతవరకు సఫలీకృతమవుతున్నాయన్న వివరాలు సేకరించాలని నిర్దేశించింది. ఈ వివరాలన్నింటితో

మిగతా 11వ పేజీలో...

### హైడ్రాకు ప్రత్యేక నిధులు

- హైదరాబాద్ విస్తరణకు అనుగుణంగా ఏర్పాటు
- నిర్మాణం, విధివిధానాలపై అధ్యయనం చేయండి
- విపత్తుల నుంచి ఆస్తుల సంరక్షణ వరకు బాధ్యత
- మునిసిపల్ అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ వెల్లడి

11

**చేపపిల్లల పంపిణీకి 114 కోట్లు!**

- 86 కోట్ల చేప, 10 కోట్ల రొయ్య పిల్లలు
- ధరలు ఖరారు.. నోటిఫికేషన్ జారీ
- టెండరు దాఖలుకు 23 దాకా గడువు

### కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్

10

ఈడీ కేసులో మంజూరు చేసిన సుప్రీం కోర్టు.. పలు షరతులు

సీబీఐ కేసులో 25వరకు కస్టడీ

### డీడీలు వాపస్

11

గొర్రెల పథకంలో 45వేల డీడీలు వెనక్కివ్వాలని సర్కారు నిర్ణయం




**ఎమర్జెన్సీ ప్రకటించిన జూన్ 25..**

## రాజ్యాంగ హత్యా దినం

- కేంద్ర ప్రభుత్వ సంచలన నిర్ణయం
- బాధితులు, పోరాట వీరుల స్మరణ
- ఇందిర.. ప్రజాస్వామ్యం గొంతునొక్కారు
- ఆ చీకటి రోజులకు నిరసనగానే..: షా
- అత్యవసర పరిస్థితి.. దేశ చరిత్రపై కాంగ్రెస్ రాసిన చీకటి అధ్యాయం
- రాజ్యాంగాన్ని తొక్కిపెట్టారు: మోదీ
- **మోదీ ముక్త్ దివస్‌గా జూన్ 4**
- 'రాజ్యాంగం హత్య' ఏమిటి..?
- అంబేడ్కర్‌ను అవమానించడమే: ఖర్గే

10

## ప్రైవేటు ఏజెన్సీతో పక్కా సమాచారం!

- స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువల సవరణపై సమాచార సేకరణ
- విధివిధానాలపై ప్రభుత్వం కసరత్తు
- నివేదిక అనంతరం తుది నిర్ణయం!

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించి రిజిస్ట్రేషన్ల విలువలను సవరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువలు ఒకరకంగా.. బహిరంగ మార్కెట్‌లో మరో రకంగా ఉన్నాయి. స్థిరాస్తుల (భూములు, ప్లాట్లు, ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ఖాళీ స్థలాలు) మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల విలువ మధ్య ఉన్న ఈ వ్యత్యాసాలను తెలుసుకొని.. శాస్త్రీయంగా ధరలు నిర్ధారించాలని సర్కారు భావిస్తోంది. ఇందుకుగాను క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర సమాచారం సేకరించి, నివేదిక

మిగతా 9వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# ప్రచండ నిష్క్రమణ!

నేపాల్ ప్రధానిగా ఉన్న గత ఏడాదిన్నరకాలంలో నాలుగుసార్లు అవిశ్వాసం ఎదుర్కొని పదవిని కాపాడుకోగలిగిన పుష్పకుమార్ దహల్ అలియాస్ ప్రచండ, శుక్రవారం నాటి అవిశ్వాసతీర్మానంలో ఘోరంగా ఓడిపోయి రాజీనామా చేయాల్సివచ్చింది. అరవైతొమ్మిదేళ్ళ ప్రచండకు అనుకూలంగా అరవైమూడు ఓట్లు వస్తే, వ్యతిరేకంగా 194 ఓట్లు పడ్డాయి. మొన్న మూడోతేదీ పరిణామం తరువాత ఆయన నిష్క్రమణ ఖాయమైపోయింది. ఇంతకాలమూ ఆయనను ప్రధాని పదవిలో కూచోబెట్టిన కేపీ శర్మ ఓలి మళ్ళీ తాను ప్రధాని కావడం కోసం సభలో అతిపెద్ద పార్టీగా ఉన్న నేపాలీ కాంగ్రెస్‌తో ఒప్పందం కుదర్చుకున్నారు. నేపాలీ కాంగ్రెస్‌కు 89స్థానాలు, శర్మ నేతృత్వంలోని సీపీఎన్–యుఎంఎల్‌కు 78సీట్లు ఉన్నందున, 138స్థానాల కనీస బలాన్ని ఈ కూటమి గట్టిగానే దాటింది. ఓలి కాబోయే ప్రధాని అని నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవ్‌బా వారం క్రితమే తేల్చేశారు.

ఈ రెండు ప్రధాన పార్టీల మధ్యా ఏడుసూత్రాల ఒప్పందం కుదరడంతో కలసికట్టుగా ప్రచండను దించేశాయి, ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమని దేశాధ్యక్షుడికి విజ్ఞప్తిచేసుకున్నాయి. ఇంకా కొన్ని కీలకమైనశాఖల పంపకం దగ్గర లెక్కలు తేల్చుకోవాల్సి ఉన్నదనీ, మిత్రపక్షం నుంచి డిప్యూటీ పీఎంను పెట్టుకోవడం శర్మకు ససేమిరా ఇష్టం లేదనీ వార్తలు వస్తున్నాయి. ఇక, కనీస ఉమ్మడి కార్యాచరణ వంటి మాటలు ప్రజలకు అర్థంకానివేమీ కావు. ఈ కొత్తకూటమితో తమకు ఒరిగేదేమీ ఉండదనీ, ఈ పరిణామం తమకు సంబంధించింది కాదని వారికి తెలుసు. తొలి ఏడాదిన్నర డెబ్బైరెండేళ్ళ ఖడ్గప్రసాద్ శర్మ ఓలీ ప్రధానిగా ఉండి, ఆ తరువాత డెబ్బయ్ఎనిమిదేళ్ళ దేవ్‌బా ఆ పదవిని అలంకరిస్తారన్నది ఈ ఒప్పందంలోని ప్రధానమైన అంశం. అంటే, ప్రచండ ఏడాదిన్నర ప్రధానిగా ఉన్నారు కనుక, ఆయనను దించేసి మిగతాకాలాన్ని వీరిద్దరూ పంచుకున్నారు. వీరి కలయికని అక్రమం, అనైతికం అంటున్నారు ప్రచండ.

ఈ రెండుపార్టీలతో పోల్చితే తక్కువ బలంతో, కేవలం ముప్పైరెండు సీట్లతో సభలో మూడోస్థానంలో ఉన్న ప్రచండ ఇంతకాలం ప్రధానిగా ఉండగలగడం విశేషం. 2022 నవంబరు ఎన్నికల తరువాత ఆయన అటు నేపాలీ కాంగ్రెస్, ఇటు సీపీఎన్-యుఎంఎల్ రెండింటినీ మార్చిమార్చి వాడుకొని పదవిలో కొనసాగారు. యుఎంఎల్ మద్దతుతో ప్రధాని అయిన ఆయన ఆ తరువాత దేవ్‌బాతో కలిశారు. నేపాలీ కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తిని రాష్ట్రపతి అభ్యర్థిగా సమర్థించి శర్మకు పొగబెట్టేశారు. ఆ తరువాత నేపాలీ కాంగ్రెస్‌తో విభేదాలు వచ్చి మొన్నమార్చిలో మళ్ళీ కేపీశర్మ ఓలీతో చేతులు కలిపారు. నడిరోడ్డుమీద బిచ్చమైనా ఎత్తుకుంటాను కానీ, ఓలీతో చేతులు కలిపేది లేదని ప్రచండ గతంలో చేసిన ప్రతిజ్ఞ ఆ సందర్భంగా చాలామందికి గుర్తుకు వచ్చింది. ఆ వెంటనే ఉపప్రధాని నారాయణ్ కాజీ శ్రేష్ఠ చైనా వెళ్ళి, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్టుల విషయంలో తిరిగి కాస్తంత కదలిక తెచ్చారు. కేపీశర్మ ఓలి చైనాకు సన్నిహితుడు కావడం, రెండు కమ్యూనిస్టు పార్టీలూ చేతులు కలిపిన ఈ సందర్భంలో చైనాను సంతోషపెట్టడం ఆ పర్యటన లక్ష్యం. ఇప్పుడు కూడా పదవినుంచి దిగిపోయేముందు ప్రచండ బీఆర్ఐకు సంబంధించి కొన్ని మంత్రివర్గ నిర్ణయాలు తీసుకున్నారని, ఇది కొత్త కూటమిని ఇరకాటంలో పెట్టడం లక్ష్యంగా జరిగిందని వార్తలు వస్తున్నాయి.

ఏ పార్టీకీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల బలం లేని త్రిశంకుస్థితిలో ప్రచండ మిగతా రెండుపెద్ద పార్టీలను వరుసగా వాడుకొని ఇంతకాలం పదవిలో కొనసాగగలిగారు. ఆయనను ఇలా మార్చిమార్చి మోసేకంటే, తామే అధికారాన్ని పంచుకోవడం ఉత్తమమని ఆ రెండు పార్టీలు ఇప్పుడు నిర్ణయించుకున్నాయి. గత పదహారు సంవత్సరాల్లో నేపాల్ పదమూడు ప్రభుత్వాలను చూసింది. ఎన్నికల విధానంలో సంస్కరణలతో ఈ అస్థిరతను పరిష్కరించాలని కొత్తకూటమి భావిస్తోందట. ఈ పొత్తు ఎంత కాలం అన్నది అసలు ప్రశ్న. రాబోయే ఏడాదిన్నర చక్కగా నిలిచినా, ఆ తరువాత కేపీశర్మ ఓలీ ప్రధాని పదవిని నేపాలీ కాంగ్రెస్‌కు అప్పగిస్తారన్న నమ్మకమైతే లేదు. అధికారాన్ని పంచుకొనే విషయంలో గతంలో ప్రచండతో ఈయన అన్యాయంగా వ్యవహరించిన చరిత్ర అందరికీ తెలిసిందే.

# కొత్త నేర చట్టాలపై జవాబు లేని ప్రశ్నలు

భారత శిక్షాస్మృతి (ఐపిసి), 1860; నేర విచారణా స్మృతి (సిఆర్‌పిసి), 1973; భారత సాక్ష్యాధార చట్టం (ఐఇఎ), 1872 రద్దు చేసి వాటి స్థానంలో కొత్త శాసనాలను ప్రవేశపెట్టడానికి ఉద్దేశించిన బిల్లులు, వాటిపై చర్చను సహేతుక కారణాలతో ప్రతిపక్షాలు బహిష్కరించిన తరువాత, పార్లమెంటు ఆమోదం పొందాయి. కొత్త బిల్లులకు (వాటి ఆంగ్ల పాఠాలకు సైతం) హిందీ (లేదా సంస్కృతం)లో నామకరణం చేశారు. రాష్ట్రపతి ఆ బిల్లులకు ఆమోదం తెలిపారు. కొత్త నేర చట్టాలు జూలై 1, 2024 నుంచి అమలులోకి రానున్నాయని ప్రభుత్వం నోటిఫై చేసింది.

కొత్త నేర చట్టాలను ప్రతిపక్షాలే కాదు, న్యాయకోవిదులు, పౌర సమాజ ప్రముఖులు తీవ్రంగా వ్యతిరేకించారు. అన్ని ఆక్షేపణలను ప్రభుత్వం కొట్టివేసింది. కొత్త నేర చట్టాలపై విమర్శలు, అభ్యంతరాలు అసంబద్ధమైనవని, రాజకీయ దురుద్దేశాలతో కూడినవని ప్రభుత్వం ఆరోపించింది. పార్లమెంటు ఆమోదించిన నేర చట్టాలను యథాతథంగా అమలుపరుస్తామని స్పష్టం చేసింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతో ఏకీభవించలేదు. కొత్త నేర చట్టాలను తమ శాసన సభలలో నిర్దిష్ట సవరణలతో మాత్రమే తాము ఆమోదిస్తామని స్పష్టం చేశాయి. ఎటువంటి మార్పులు చేయాలో నెలరోజులలోగా సూచించాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం ఒక ఏక సభ్య కమిటీ నేర్పాటు చేసింది. కర్ణాటక, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇదే మార్గాన్ని అనుసరించవచ్చు. ఈ దృష్ట్యా కొత్త నేరచట్టాల వాస్తవాలు, సమస్యలను ప్రజలకు విపులంగా నివేదించవలసిన అవసరమున్నది. ప్రజలు తమ సొంత అభిప్రాయానికి రావడానికి ఆ నివేదన తోడ్పడగలదు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

'క్రిమినల్ లా' (క్రిమినల్ న్యాయ శాసనం) ఉమ్మడి జాబితాలోని అంశం. కనుక ఈ అంశంపై చట్టాలు చేసే అధికారాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండిటికీ ఉంది. కేంద్రం చేసిన ఒక చట్టం, ఒక రాష్ట్ర శాసనసభ చేసిన ఒక చట్టం పరస్పర ప్రతికూలంగా ఉన్న పక్షంలో రాజ్యాంగంలోని అధికరణ 254 నిర్దేశించిన విధంగా వెళ్లవలసి ఉంటుంది. అయితే ఇది, ఒక రాష్ట్ర శాసనసభ ఒక చట్టాన్ని తీసుకువచ్చిన తరువాత దాన్ని రాష్ట్రపతి ఆమోదించని పక్షంలో తలెత్తే సమస్య.

ఇదిలా వుండగా కొత్త నేర చట్టాలను వ్యతిరేకిస్తున్న వారి ప్రశ్నలకు సమాధానామివ్వవలసి ఉన్నది. దురదృష్టవశాత్తు ప్రభుత్వం వాటికి పార్లమెంటులో గానీ, పార్లమెంటు వెలుపల గానీ జవాబిచ్చేందుకు అంగీకరించడంలేదు ఆ ప్రశ్నలు ఏమిటో వివరంగా పేర్కొంటాను: (1) కొత్త చట్టాలలోని అత్యధిక నిబంధనలు రద్దయిన మూడు చట్టాల నుంచి తీసుకున్నవే అన్న ఆక్షేపణ సరైనదేనా? ఐపిసి, సిఆర్‌పిసి నుంచి 90 నుంచి 95 శాతం మేరకు ఐఇఎ నుంచి 95 నుంచి 99 శాతం మేరకు నిబంధనలను కొత్త చట్టాలలో యథాతథంగా ఉంచి, ప్రతి సెక్షన్‌కు కొత్త క్రమసంఖ్య నిచ్చారన్న విమర్శ నిరాధారమైనదా? అమలులో ఉన్న చట్టాలలో మార్పులు, చేర్పులు అవసరమైనపక్షంలో సవరణల ద్వారా వాటిని ఎందుకు చేయకూడదు? కొత్త నేర చట్టాలతో వలసపాలన వారసత్వానికి' ముగింపు పలికామన్న ప్రభుత్వ వాదన ఒక తప్పుడు వాదన కాదా?



ఒక వ్యక్తిని అరెస్ట్ చేసేందుకు లేదా పోలీస్ కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులకు కొత్త చట్టాలు మరిన్ని అధికారాలు ఇవ్వలేదా? అరెస్ట్ చేయడానికి అధికారాలు ఉండడమంటే విధిగా అరెస్ట్ చేయడానికి కాదు అన్న సుప్రీం కోర్టు నిర్దేశాన్ని కొత్త చట్టాలు ఎందుకు ఉపేక్షించాయి? ... ఇలా కొత్త నేర చట్టాలపై అనేక మంది అనేక ప్రశ్నలు అడుగుతున్నారు. ప్రభుత్వంలో ఉన్నవారు గానీ, అధికారపక్షం నాయకులు గానీ ఇంతవరకూ ఏ ప్రశ్నకూ సమాధానమివ్వలేదు. అయినంత మాత్రాన ఆ ప్రశ్నలు సమసిపోతాయా?

2) కొత్త చట్టాలను తీసుకురావడంలో ప్రభుత్వ ఉద్దేశం నేర చట్టాలను సమగ్రంగా, మౌలికంగా సవరించడమే అయితే, మన సువ్యవస్థిత రాజ్యాంగ సంప్రదాయం ప్రకారం, ఆ అంశాన్ని లా కమిషన్ పరిశీలనకు ఎందుకు నివేదించలేదు? నేర చట్టాలలో మార్పులపై సంబంధిత వ్యక్తులు, వ్యవస్థలను సంప్రదించి, ముసాయిదా బిల్లులతో సహా సిఫారసులను ప్రభుత్వం, పార్లమెంటు పరిశీలనకు సమర్పించేందుకు లా కమిషన్ అర్హమైన సంస్థ కదా? ఈ బాధ్యతను లా కమిషన్‌కు కాకుండా న్యాయశాస్త్ర ఆచార్యులతో కూడిన వేరే కమిటీకి ఎందుకు అప్పగించారు?

3) కొత్త నేర చట్టాలు నేర న్యాయశాస్త్ర సూత్రాలకు అనుగుణంగా ఉన్నాయా? గత పదేళ్లలో దేశ సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన ప్రముఖ తీర్పులు నిర్దేశించిన ప్రగతిశీల న్యాయసూత్రాలను గుర్తించి కొత్త చట్టాలలో చేర్చారా? కొత్త చట్టాలలోని అనేక నిబంధనలు భారత రాజ్యాంగానికి సుప్రీం కోర్టు ఇచ్చిన వివరణలు, ఆ మౌలిక శాసనంపై సర్వోన్నత న్యాయస్థానం భాష్యానికి విరుద్ధంగా లేవా?

4) అనేక ప్రజాస్వామిక దేశాలు రద్దు చేసిన మరణశిక్షను కొత్త చట్టాలు ఎందుకు ఆమోదిస్తున్నాయి? పైగా 'ఏకాంత నిర్బంధం' అనే క్రూర, అమానుష శిక్షను ఎందుకు ప్రవేశపెట్టారు? 'వ్యభిచారం'ను మళ్లీ కొత్త చట్టాలలోకి ఎందుకు తీసుకువచ్చారు? పరువునష్టం వ్యవహారాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించడం తప్పనిసరా? 'పరువునష్టం'పై ఒక క్రిమినల్ ఫిర్యాదును దాఖలు చేసేందుకు నిర్దిష్ట కాలపరిమితిని విధించడమూ తప్పనిసరా? 'కమ్యూనిటీ సర్వీస్ (నేరం చేసిన వ్యక్తి జైలుకు వెళ్లడానికి బదులు చేసే సేవ) శిక్షను స్పష్టంగా ఎందుకు నిర్వచించలేదు. కమ్యూనిటీ సర్వీస్ అంటే ఏమిటో కనీసం ఉదాహరణలు కూడా ఎందుకు ఇవ్వలేదు?

5) 'రాజద్రోహం' నేరాన్ని విస్తృతపరిచి, దేశ ద్రోహంగా మార్చి కొత్త నిబంధనలతో ఎందుకు ఉంచారు? 'ఉగ్రవాద' నేరాలపై విచారణకు 'చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఊపా) అనే శాసనం ఉండగా ఆ నేరాలను సాధారణ నేర న్యాయవిచారణ చట్టం పరిధిలోకి ఎందుకు తీసుకువచ్చారు? ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950; ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 అనే ప్రత్యేక చట్టాలు ఉండగా ఎన్నికల సంబంధిత నేరాలను కొత్త చట్టాల పరిధిలోకి ఎందుకు చేర్చారు?

6) ఒక వ్యక్తిని అరెస్ట్ చేసేందుకు లేదా పోలీస్ కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులకు కొత్త చట్టాలు మరిన్ని అధికారాలు ఇవ్వలేదా? అరెస్ట్ చేయడానికి అధికారాలు ఉండడమంటే విధిగా అరెస్ట్ చేయడానికి కాదు అన్న సుప్రీంకోర్టు నిర్దేశాన్ని కొత్త చట్టాలు ఎందుకు ఉపేక్షించాయి? 'బెయిల్ అనేది నియమం, జైలు మినహాయింపు' అన్న న్యాయసూత్రాన్ని కొత్త చట్టాల్లో స్పష్టంగా చేర్చడం తప్పనిసరి కాదా? అరెస్ట్ న్యాయబద్ధతను, అరెస్ట్ ఆవశ్యకతను మెజిస్ట్రేట్ నిర్ధారించడం తప్పనిసరి కాదా? అరెస్ట్ అయిన 40 నుంచి 60 రోజుల తరువాత సైతం మెజిస్ట్రేట్ బెయిల్ నిరాకరించేందుకు అనుమతించే నిబంధనలు సక్రమంగా ఉన్నాయా?

7) నేరం ఎక్కడ జరిగినప్పటికీ దానిపై ఎఫ్ఐఆర్‌ను దేశంలోని ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా దాఖలు చేసేందుకు అనుమతినిస్తున్న నిబంధన రాజ్యాంగ విహితమేనా? 'పోలీస్' అనే అంశం రాష్ట్ర జాబితాలోది కనుక ఎఫ్ఐఆర్ ఏ రాష్ట్రంలో అయితే నమోదయిందో ఆ రాష్ట్ర పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి నేర దర్యాప్తునకు పూనుకోవడం రాజ్యాంగ విరుద్ధం కాదా? సదరు నిబంధనలు రాజ్యాంగ మౌలిక లక్షణమైన 'సమాఖ్య పాలన' స్ఫూర్తిని కాలరాచివేయడం లేదూ?

కొత్త నేర చట్టాల రాజ్యాంగబద్ధతపై ఇంకా అనేక ప్రశ్నలు ఉన్నాయి. వాటికి సమాధానమిచ్చేది ఎవరు? ప్రభుత్వంలో ఉన్నవారు గానీ, అధికార పక్షం నాయకులు గానీ ఇంతవరకూ ఏ ప్రశ్నకూ సమాధానమివ్వలేదు. అయినంత మాత్రాన ఆ ప్రశ్నలు సమసిపోతాయా? అయినా నేర విచారణ న్యాయపాలనకు ప్రాతిపదికలు అయిన ఆ కొత్త చట్టాలు ఇప్పటికే అమలులోకి వచ్చాయి. కొంత మంది ప్రజల కోసం కొంత మంది ప్రజలతో నడిచే ప్రభుత్వానికి ఇదొక ఉదాహరణ.


(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

# బౌలర్ల కంటే బ్యాట్స్‌మెన్‌కు ప్రాధాన్యమెందుకు?

క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆత్మకథ 'I Have the Streets : A Kutty Cricket Story' కవర్ చూసి ఆశ్చర్యపోయాను. రచయిత తెల్ల ప్యాంటు, తెల్ల షర్టులో, ఒక బ్యాట్ పిడిని తన చేతులతో పట్టుకుని కూర్చున్న భంగిమలో ఉన్న ఛాయాచిత్రమది. ఒక వికెట్ పడిపోవడం కోసం వేచి చూస్తూ తన సమయం వచ్చినప్పుడు డ్రెస్సింగ్ రూం నుంచి గ్రౌండ్‌లోకి దూసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్న ఆటగాడిని ఆ కవర్‌పై ఉన్న అశ్విన్ బొమ్మ తలపిస్తుంది. ఇప్పుడు నేను అశ్విన్ బ్యాటింగ్ చేయగలడని అర్థం చేసుకున్నాను. అశ్విన్ ఆత్మకథ ప్రచురితం కావడానికి చాలా కాలం ముందే స్కూల్ బాయ్ క్రికెట్‌లో వికెట్లు తీసుకోవడం కంటే పరుగులు చేయడంలో సామర్థ్యానికే బాల అశ్విన్ ప్రసిద్ధుడని అందరికీ తెలుసు. అశ్విన్ ఆటను నేను ప్రత్యక్షంగా చూడలేదు. నేను ఎక్కువగా టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లనే చూస్తాను (కొన్ని కారణాల వల్ల ఈ రోజుల్లో బెంగళూరులో టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లు పెద్దగా జరగడం లేదు). అయినప్పటికీ టీవీలో అశ్విన్ ఆటను చూసిన జ్ఞాపకాలు నా మనస్సులో పదిలంగా ఉన్నాయి.

నా మనోనేత్రంలో ఒక ఫాస్ట్ బౌలర్ వేసిన బంతిని అశ్విన్ ఎంత నేర్పుగా, సొగసుగా ఎదుర్కొన్నాడో కనిపిస్తూనే ఉన్నది. బంతిని స్పిన్నర్ తల మీదగా సైట్ స్క్రీన్ వైపుకు కొట్టిన దృశ్యమూ నా మనోనేత్రం నుంచి చెరిగిపోలేదు. టెస్ట్ క్రికెట్‌లో అశ్విన్ ఆడిన రెండు అతి ముఖ్యమైన ఇన్నింగ్స్‌లో ఈ రెండు షాట్‌లు సంభవించలేదు. 2021లో జనవరి, ఫిబ్రవరి నెలల్లో వేర్వేరు గ్రౌండ్స్‌లో భిన్న ప్రత్యర్థులపై ఆడిన సందర్భంలో అవి చోటుచేసుకున్నాయి. మొదటిది సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో సంభవించింది. ఆస్ట్రేలియన్ ఆటగాళ్ల దాడిని హనుమ విహారితో కలిసి అశ్విన్ సమర్థంగా ఎదుర్కొన్నారు. ఇద్దరూ కలిసి 40 ఓవర్ల్ దాకా ఉండి, ఏ జట్టూ గెలవని స్థితి కల్పించి తమ జట్టుకు ఒక సానుకూలతను సృష్టించారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే తమ జట్టును ఒక ఎపిక్ డ్రాకు తీసుకువెళ్లారు. ఓవర్ల్ మధ్య అశ్విన్, విహారి ఇరువురూ సుదీర్ఘంగా మాటా మంతీ జరిపారు. అది తమిళంలో జరిగిందని ఆ తరువాత వెల్లడయింది. ఇది చెపాక్ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లను వీక్షించేందుకు తరచుగా వచ్చే వారికి సంతృప్తి కలిగించి ఉండవచ్చు గానీ పొట్టి శ్రీరాములు భావజాల వారసులకు మనస్తాపం కలిగించిందేమో?!

నా మనోనేత్రంలో కదులుతున్న అశ్విన్ రెండో ఇన్నింగ్స్ ఆయన హోమ్ గ్రౌండ్ అంటే చెన్నైలో ఇంగ్లాండ్‌కు వ్యతిరేకంగా ఆడింది. భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో లీడ్‌లో ఉన్నప్పటికీ రెండో ఇన్నింగ్స్‌లో బాగా వెనుకబడిపోయింది. అప్పుడు అశ్విన్ గ్రౌండ్‌లోకి వచ్చాడు. కోహ్లీ, కుల్దీప్, ఇషాంత్, సిరాజ్‌లతో కలిసి భారత్ పరుగులను 286కు తీసుకువెళ్లి విజయాన్ని సులభసాధ్యం చేశాడు. అశ్విన్ స్వయంగా సెంచరీ సాధించాడు. అశ్విన్ బ్యాటింగ్ చేయగలడని నాకు తెలుసు. అతని పుస్తకం కొన్నవారికి, కొనేవారికి కూడా ఆ విషయం తెలుసు. భారత క్రికెట్ చరిత్రలో అశ్విన్ తన బౌలింగ్ సామర్థ్యానికే జ్ఞాపకముండిపోతారు. అయినప్పటికీ 500కి పైగా టెస్ట్ వికెట్‌లను పడగొట్టిన ఆటగాడు, అనీల్ కుంబ్లేను మినహాయిస్తే భారత్‌కు ఎన్నో టెస్ట్ మ్యాచ్‌లను గెలిచిన క్రీడా మేటి తన ఆత్మకథ పుస్తకం అట్టపై బ్యాట్ పట్టుకుని ఉన్న తన ఫోటోను ఎందుకు ముద్రింపచేశారు? నేను ఎప్పుడూ అశ్విన్‌ను స్వయంగా కలుసుకోలేదు. అయితే ఆయన గురించి నేను చదివిన, విన్నదాన్ని బట్టి ఆయన దృఢమైన, ఆలోచనాదాయకమైన అభిప్రాయాలు కలవాడని తెలిసింది. ఆయన ఆత్మకథ అట్టపై ఫోటోను ఎంపిక చేసింది ప్రచురణ కర్త గాని, రచనా సహకారి సిద్ధార్థ మోనిజియా గానీ కాదని, అశ్వినే స్వయంగా ఆ చిత్రాన్ని ఎంచుకున్నారని నిర్ధారణ అయింది. బాల్‌ను కాకుండా బ్యాట్‌ను పట్టుకున్న విధంగా తన బొమ్మ ఆత్మకథ కవర్‌పై ఉండాలని అశ్విన్ ఎందుకు కోరుకున్నారు?




akbar

ప్రముఖ బ్యాట్స్‌మెన్ స్టీవ్ వా, రికీ పాంటింగ్‌లు ఆస్ట్రేలియా టీమ్‌కు వరసగా 57, 72 సార్లు కెప్టెన్‌గా ఉన్నారు. అద్భుత బౌలర్ అయిన షేన్ వార్న్‌కు ఒక్కసారి అంటే ఒక్కసారి కూడా కెప్టెన్సీ బాధ్యత అప్పగించలేదు. టీమ్ ఇండియా కెప్టెన్ల ఎంపికలోనూ ఈ పక్షపాతం కనిపిస్తోంది. విరాట్ కోహ్లీ 69 టెస్ట్ మ్యాచ్‌లలోను, రోహిత్ శర్మ 16 టెస్ట్ మ్యాచ్‌లలోను కెప్టెన్‌గా ఉన్నారు. అశ్విన్ ఒక్కసారి కూడా టీమ్ ఇండియాకు కెప్టెన్‌గా లేరు. స్పిన్ బౌలర్లు సైతం సాటిలేని మేటి టెస్ట్ కెప్టెన్లు కాగలరని ఇంగ్లాండ్‌కు చెందిన రే ఇల్లింగ్ వర్త్, ఆస్ట్రేలియా ఆటగాడు రిచి బెనౌడ్‌లు నిరూపించలేదూ? ఆ కోవలోనివాడే మన అశ్విన్ కూడా.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఈ ప్రశ్నకు నేను కచ్చితమైన సమాధానాన్ని ఇవ్వలేను (భవిష్యత్తులో అశ్వినే ఇవ్వగలరని భావిస్తున్నాను). అయితే నేను కొన్ని ఊహలు చేయగలను. ఆ ఫోటోలో ఒక సంకేత సందేశం లేదా సందేశాలు ఏమైనా ఉన్నాయా? ప్రపంచ క్రికెట్ (ప్రత్యేకించి భారత క్రికెట్) క్రికెట్‌లో ప్రతిభాపాటవాలను గుర్తించి గౌరవించే విధానంలోని ఒక క్రూర వాస్తవాన్ని అందరి దృష్టికి తీసుకురావడానికి అశ్విన్ ప్రయత్నిస్తున్నారా? ఏమిటి ఆ క్రూర వాస్తవం? కీర్తి, కనకాలు, అభిమానుల ఆప్యాయతలు, ఎక్కువ ఆమోదాలను, మరిన్ని టీవీ ఆమోదాలను, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ సిరీస్ అవార్డులను, సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌లకు అత్యధికుల అభ్యర్థనలను బౌలర్స్ కంటే బ్యాటర్సే ఎందుకు ఎక్కువగా పొందుతున్నారు?

క్రికెట్ అభిమానులు బ్యాట్స్‌మెన్‌నే ఎందుకు మిక్కిలిగా గౌరవిస్తున్నారు? బ్యాటర్స్‌ను ఆ అందమైన ఆట ఉన్నత స్థాయి ఆటగాళ్లు కాగా, బౌలర్స్ అధిక శ్రమ చేసే నిమ్న శ్రేణి క్రీడాకారులు అనేది ఒక సత్యం. అయితే ఇది సర్వాజనామోదం పొందలేదు. బ్యాట్స్‌మెన్ పట్ల పక్షపాతం, బౌలర్స్ విషయంలో వివక్ష చూపే ధోరణులకు వ్యతిరేకంగా నేను చాలాసార్లు వాదించాను. అయితే నా గోసను ఎవరూ పట్టించుకోలేదు. తన ఆత్మకథ అట్టపై ఫోటో ఎంపిక, క్రికెట్‌లో తనకు ఉన్న సమున్నత స్థానంతో అశ్విన్ ఆ సత్యాన్ని మరింత సున్నితంగా, మరింత సూక్ష్మంగా చెప్తున్నారా?

మ్యాచ్‌ను గెలిచిన బ్యాటర్లకు, మ్యాచ్‌ను గెలిచిన బౌలర్ల కంటే ఎక్కువ ధన లాభం, పేరు ప్రఖ్యాతులు ఎలా లభిస్తున్నాయో చాలాసార్లు మాట్లాడాను, విపులంగా రాశాను. దురదృష్టకరమైన విషయమేమిటంటే బౌలర్ల పట్ల వివక్ష డబ్బుకు సంబంధించిన వ్యవహారాలకే పరిమితం కాదు. ప్రముఖ బ్యాట్స్‌మెన్ స్టీవ్ వా, రికీ పాంటింగ్‌లు ఆస్ట్రేలియా టీమ్‌కు వరుసగా 57, 72 సార్లు కెప్టెన్లుగా ఉన్నారు. అయితే అద్భుత బౌలర్ అయిన షేన్ వార్న్‌కు ఒక్కసారి అంటే ఒక్కసారి కూడా కెప్టెన్సీ బాధ్యత అప్పగించలేదు. షేన్‌వార్న్ ఒక ప్రతిభావంతుడైన క్రికెట్ వ్యూహకర్త స్టీవ్ వా, పాంటింగ్ కంటే షేన్‌వార్న్ నిస్సందేహంగా మరింత విజయవంతమైన కెప్టెన్ అయి వుండే వాడనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు.

టీమ్ ఇండియా కెప్టెన్ల ఎంపికలో కూడా ఈ పక్షపాతం కనిపిస్తోంది. విరాట్ కోహ్లీ 69 టెస్ట్ మ్యాచ్‌లలోను, రోహిత్ శర్మ 16 టెస్ట్ మ్యాచ్‌లలోను కెప్టెన్‌గా ఉన్నారు. అయితే అశ్విన్ ఒక్కసారి కూడా టీమ్ ఇండియాకు కెప్టెన్‌గా లేరు. మొదటి ఇద్దరు బ్యాట్స్‌మెన్ కాగా అశ్విన్ ప్రధానంగా బౌలర్ కావడమే అందుకు కారణం కావచ్చు. అయినప్పటికీ ఇండియా తరఫున ఆడిన క్రికెటర్లలో అశ్విన్ అత్యంత ప్రతిభావంతుడు అనే విషయం మనకు తెలుసు. ఈ మద్రాసు ఆటగాడికి కెప్టెన్ అయ్యే అవకాశం లభించి ఉంటే ఆయన భారత్‌కు మరింత మహత్తర విజయాలు సాధించేవాడనడంలో సందేహం లేదు. స్పిన్ బౌలర్లు సైతం సాటిలేని మేటి టెస్ట్ కెప్టెన్లు కాగలరని ఇంగ్లాండ్‌కు చెందిన రే ఇల్లింగ్ వర్త్, ఆస్ట్రేలియా ఆటగాడు రిచి బెనౌడ్‌లు నిరూపించలేదూ? ఆ కోవలోనివాడే మన అశ్విన్ కూడా.

తన ఆత్మకథ కవర్ ఫోటోగ్రాఫ్‌కు సంబంధించిన అశ్విన్ ఎంపిక, కెప్టెన్సీ విషయమై ఆయన (గత, ప్రస్తుత) ఆకాంక్షలను సూచన ప్రాయంగా తెలుపుతున్నాయా అని నేను అనుమానిస్తున్నాను. కెప్టెన్సీకి అశ్విన్ అర్హుడు. ఆయన చాలా హుందాగా వ్యవహరించే వ్యక్తి. భ్రమలు లేని మంచి మనిషి. నా మొదటి ఊహ చాలా సుసంబద్ధమైనది. గ్రౌండ్‌లోనూ, గ్రౌండ్ వెలుపల బ్యాటర్లు బౌలర్ల పట్ల వ్యవహరిస్తున్న తీరుతెన్నులలో వ్యత్యాసాన్ని, వివక్ష గురించి క్రికెట్ అభిమానులకు అవగాహన కల్పిస్తున్నాడని నేను భావిస్తున్నాను. ఈ రెండూ గాక మూడో కారణం కూడా ఉండి ఉండవచ్చు. బ్యాటింగ్‌ను నిజంగా ప్రేమించిన ఆటగాడు అశ్విన్. అలాగే షేన్‌వార్న్, అనీల్ కుంబ్లేలు కూడా.

షేన్‌వార్న్ రాసిన ఐదు పుస్తకాలలో రెండిటిపై ఆయన ముఖం ఉండగా మిగతా మూడు పుస్తకాల కవర్‌పై బౌలింగ్ చేస్తున్నట్లుగానో లేక వికెట్‌ను పడగొడుతున్న ఫోటోలు ఉన్నాయి. కుంబ్లే ఆత్మకథ ఇంకా రాలేదు. అది వచ్చినప్పుడు 619 టెస్ట్ వికెట్లు పడగొట్టిన ఆటగాడు బ్యాట్ పట్టుకుని ఉన్న ఫోటో, ఆ ఆత్మకథ కవర్ ఫోటోగ్రాఫ్‌గా ఉండే అవకాశం లేదు. ఇంకా మన మధ్య నడయాడుతున్న గొప్ప క్రికెట్ రచయిత ఒకసారి ఏకైక క్రికెట్ ఫోటోగ్రాఫ్ గురించి ఏకంగా ఒక పుస్తకమే రాశాడు. అదొక అద్భుతమైన పుస్తకం. దాని గురించి నేను కూడా చాలా సంవత్సరాల క్రితం ఈ కాలమ్‌లో రాయడం జరిగింది. అయితే నేను గిడియోన్ హైగ్‌ను కాను కనుక ఒక క్రికెట్ ఫోటో గురించి 100కి పైగా పదాలతో ఒక వ్యాసం మాత్రమే రాశాను. అశ్విన్ ఆత్మకథలోని ఒక ప్రస్తావన కనీసం ఆ పుస్తకంపై ఫోటోగ్రాఫ్‌ను అశ్విన్ ఎందుకు ఎంచుకున్నారన్న విషయమై నా విశ్లేషణను ధ్రువీకరించింది. ఆ ప్రస్తావన ఇలా ప్రారంభమవుతుంది: 'అది అంతిమంగా బౌలర్-బ్యాటర్-కోచ్ డబ్ల్యువి రామన్‌తో మరో సంభాషణ అయింది. బౌలర్లను బ్యాటర్స్ తాము కోరుకున్నరీతిలో బ్లూ కాలర్ కార్మికులు (చేతితో పనిచేసే వారు)గా ఉపయోగించుకుంటున్నారు. ఒక బౌలర్ ఒక బ్యాడ్ బాల్ వేసినప్పుడు నెట్స్‌లో ఉన్న ఒక బ్యాటర్‌కు క్షమాపణలు చెప్తాడు. అయితే ఒక బ్యాటర్ తన బ్యాడ్ షాట్‌కు ఎవరికీ ఎలాంటి క్షమాపణలు చెప్పడు. ఎందుకని?'

(వ్యాసకర్త చరిత్రకారుడు)

# ప్రజలు మెచ్చే బాటలో పాలనా రథం

ఓ వైపు వరుస సమీక్షలు, ఆకస్మిక తనిఖీలు, మరోవైపు క్షేత్ర స్థాయి పర్యటనలు, హామీల అమలుతో రాష్ట్రంలో పాలనా రథం పరుగులు పెడుతున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం రాష్ట్రంలో కొలువు దీరి జూలై ఏడో తేదీకి ఏడు నెలలు పూర్తయింది. పదేళ్ల పాటు గడీల్లో బందీ అయి సుప్తచేతనావస్థలోకి వెళ్లిన పాలనా వ్యవస్థను గాడిన పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలిరోజు నుంచే నడుం బిగించారు. ఒక వైపు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తూనే, ఇంకోవైపు దొర గడీగా మార్చుకున్న ప్రగతి భవన్ ఎదుట ఇనుప కంచెలు తొలగింపజేశారు. రాష్ట్ర ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు వీలుగా అక్కడే ప్రజావాణి నిర్వహిస్తున్నారు.

తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని డిసెంబరు 9న మహాలక్ష్మి పేరిట మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశాన్ని కల్పించారు. చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలు, పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఎందరో మహిళలకు ఈ ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తున్నది. జూన్ 30 వరకు రాష్ట్రంలో 60.49కోట్ల మంది మహిళలు రూ.2,083 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారు.

హామీల అమలులో భాగంగా రూ.500కే గ్యాస్ సిలెండర్ సరఫరాను ప్రజాప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకంలో జూలై 8 మధ్యాహ్నం నాటికి 55,37,034 మంది లబ్ధిపొందారు. వారికి గ్యాస్ రాయితీ కింద ప్రభుత్వం రూ.165.32 కోట్లు ఖర్చు చేసింది. ప్రజా సదస్సుల నిర్వహణలో 1,25,84,383 దరఖాస్తులు వచ్చాయి. ఆ దరఖాస్తుల ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. గృహజ్యోతి కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ ఉపయోగించుకున్న వారికి కరెంట్ బిల్లు లేకుండా చేసింది ప్రజా ప్రభుత్వం. త్వరలోనే రేషన్ కార్డులు మంజూరు చేయనుంది.

దక్షిణ తెలంగాణకు జీవనాడి అయిన పాలమూరు–రంగారెడ్డి; భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు సాగు నీరు ఇచ్చే సీతారామ ఎత్తిపోతల పథకాలను కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ రెండు ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. సీతారామ ఎత్తిపోతల పథకం పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. ఇటీవలే ట్రయల్ రన్ సైతం పూర్తయింది. దశాబ్దాలుగా సాగునీటికి నోచుకోక, వలసలకు నిలయమైన కొడంగల్, నారాయణపేట, మక్తల్ ఎత్తిపోతల ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు రూ.3 వేల కోట్లు కేటాయించారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు ప్రగతి దిశలో ఉన్నాయి.

విద్యార్థుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో గత పాలకులు తమ కుటుంబానికి కొలువులు ఇచ్చుకున్నారే తప్ప యువతకు కొలువుల విషయాన్ని పట్టించుకోలేదు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలుత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనపై దృష్టి సారించారు. యూపీఎస్సీ తీరును అధ్యయనం చేసేందుకు స్వయంగా ముఖ్యమంత్రి యూపీఎస్సీ ఛైర్మన్ మనోజ్ సోని, కమిషన్ సభ్యులు, అధికారులతో భేటీ అయ్యారు. తర్వాత టీజీ పీఎస్సీ సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసి పారదర్శకంగా కమిషన్ ఛైర్మన్‌ను, సభ్యులను నియమించారు. తర్వాత టీజీపీఎస్సీ గ్రూప్ 1 నోటిఫికేషన్ జారీ చేయగా 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. జూన్ నెలలో జరిగిన ప్రిలిమినరీ పరీక్షకు 3.02 లక్షల మంది హాజరయ్యారు. మెయిన్స్‌కు అభ్యర్థులు ప్రిపేర్ అవుతున్నారు. 11,062 ఉపాధ్యాయ నియామకాలకు డీఎస్సీ నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేసింది. ఎక్కువ మంది డీఎస్సీ పరీక్షలు రాసేందుకు వీలుగా టెట్ నిర్వహించగా రెండు పేపర్లకు కలిపి 2.86 లక్షల మంది పరీక్షలు రాశారు. ప్రజారోగ్యంపై శ్రద్ధతో 531 సివిల్ అసిస్టెంట్ సర్జన్, 193 ల్యాబ్ టెక్నీషియన్, 31 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. గ్రూప్ 2, 3 పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. స్టాఫ్ నర్సులు, కానిస్టేబుళ్లు, గురుకుల ఉపాధ్యాయులకు సంబంధించి ఇప్పటికే 29,042 మందికి నియామక పత్రాలను ప్రభుత్వం అందజేసింది.

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించి ఏడు నెలలు పూర్తయినా అందులో మార్చి 16 నుంచి జూన్ 6 వరకు 80 రోజులు లోక్‌సభ ఎన్నికల కోడ్‌తో ప్రభుత్వం ఏ పనీ చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. ఆ రకంగా చూస్తే కేవలం 130 రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సమర్థమైన పాలనతో ఎన్నో పనులు చేయగలిగారు.



ఆధునిక కాలం అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాభివృద్ధికి గానూ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) మార్చేందుకు శ్రీకారం చుట్టారు.

పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్‌లో జరిగిన 54వ ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరయ్యారు. సదస్సులో అమెజాన్, నోవార్టిస్ కంపెనీల డైరెక్టర్లతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలతో చర్చించారు. మొత్తంగా రాష్ట్రంలో రూ.40వేల కోట్ల పెట్టుబడులకు వారిని ఒప్పించారు. దావోస్‌లో జరిగిన ఒప్పందాలతోనే జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ తెలంగాణలో రూ.9 వేల కోట్లతో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు, గోద్రెజ్ ఇండస్ట్రీస్ రూ.270 కోట్లతో ఖమ్మం జిల్లాలో ఇంటిగ్రేటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్, రూ.వెయ్యి కోట్లతో రాష్ట్రంలో కెమికల్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమయ్యాయి. యూకేకు చెందిన సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్రూప్ హెల్లింగ్ హైదరాబాద్‌లో తమ ఉత్పత్తుల పరిశ్రమ, వెల్ స్పాన్ గ్రూప్ టైర్ 2, 3 సిటీల్లో ఐటీ అభివృద్ధికి, వెబ్ వెర్క్స్ సంస్థ రూ.5,200 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి.

గత ప్రభుత్వ పాలకులు ఢిల్లీ పెద్దలతో చీకటి ఒప్పందాలకే పరిమితమై స్వీయ ప్రయోజనాలకు పెద్దపీట వేశారు. స్వీయ ప్రయోజనాలకు భంగం కలుగుతుందని భావించినప్పుడు ఒంటెద్దు పోకడలతో కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన నిధులు రాబట్టకుండా నిర్లక్ష్యం వహించారు. అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాఖ్య స్ఫూర్తికి కట్టుబడి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సమావేశమై ఆయా శాఖల నుంచి రాష్ట్రానికి రావల్సిన బకాయిలు, అనుమతుల సాధనకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజ్‌నాథ్ సింగ్‌తో జరిపిన చర్చలు ఫలించడంతోనే నగరంలో పలు ప్రాంతాల్లోని రక్షణ శాఖ భూములు బదిలీ చేయడానికి ఆ శాఖ అంగీకరించింది. దాంతో రాజధాని నగరంలో కీలకమైన ప్యాట్నీ జంక్షన్ నుంచి శామీర్‌పేట జంక్షన్ వరకు ఎలివేటెడ్ కారిడార్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం జంక్షన్ వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి మార్గం సుగమమైంది.

వరంగల్, కరీంనగర్ నగరాల్లో స్మార్ట్ సిటీ మిషన్ పనులు పూర్తికానందున మిషన్ కాలపరిమితిని మరో ఏడాది పొడిగించాలని ఇటీవల కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్పందించిన కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ మిషన్ కాలపరిమితిని ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో పలు దఫాలు భేటీ అయి హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణకు, రాష్ట్రంలో పలు జాతీయ రహదారులు, ఆర్వోబీలు, ఆర్యూబీలకు అనుమతులు సాధించారు. రాజకీయ వైరుధ్యాలతో ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టకూడదనే వివక్షణతో వ్యవహరిస్తూ, కేంద్ర, రాష్ట్ర సంబంధాల విషయంలో సమాఖ్య స్ఫూర్తిని చాటుతూ ముఖ్యమంత్రి రాజనీతిజ్ఞునిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర విభజనతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా లేకున్నా రైతు భరోసాను అందించారు. కీలకమైన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని ఆగస్టు 15 నాటికి పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఉద్యోగాలు, పెట్టుబడులు, సంక్షేమం ఇలా అన్ని రంగాల్లో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విరామం లేకుండా పని చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించి ఏడు నెలలు పూర్తయినా అందులో మార్చి 16 నుంచి జూన్ 6 వరకు వరకు 80 రోజులు లోక్‌సభ ఎన్నికల కోడ్‌తో ప్రభుత్వం ఏ పనీ చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. ఆ రకంగా చూస్తే కేవలం 130 రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సమర్థమైన పాలనతో ఎన్నో పనులు చేయగలిగారు.

■ డి. విజయకుమార్
రాష్ట్ర ముఖ్యమంత్రి పీఆర్వో

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్టం 32.2 కనిష్టం 24.5

## స్కూళ్ల పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్లు..!

- ప్రభుత్వ పథకాల పనితీరుపై పరిశీలన
- వారంలో మూడు పాఠశాలల సందర్శన



నల్లగుట్ట స్కూల్‌లో పూర్తికాని సంప్ పనులు 6



## 'భూ' మాయ!

- పోరంబోకు స్థలం పట్టాగా మారిందెలా?
- రూ.300 కోట్ల విలువైన భూమికి రెక్కలు
- నిషేధిత జాబితాలో ఉన్నా.. పాస్‌పుస్తకాలు జారీ

5



శాకాంబరిగా ఉజ్జయినీ మహాకాళి

సికింద్రాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలోని తొలి శుక్రవారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారు శాకాంబరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కోట నీలిమ, కార్పొరేటర్లు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయానికి భక్తులు పోటెత్తారు.

## పాస్‌పోర్టు రెన్యూవల్‌కు రేవంత్‌రెడ్డి దరఖాస్తు



సికింద్రాబాద్, రెజిమెంటల్ బజార్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాస్‌పోర్టు రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన సికింద్రాబాద్‌లోని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి వచ్చారు. గతంలో తన వద్ద ఉన్న సాధారణ పాస్‌పోర్టు స్థానంలో డిప్లొమాటిక్ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనికి అవసరమైన డాక్యుమెంట్లు అందజేశారు. హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారిణి స్నేహజ ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. కాగా ముఖ్యమంత్రి హోదాలో ఉన్నందున రేవంత్‌రెడ్డి డిప్లొమాటిక్ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

## ఇద్దరు జీహెచ్‌ఎంసీ అధికారుల సస్పెన్షన్

రాజేంద్రనగర్, జూలై12(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ ఇద్దరు జీహెచ్‌ఎంసీ అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఉప్పర్‌పల్లి పరమారెడ్డిహిల్స్ వెనకాల ఉన్న భూమి విషయంలో సంబంధంలేని వారికి ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) సర్టిఫికెట్ ఇప్పించడంలో కీలకపాత్ర వహించారనే ఆరోపణతో గతంలో ఇన్‌చార్జి టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేసిన క్రిష్ణమోహన్‌తో పాటు ప్రస్తుత టౌన్‌ప్లానింగ్ విభాగం సెక్షన్ ఆఫీసర్ కబీరుల్లా ఖాన్‌లను సస్పెండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయం నుంచి వారికి సస్పెన్షన్ ఆర్డర్లు వచ్చినట్లు తెలిసింది. ఉప్పర్‌పల్లి సర్వేనంబర్ 43, 44, 46లోని 3.08 ఎకరాలకు సంబంధించి వివాదం జరుగుతున్నది. ఆ భూమితో ఎలాంటి సంబంధం లేని వారికి టీడీఆర్ ఇప్పించిన వ్యవహారంలో వారు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ కేసులో ఇటీవల ఇద్దరు కబ్జాదారులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు.

## ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్లపై వేటు

- నార్సింగ్ సెక్షన్‌లో అనుమతిలేని ఎల్సీలపై సీఎండీ సీరియస్

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ సమయం విద్యుత్ సరఫరా నిలిపివేసిన ఘటనలో ఇద్దరు అధికారులపై శుక్రవారం వేటు పడింది. సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలోని ఇబ్రహీంబాగ్ డివిజన్ నార్సింగ్ సెక్షన్‌లో అరగంట ఎల్సీ తీసుకొని గంటన్నరపాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారంటూ నార్సింగ్ సెక్షన్ ఏఈ టి.సందీప్‌రెడ్డికి మెమో, లైన్ ఇన్‌స్పెక్టర్ మనోహర్‌బాబుకు సస్పెన్షన్ నోటీసులను డిస్కం అధికారులు జారీ చేశారు. వివేకానంద ఫీడర్ పరిధిలో జూన్ 29న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ జారీ, 11 కేవీ లైన్ పోల్ షిఫ్టింగ్, కొత్తగా విద్యుత్‌స్తంభాలు వేయడం వంటి పనుల కోసం నిర్దేశిత సమయానికి మించి ఎల్సీ తీసుకున్నారు. డిస్కం నుంచి ఎలాంటి అనుమతులూ పొందకుండా మరికొన్ని పనులు చేపట్టి సరఫరాలో అంతరాయానికి కారణమయ్యారు. ఇదే అంశంపై ఫిర్యాదులు రావడంతో సీఎండీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణకు ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించిన ఉన్నతాధికారులు ఈ మేరకు ఇద్దరిపై చర్యలు తీసుకున్నారు.

## 90 శాతం ఫీడర్ల సర్వే పూర్తి 6

రూ.లక్షకు 18 రోజుల

## చిన్నారి విక్రయం

- విడాకులిస్తానని భార్యను బెదిరించి కన్నబిడ్డను అమ్మేసిన తండ్రి
- తల్లి ఫిర్యాదుతో విషయం వెలుగులోకి
- తల్లి చెంతకు చేరిన బిడ్డ
- తండ్రి సహా నలుగురి అరెస్టు



శిశువుతో తల్లి అస్మాబేగం

మదీన, జూలై 12 (ఆంధ్రజ్యోతి): డబ్బు మీద మమకారంతో కన్నప్రేమను మరిచాడో తండ్రి. తన రక్తం పంచుకు పుట్టిన కుమార్తె (18 రోజుల శిశువును)ను రూ.లక్షకు విక్రయించేశాడు. తనకు సహకరించకపోతే విడాకులిస్తానని భార్యను బెదిరించి మరీ ఈ దారుణానికి పాల్పడ్డాడు. పాతబస్తీ బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహ్మద్‌నగర్‌కు

మిగతా 6వ పేజీలో..



# కారు దిగి కాంగ్రెస్‌లోకి..!

ఒక్కొక్కరుగా బీఆర్‌ఎస్‌ను వీడుతున్న గ్రేటర్ ఎమ్మెల్యేలు

- నిన్న ప్రకాష్‌గౌడ్, నేడు గాంధీ
- గతంలోనే దానం.. త్వరలో మరి కొందరు..?
- గ్రేటర్‌పై పట్టు లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో బీఆర్‌ఎస్ నుంచి వలసలు జోరందుకున్నాయి. ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా.. నేడు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికార పార్టీ కండువా కప్పుకోనున్నారు. పార్లమెంటు ఎన్నికలకు ముందే దానం నాగేందర్ పార్టీ మారారు. వారి దారిలో మరికొందరు ఎమ్మెల్యేలు నడిచేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. చేరికలకు సంబంధించి చర్చలు దాదాపుగా ముగిశాయని, ఒక్కసారి కాకుండా.. ఒక్కొక్కరుగా కాంగ్రెస్ కండువా కప్పుకొంటారని, త్వరలో కారు దిగనున్న ఓ ఎమ్మెల్యే 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. తమ విశ్వాసాలను బట్టి ముహూర్తం చూసుకొని పార్టీ మారుతున్నారు. శాసనసభ్యులతోపాటు కొందరు కార్పొరేటర్లూ కారు దిగేందుకు సన్నద్ధమవుతున్నారు.

### బీఆర్‌ఎస్ హెచ్చరికలను పట్టించుకోని ఎమ్మెల్యేలు

ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు.. న్యాయస్థానం తలుపులు తడుతామని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చెబుతున్నారు. వారిపై అనర్హత వేటు వేసే వరకు పోరాటం చేస్తామని, ఆ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని పేర్కొంటున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం అదేం పట్టించుకోవడం లేదు. ప్రకాష్‌గౌడ్ రెండు పర్యాయాలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. గతంలోనే పార్టీ మారతారని ప్రచారం జరిగింది. ఆ ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. అనంతరం పార్టీ కేడర్ సూచన మేరకు నిర్ణయం మార్చుకున్న ఆయన తాజాగా కాంగ్రెస్‌లో చేరారు. గ్రేటర్‌కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు ఇటీవల ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిశారు. వారిలో నలుగురు పార్టీ మారేందుకు సిద్ధమవగా.. మరో ఇద్దరితో మంతనాలు జరుగుతున్నట్టు సమాచారం. ఆరెకపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరితే కారు దిగిన ఎమ్మెల్యేల సంఖ్య మూడుకు చేరనుంది. గ్రేటర్‌లోని 24 స్థానాల్లో 16 చోట్ల బీఆర్‌ఎస్ విజయం సాధించగా.. క్రమేణా ఆ సంఖ్య తగ్గుతోంది. ఉప ఎన్నికల్లో కంటోన్మెంట్ స్థానాన్నీ ఆ పార్టీ చేజార్చుకుంది.

### నాడు బీఆర్‌ఎస్.. నేడు కాంగ్రెస్..

గ్రేటర్‌లో బలహీనంగా ఉన్నామని భావిస్తోన్న అధికార పార్టీ.. మహానగరం లక్ష్యంగా పదునైన రాజకీయ వ్యూహాలు అమలు చేస్తోంది. గతంలో బీఆర్‌ఎస్ అనుసరించిన విధానాలనే అవలంబిస్తోంది. తెలంగాణ ఏర్పాటు అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్(అప్పుడు టీఆర్‌ఎస్)కు 2014 అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో పట్టు చిక్కలేదు. 24 స్థానాలకుగాను కేవలం రెండు చోట్ల ఆ పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. దీంతో నగరంలో గులాబీ పార్టీ బలోపేతం కోసం మాజీ సీఎం కేసీఆర్ ఆపరేషన్ ఆకర్ష్‌కు శ్రీకారం చుట్టారు. 2015లో టీడీపీ లక్ష్యంగా పావులు కదిపారు. ఆ పార్టీ తరఫున ఎన్నికైన తొమ్మిది మంది ఎమ్మెల్యేలను దశల వారీగా పార్టీలో చేర్చుకున్నారు. సైకిల్ దిగి కారెక్కిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు రెండు పర్యాయాలు మంత్రిగా అవకాశమూ దక్కింది. 2016లో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో నగర రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా మారాయి. ఎమ్మెల్యేల చేరిక, ఇతరత్రా కారణాలతో అంతకుముందు కార్పొరేటర్లుగా పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా లేని బీఆర్‌ఎస్ ఏకంగా 99 వార్డుల్లో విజయభేరి మోగించింది. పూర్తి మెజార్టీతో ఒక పార్టీ మేయర్ పీఠం దక్కించుకోవడం పూర్వ ఎంసీహెచ్, ప్రస్తుత జీహెచ్‌ఎంసీ చరిత్రలో అదే ప్రథమం, ఇప్పటి వరకు ఆఖరు కూడా. ఇప్పుడు అదే పంథాను కాంగ్రెస్ అనుసరిస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీ ప్రస్తుత పాలకమండలి గడువు ఫిబ్రవరి 10, 2026తో ముగియనుంది. ఆలోపు నగరంలో పార్టీ బలోపేతం లక్ష్యంగా అధికార పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. గ్రేటర్ పీఠం దక్కించుకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కలిసి వస్తుందన్న అభిప్రాయంతో కాంగ్రెస్ అగ్రనేతలున్నట్టు సమాచారం. తాజా పరిణామాలతో నగరంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి.

## 22 నిమిషాల్లో.. 21.24 లక్షలు ఫ్రీజ్

- గోల్డెన్ అవర్‌లో ఎన్‌సీఆర్‌పీకి బాధితుల ఫిర్యాదు
- సైబర్ నేరగాళ్లకు చిక్కిన సొమ్ము రికవరీ



హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని లక్షల్లో డబ్బు కోల్పోయిన బాధితులకు ఊరట కల్పించే అంశమిది. బాధితులు డబ్బు కోల్పోయిన వెంటనే గోల్డెన్ అవర్‌లో ఎన్‌సీఆర్‌పీ (నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్)లో, లేదా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే ఆయా ఖాతాలను పోలీసులు స్తంభింపజేసే అవకాశం ఉంటుంది. తద్వారా డబ్బును వెనక్కి రప్పించే అవకాశం ఉంటుంది. గత మూడు రోజుల్లో జరిగిన మూడు సంఘటనల్లో

మిగతా 6వ పేజీలో..

బంగారం తాకట్టు పెట్టి..

## సైబర్ నేరగాళ్లకు రూ. 8.26 లక్షలు 6

## చెంగిచర్ల కబేలా టెండరు రద్దు

- సింగిల్ బిడ్ దాఖలు కావడంతో నిర్ణయం 4

# నగరంలో కాల్పుల కలకలం

- పోలీసులపై గొడ్డలి, రాళ్లతో యువకుల దాడి
- ఆత్మరక్షణ కోసం ఖాకీల కాల్పులు
- ఒకరికి బుల్లెట్‌గాయం.. పోలీసుల అదుపులో మరొకరు..
- నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఘటన

మంగళ్‌హాట్, జూలై 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో గురువారం అర్ధరాత్రి కాల్పులు కలకలం సృష్టించాయి. వైట్నర్ మత్తులో ఉన్న యువకులు గొడ్డలి, రాళ్లతో పోలీసులపై దాడి చేయగా ఆత్మరక్షణ కోసం వారు కాల్పులు జరిపారు. ఈ ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అత్యంత రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ వద్ద కాల్పుల శబ్దం వినగానే ప్రయాణికులు, ట్రావెల్ ఏజెంట్లు భయంతో పరుగులు పెట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లి పోలీసులు, సెంట్రల్ జోన్ పోలీసులు సంయుక్తంగా సివిల్ డ్రెస్‌లో గురువారం అర్ధరాత్రి 12 గంటలకు డెకాయిట్ ఆపరేషన్ నిర్వహించారు. రైల్వేస్టేషన్ ముందున్న ఫుట్‌పాత్‌లపై తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేసే ప్రయత్నం చేయగా మాంగార్

మిగతా 6వ పేజీలో..



సంఘటనా స్థలంలో గొడ్డలి

## ట్రాన్స్‌జెండర్ దారుణహత్య

- ముక్కలు ముక్కలుగా నరికిన దుండగులు
- డబ్బుకోసం గంజాయి బ్యాచ్ చేసిన పనిగా అనుమానం



ట్రాన్స్‌జెండర్ షీలా (ఫైల్)

బంజారాహిల్స్, జూలై 12(ఆంధ్రజ్యోతి): భిక్షాటన చేస్తూ జీవనం సాగించే ట్రాన్స్‌జెండర్‌ను.. గుర్తుతెలియని దుండగులు చిత్రహింసలకు గురిచేసి, ముక్కలు ముక్కలుగా నరికి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాలానగర్ ఏసీపీ జి.హనుమంతరావు కథనం ప్రకారం.. ఫతేనగర్ వాల్మీకినగర్ సమీపంలోని ఓ నిర్మానుష ప్రాంతంలో మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు పరిశీలించి మృతదేహం వరంగల్ జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్ షీలా అలియాస్ షేక్ సాజిద్ అహ్మద్ అబ్బాస్ (30)గా గుర్తించారు. షీలా చాలాకాలంగా బాలానగర్ హెచ్ఎంటీ సొసైటీలో నివాసముంటూ చుట్టుపక్కల ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. గురువారం రాత్రి షీలాను నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లిన దుండగులు ఆమెపై దాడికి పాల్పడ్డారు. తల పగలడంతో పాటు ఒంటిపై పలుచోట్ల పదునైన వస్తువుతో గాయాలు చేసినట్టు ఆనవాళ్లు లభించాయి. ఘటనాస్థలంలో పొడవైన కర్రతో పాటు కొన్ని అనుమానాస్పద వస్తువులను క్లూస్ టీమ్ సభ్యులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, గంజాయి బ్యాచ్‌కు చెందిన పోకిరీలు ఆమెను డబ్బు కోసం చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారా.. లేక ఇంకా ఎవరైనా ప్రత్యర్థి ముఠాలకు చెందినవారు పథకం ప్రకారమే తీసుకెళ్లి హత్య చేసి ఉంటారా..? అని పోలీసులు

మిగతా 6వ పేజీలో..

## కారు అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌పై కొరడా..

- స్పెషల్ డ్రైవ్‌లో రూ.1000 ఫైన్
- 4 రోజుల్లో 1007 కేసులు నమోదు



కారు అద్దాలకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీసులు బ్లాక్ ఫిల్మ్ ఉన్న అద్దాల కార్లపై కొరడా ఝుళిపించారు. నాలుగు రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 1007 కేసులు నమోదు చేసినట్లు సిటీ ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ బ్లాక్ ఫిల్మ్‌ను ఏర్పాటు చేసుకుని తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేసి, రూ.1000లు జరిమానా విధించినట్లు తెలిపారు. పౌర సమాజం సైతం ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించి ఫొటోలు, వీడియోలను వాట్సాప్ నంబర్ 9010203626కు పంపొచ్చు, లేదా హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీస్ ట్విటర్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో పోస్టు చేయొచ్చని తెలిపారు. వాటిని పరిశీలించి ఉల్లంఘనులకు జరిమానాలు విధిస్తామని ఆయన పేర్కొన్నారు.



# విజన్ 2054

### 30 ఏళ్లకు అనుగుణంగా ప్రణాళికలు

- హెచ్ఎండీఏలోని ఉమ్టా ఆధ్వర్యంలో కసరత్తు
- ప్రజా రవాణాపై ప్రారంభమైన సర్వే..
- పది వేలకు పైగా అభిప్రాయాల సేకరణకు చర్యలు

**ప్రజా రవాణాలో భవష్యత్‌లో 30 ఏళ్ల వరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా హెచ్ఎండీఏలోని యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ (ఉమ్టా) ప్రణాళికలు రూపొందిస్తోంది. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జంక్షన్ల అభివృద్ధి, భవిష్యత్తులో తలెత్తే రద్దీకి అనుగుణంగా రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు ఇలా అన్ని అంశాలపైనా సమగ్ర మొబిలిటీ ప్లాన్‌ను రూపొందించేందుకు చర్యలు చేపట్టింది.**

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దాదాపు 15ఏళ్ల క్రితం ఓ కన్సల్టెన్సీ ద్వారా హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్-2031 రూపకల్పన చేసింది. గ్రేటర్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రచించారు. తాజాగా 2054 నాటి అవసరాల అనుగుణంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డును హద్దుగా చేసుకొని విస్తరిస్తున్న నేపథ్యంలో సమగ్ర మొబిలిటీ ప్లాన్‌ను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు ఆదేశాలిచ్చింది. అందులో భాగంగా ఉమ్టా ఆధ్వర్యంలో సమగ్ర మొబిలిటీ ప్లాన్ రూపకల్పన కోసం లీ అసోసియేట్‌ను కన్సల్టెన్సీగా నియమించి సర్వేను ప్రారంభించారు. ఈ సర్వేలో గ్రేటర్‌తోపాటు విస్తరిస్తున్న ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో ట్రాఫిక్‌పై అధ్యయనం చేయనున్నారు. గత ప్రణాళికల ఆధారంగా అప్పటికీ ఇప్పటికీ పెరిగిన వాహనాల వివరాల ఆధారంగా ట్రాఫిక్‌పై సమగ్ర రిపోర్టును సిద్ధం చేయనున్నారు.

### నగర వాసుల నుంచే..

గ్రేటర్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు పదివేలకు పైగా అభిప్రాయాలను సేకరించేందుకు చర్యలు చేపట్టారు. నగర నివాసితుల నుంచే వీటిని సేకరించనున్నారు. ప్రస్తుతం ఉద్యోగ

మిగతా 6వ పేజీలో..

### జంక్షన్ల అభివృద్ధిపై..

గ్రేటర్ హైదరాబాద్‌లో స్ట్రాటజికల్ రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఎస్ఆర్‌డీపీ)లో భాగంగా ఇప్పటి వరకు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లను చేపట్టారు. అయితే, ప్రస్తుతం రూపకల్పన చేయనున్న సమగ్ర మొబిలిటీ ప్లాన్ కూడా రాబోయే రోజుల్లో ఏ ప్రాంతాల్లో జంక్షన్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించనుంది. ఆయా జంక్షన్లలో ప్రస్తుతమున్న వాహనాల రద్దీ.. ఆ జంక్షన్ సామర్థ్యం.. మున్ముందు ఆ జంక్షన్‌లో పెరిగే వాహనాల రద్దీని నగరంతో పాటు శివారు ప్రాంతాలన్నింటిలోనూ నిర్ధారించనున్నారు. సిగ్నల్ ఫ్రీ జంక్షన్‌గా మార్చేందుకు అవకాశాలను సైతం ప్రణాళికలో సూచనలు చేయనున్నారు. ఫ్లై ఓవర్ల నిర్మాణంతో జంక్షన్ సమస్య తీరినా కానీ, ఫ్లై ఓవర్ మొదలు, చివర ఎలాంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండాల్సిన రోడ్డు విస్తరణను నిర్ధారించనున్నారు.

## చెంగిచర్ల కబేలా టెండరు రద్దు

● సింగిల్ బిడ్ దాఖలు కావడంతో నిర్ణయం

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చెంగిచర్ల కబేలా నిర్వహణ టెండర్లు రద్దయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టెండర్లు పిలవగా.. అదే పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ ఒకరు టెండరు దాఖలు చేశారు. సింగిల్ బిడ్ దాఖలు కావటంతో.. ఈ ప్రభుత్వం టెండర్లు రద్దు చేయాలని ఆదేశించింది. ఈమేరకు తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఎండీ సుబ్బారాయుడు టెండర్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ కబేలాను కొన్నేళ్లుగా సదరు మాజీ ఎమ్మెల్సీ నిర్వహిస్తున్నారు. 2018లో కాంట్రాక్టు గడువు ముగిసింది. అప్పటి ప్రభుత్వం కొత్తగా టెండర్లు పిలవకుండా బోర్డులో తీర్మానం చేయించి మళ్లీ పాత ఏజెన్సీకే టెండరు అప్పగించింది. అయితే 70 ఎకరాల స్థలం, అధునాతన వసతులతో కూడిన కబేలా నిర్వహణను పాత టెండరు లెక్క ప్రకారం ఏడాదికి రూ.1.92 కోట్లు చెల్లించేలా బోర్డులో నిర్ణయం తీసుకున్నారు. కానీ, అప్పుడున్న మార్కెట్ ధరల ప్రకారం అది చాలా తక్కువ. దీంతో పలు ఫిర్యాదులు వచ్చాయి. విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తే.. అప్పటి మార్కెట్ ధరల ప్రకారం ఏడాదికి కనిష్ఠంగా రూ.4.32 కోట్లు చెల్లించాలని నివేదిక ఇచ్చారు. కాగా ప్రస్తుత మార్కెట్ రేట్ల ప్రకారం కనీసం ఏడాదికి రూ.10 కోట్ల ఆదాయం రావాల్సి ఉంటుందని, అలాంటి కబేలా నిర్వహణను తక్కువ ధరకు కొట్టేయాలని చూస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. ఇవి ప్రభుత్వం దృష్టికి వెళ్లటం, సింగిల్ బిడ్ దాఖలు కావటంతో రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## నిరుద్యోగ యువతకు టీవర్క్స్ గొప్ప అవకాశం

● ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి

● ఎంజీబీఎస్ స్టేషన్‌లో మేక్ ఇట్ మెట్రో ప్రారంభం



కార్యక్రమంలో తనికెళ్ల భరణి, జయేష్ రంజన్, భవేశ్ మిశ్రా తదితరులు

అఫ్జల్‌గంజ్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన టీవర్క్స్ కార్యక్రమం నిరుద్యోగులకు గొప్ప అవకాశమని ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి అన్నారు. నగరంలోని ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌లో టీ-వర్క్స్, ఎల్అండ్‌టీ మెట్రోరైల్ ఆధ్వర్యంలో రూపొందించిన 'మేక్ ఇట్ మెట్రో'ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐటీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారని, తాను మెట్రో రైలు ఎక్కి చాలా రోజులైందని అన్నారు. ఐటీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే టీ హబ్, టీవర్క్స్ సంస్థలను నెలకొల్పామన్నారు. టీ-వర్క్స్ ప్రతినిధి అజయ్ మాట్లాడుతూ ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌లో టీ-వర్క్స్ ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. కాగా, మేక్ ఇట్ మెట్రో ఈవెంట్‌లో వివిధ వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి, చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ మురళీవరదరాజన్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రిషి కుమార్ వర్మ, టీ-వర్క్స్ సీఈఓ జోగిందర్ తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సమస్యలపై దరఖాస్తుకు వెబ్‌పోర్టల్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వయోవృద్ధులు తమ ఆస్తికి సంబంధించిన సమస్యలపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా త్వరలో ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను ప్రారంభిస్తామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 200ల మందికి పైగా వయోవృద్ధుల సమస్య లు పరిష్కరించినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని వృద్ధాశ్రమాలను వాటి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానం చేసి వృద్ధులకు వివిధ రకాల జబ్బుల చికిత్స చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా వయో వృద్ధుల సంక్షేమ అధికారి రాజేందర్, జిల్లా వైద్యాధికారి వెంకట్, ఏసీపీ ఆంజనేయులు, సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథసింగ్, జీహెచ్ఎంసీ పీఓ అలీం, ప్రియదర్శిని, తివారీ పాల్గొన్నారు.


మహాంకాళేశ్వర ఆలయం నుంచి మూడో బంగారు బోనాన్ని జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయానికి తీసుకెళ్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి బంగారు బోనం

చార్మినార్ జూలై 12 (ఆంధ్రజ్యోతి): సప్త మాతలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా మూడో బంగారు బోనాన్ని జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బంగారు బోనం సమర్పించారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం మీరాలం మండి మహంకాళేశ్వర దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి గుడికి సామూహిక ఊరేగింపుగా భక్తులు బంగారు బోనం, పట్టు వస్త్రాలు, వడి బియ్యంతో తరలి వెళ్లి బోనం సమర్పించారు. కార్యక్రమంలో మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సభ్యులు రాకేష్ తివారి, మధుసూదన్ గౌడ్, మధుసూదన్ యాదవ్, కోటి రెడ్డి, హన్సరాజ్, కాట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీగా చంద్రమోహన్ బాధ్యతల స్వీకరణ

కార్వాన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీగా చంద్రమోహన్ నియమితులైయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉదయ్ కుమార్ మెదక్‌కు బదిలీ కావడంతో సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీగా చంద్రమోహన్‌ను నియమించారు. శుక్రవారం ఉదయం ఆయన చార్జ్ తీసుకోవడం జరిగింది. అనంతరం డీసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహాయ సహకారాలు తీసుకొని ముందుకెళ్తామన్నారు. రానున్న రోజుల్లో పండుగలను దృష్టిలో పెట్టుకొని గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

## నంబర్ ప్లేట్‌లేని వాహనం నడిపిన వ్యక్తికి జరిమానా

చార్మినార్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కొత్త న్యాయ చట్టాల ప్రకారం చార్మినార్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మొదటి కేసులో నిందితులకు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. గుల్జార్ హౌస్ వద్ద తనిఖీలు నిర్వహించిన పోలీసులకు నంబర్ ప్లేట్‌లేని వాహనం నడుపుతున్న సొహైల్ అన్సారీ, సర్వర్‌లపై కేసు నమోదు చేశారు. నిందితులను నాంపల్లి మొదటి ప్రత్యేక జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అభిరాంరెడ్డి నిందితులకు రూ.1400 జరిమానా విధించారని చార్మినార్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

## మామిడిపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి మాతృవియోగం

పహాడి షరీఫ్ జూలై 12 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లాల్ సతీష్‌గౌడ్ తల్లి లాల్ కస్తూరమ్మ(70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, బడంగ్ పేట్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్ల నర్సింహా రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆదిల్ల జంగయ్య, వివిధ పార్టీల నాయకులు సతీష్‌గౌడ్ నివాసానికి చేరుకొని కస్తూరమ్మకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


హుండీ లెక్కింపులో చైర్మన్ కాంత అరవింద్ మహేశ్ యాదవ్, తదితరులు

## జగదాంబిక మహాంకాళి అమ్మవారి హుండీ లెక్కింపు

కార్వాన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారి బోనాల మొదటి పూజ, రెండో పూజకు సంబంధించిన హుండీ లెక్కింపు శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో గోల్కొండ జగదాంబికా బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేశ్ కుమార్, ఆలయ ఈవో శ్రీనివాసరాజు ప్రతినిధులు పాల్గొన్నారు. రెండు పూజలకు సంబంధించి హుండీ లెక్కింపు రూ. రెండు లక్షల 91 వేయి 400 రూపాయిలు ఆదాయం వచ్చినట్లు చైర్మన్ కాంత అరవింద్ మహేశ్ కుమార్ తెలిపారు.

## చేప పిల్లల ఉత్పత్తిదారుల సమావేశం

కార్వాన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్య భవన్‌లో చేప పిల్లల ఉత్పత్తిదారుల సమావేశం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేప పిల్లల ఉత్పత్తిదారులు మాట్లాడుతూ రాష్ట్రంలో 74 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, బిల్లులను విడుదల చేయించవల్సిందిగా చైర్మన్ సాయికుమార్‌ను ఉత్పత్తిదారులు కోరారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ బిల్లుల పెండింగ్ విషయంలో మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంకతో చర్చించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా బిల్లులు విడుదల చేస్తామని, ఉత్పత్తిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.


రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీలత సురేష్‌గౌడ్

## రోడ్డుకు మరమ్మతులు

నార్సింగ్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ వార్డు ధాత్రి కాలనీ నుంచి సాయి ద్వారకమయి కాలనీ రోడ్డు మరమ్మతు పనులు శుక్రవారం నిర్వహించారు. పనులను కార్పొరేటర్ గోకరి శ్రీలత సురేశ్‌గౌడ్ పరిశీలించారు.

## బైక్ అదుపు తప్పి గాయాలతో యువకుడి మృతి

కార్వాన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బైకుపై నుంచి పడి తలకు తీవ్రగాయాలు కావడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన లంగర్‌హౌజ్ టిప్పుఖాన్‌పూల్ బ్రిడ్జిపై చోటు చేసుకుంది. లంగర్‌హౌజ్ సబ్‌ఇన్స్‌పెక్టర్ ప్రీతి తెలిపిన వివరాలు ప్రకారం... పుప్పాల్‌గూడా ప్రాంతానికి చెందిన మహేశ్వరం రోహిత్‌కుమార్(26) గురువారం రాత్రి 11:30 గంటల సమయంలో లంగర్‌హౌజ్ వైపునకు వస్తుండగా టిప్పుఖాన్‌పూల్ బ్రిడి పై బైక్ అదుపుతప్పి క్రింద పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తెలంగాణ సంగీత నాటక అకాడమీ మండలి చైర్మన్ పుంజాలా అలేఖ్య వినయ్ కుమార్‌ను వారి కార్యాలయంలో కలసి పుష్ప గుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న మామిడిపల్లి వాస్తవ్యులు ఎండి నయీమ్ అడ్వకేట్, గుర్జన్ని గణేష్ గౌడ్.
- పహాడిషరీఫ్ ఆంధ్రజ్యోతి

# సమగ్ర కులగణనకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

- 14న కామారెడ్డి నుంచి కరీంనగర్ వరకు సాధన యాత్ర
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


సమావేశంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచే వరకు తమ పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన బీసీ, మహిళా, విద్యార్థి యువజన సంఘాల సమావేశంలో సమగ్రకుల గణన సాధనయాత్ర వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 14న కామారెడ్డిలో సమగ్ర కులగణన సాధన యాత్ర ప్రారంభమై 15 రోజు లపాటు 10 జిల్లాల గుండా సాగి కరీంనగర్‌లో ముగుస్తుందన్నారు. రాష్ట్రంలోని 136 బీసీ సంఘాలు ఈ యాత్రలో పాల్గొంటున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే ఈ యాత్ర ప్రారంభిస్తున్నామని ప్రభుత్వం కళ్లు తెరిపించడానికే ఈ యాత్ర సాగుతుందన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కమిషన్ నియమించిన తర్వాతనే కులగణన చేపడతామని ప్రకటించారని దానిని స్వాగతిస్తున్నామన్నారు. కులగణన ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేసి జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కులగణన ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. బీసీ మేధావులు, కుల సంఘాలు, విద్యావంతులు, మహిళలు పెద్దఎత్తున ఈ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమావేశంలో నాయకులు కుందారం గణేషాచారి, వేముల వెంకటేష్, ఉప్పర శేఖర్ సగర, తాటికొండ విక్రమ్‌గౌడ్, కనకాల శ్యామ్‌కుర్మ, మహేష్‌యాదవ్, మణిమంజరి, నర్సింహనాయక్, మల్లికార్జున్‌యాదవ్, రేణుక తదితరులు పాల్గొన్నారు.


బషీర్‌బాగ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వేములరామకృష్ణ తదితరులు

## విద్యార్థుల మెస్ చార్జీలు చెల్లించాలి

- తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెస్ చార్జీలు గ్రీన్ చానెల్ పద్ధతిలో చెల్లించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రస్తుతం మెస్ చార్జీలను యేడాది, రెండేళ్లకు చెల్లిస్తున్నారని, దీని వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. గ్రీన్ చానెల్ పద్ధతిలో అయితే ప్రతి నెల మెస్ చార్జీలు విడుదలవుతాయని అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధరలపెరుగుదలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలనుపెంచాలని డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తిస్థాయిలో విడుదల చేయాలన్నారు. ర్యాలిలో చంద్రశేఖర్, ప్రీతమ్, పవన్,రఘునాథ్, కిరణ్, అర్జున్, గీత, ఆశ్విని, నవ్య, బిందు తదితరులు పాల్గొన్నారు.


నాట్యం చేస్తున్న కళాకారులు

## రంజింపచేసిన నృత్య రూపకం

రవీంద్రభారతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో శుక్రవారం రవీంద్రభారతిలో కురుగంటి కళాక్షేత్రం 27వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. తెలుగు తొలి వాగ్గేయ కారుడు భక్తరామదాసుకి అంజలి ఘటిస్తూ నాట్య గురువు కురుగంటి రాధిక శిష్య బృందం ప్రదర్శించిన శ్రీరామజయం, రామదాసు విజయం నృత్యరూపకం ప్రేక్షకుల్ని రంజింపజేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్, గౌరవ అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ హాజరై కళాకారులను సత్కరించి అభినందించారు. కళల వికాసానికి కళా సంస్థలు కృషి చేయడం అభినందనీయమన్నారు. కురుగంటి కళాక్షేత్రం 27 ఏళ్లుగా నాట్యకళా సేవలో నిమగ్నమవడం గొప్ప విషయమన్నారు. వందలాది మంది కళాకారులను తయారు చేశారని కొనియాడారు. శాస్త్రీయ కళల్ని విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డా.కె.రత్నశ్రీ, డా.ఇందిరా హేమ, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు.

# దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- సర్కిల్-10 డీఎంసీ శ్రీనివాస్‌రెడ్డి

మదీన, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో దోమల పెరుగుదలను అరికట్టడానికి ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఫలక్‌నుమా సర్కిల్-10 డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 'డ్రై డే' పేరుతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, బస్తీలలో ప్రజలకు అవగాహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జంగమ్మెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మలేరియా, డెంగీ జ్వరాల గురించి వివరించారు. దోమల ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

### అత్తాపూర్ డివిజన్‌లో

రాజేంద్రనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వారానికి ఒక సారి డ్రై డే గా పాటిస్తే దోమల నివారణకు మార్గం ఏర్పడుతుందని


డెంగీ, మలేరియాలను గురించి అవగాహన కల్పిస్తున్న డీఎంసీ శ్రీనివాస్‌రెడ్డి


అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రై డే పై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్

అత్తాపూర్ కార్పొరేటర్ మొండ్ర సంగీత గౌరీ శంకర్ అన్నారు. ఎంటమాలజీ విభాగం అధికారులు ఉదయ్, సానిటరీ సూపర్‌వైజర్ కృష్ణ కిశోర్‌ల ఆధ్వర్యంలో అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం జరిగింది. ప్రజలు తమ ఇళ్లలో నీటిని నిల్వ చేసే ట్యాంకులు, డ్రమ్ములు, పాత్రలను ప్రతి శుక్రవారం ఒక రోజు ఖాళీగా ఉంచితే దోమల నివారణకు మార్గం సులువు అవుతుందన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండ చూడాలన్నారు. కొబ్బరి చిప్పలు, పాత ట్యూబ్ లు ఇంటి ఆవరణలలో ఉండకుండ చూడాలన్నారు. పాఠశాలలో విద్యార్థులు కూడా దోమల వలన కలిగే అనారోగ్య సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్త రూట్లలో బస్సులు

- 16 హెచ్/49 ఎం రూట్‌లో ఈనెల 15 నుంచి...
- ఈసీఐఎల్ నుంచి మెహిదీపట్నంకు 4 మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో కొత్త రూట్లలో ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి తెచ్చేదిశగా చర్యలు తీసుకుంటున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 15 నుంచి 16 హెచ్/49ఎం రూట్‌లో ఈసీఐఎల్ నుంచి మెహిదీపట్నంకు 4 మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఈసీఐఎల్ నుంచి ఉదయం 7గంటలకు మొదటి బస్సు, మెహిదీపట్నం నుంచి మొదటి బస్సు ఉదయం 8:35 నిమిషాలకు ఉంటుందన్నారు. ఈ రూట్‌లో 45 నిమిషాలకు ఓ బస్సు అందుబాటులో ఉంటుందని ప్రయాణికులు ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసీఐఎల్ నుంచి వయా సర్దార్ పటేల్‌నగర్, యునాని ఆస్పత్రి, ఇందిరానగర్, వసుందర డిగ్రీకాలేజీ, ప్లేగ్రౌండ్, యూనియన్ కార్బైడ్, జెడ్‌టీఎస్, ఎన్ఎండీసీ కాలనీ, ఈస్ట్ ఆనంద్‌బాగ్, సాయినగర్, మల్కాజిగిరి, మిర్జాల్‌గూడ, న్యూబిడి, మెట్టుగూడ, అలుగడ్డబావి, చిలకలగూడ ఎక్స్‌రోడ్, సికింద్రాబాద్, సంగీత్, ప్లాజా, పోలీస్‌లైన్స్, ఆర్‌జేకాలేజీ, పంజాగుట్ట, రోడ్ నెం.7, మాసబ్ ట్యాంక్, మెహిదీపట్నంకు సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్

## పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులను అరికట్టాలి

గోషామహల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విచ్చలవిడిగా ఉన్న పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులను అరికట్టాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కామారెడ్డి, బాన్సువాడలో ఉన్న మధురాలయ బార్‌ను ఉదయం 9 గంటలకు ఓపెన్ చేశారని... అక్కడి నుంచి మరోక చోటికి మార్చడం జరిగిందన్నారు. తాను నష్టాలలో ఉన్న కూడా నడుపుతున్నానని... యజమాని సుధాకర్ గౌడ్ మీద సీఐ కేసు నమోదు చేస్తానని బెదిరించడంతో అక్కడ ఉన్న బార్ యజమాని ఎక్సైజ్ ఆఫీస్ ముందు ధర్నా చేశారన్నారు. బార్ యజమానులు నష్టాల్లో ఉన్నామన్నారు. మన స్టేట్ అసోసియేషన్ కమిటీ వారు, మా బాధలను అర్థం చేసుకొని బార్ యజమానులను ఆదుకోవాలన్నారు.

# 'భూ' మాయ!

- రూ.300 కోట్ల విలువైన భూమికి రెక్కలు
- నిషేధిత జాబితాలో ఉన్నా.. పాస్‌పుస్తకాలు జారీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

నగర శివార్లలోని దాదాపు రూ.300 కోట్లకు పైగా విలువ చేసే 33.08 ఎకరాల పోరంబోకు భూములకు రెక్కలు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న ఈ విలువైన భూములకు కొత్త పాస్‌బుక్‌లు జారీ చేసిన వ్యవహారం అలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఫిర్యాదు రావడంతో భూమిపై జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. మహేశ్వరం మండలం మంఖాల్‌లోని 608, 609, 610 సర్వే నంబర్లలో 33.08 ఎకరాల భూమిని 22ఏ కింద గతంలో నిషేధిత జాబితాలో పెట్టారు. 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో ఈ భూమి పోరంబోకు/గైరాన్ సర్కారీగా నమోదైంది. ఈ భూముల క్రయవిక్రయాలు జరగకుండా 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం వెబ్‌సైట్‌లో కూడా ఇప్పటికీ ఈ భూమి నిషేధిత జాబితాలోనే ఉంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు ఈ భూములకు రెక్కలు వచ్చాయి. ఈ భూమి మొత్తం పట్టా భూమిగా మారిపోయింది. దీనికి సంబంధించిన ఫైళ్లన్నీ సచివాలయం వరకు కదిలాయి. కొందరి పేరు మీద పాస్‌బుక్‌లు కూడా ఆగమేఘాలపై జారీ చేశారు. కొందరు రాజకీయ నేతలు, రియల్ ఎస్టేట్ సంస్థల పేర్ల మీదకు ఈ భూమి మారింది. ప్రభుత్వం మారడంతో దీనిపై స్థానికులు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కొందరు బడా రాజకీయ నేతలు, రియల్ వ్యాపారులు కలిసి ఈ భూములు కొల్లగొట్టారని దీనిపై విచారణ జరపాలని ఆయన ప్రభుత్వానికి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించి జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న రెండు టాస్క్ బృందాల్లో ఒక బృందానికి విచారణ బాధ్యతలు అప్పగించారు. భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు నేతృత్వంలోని రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. ఇదిలా ఉంటే ఇదే సమయంలో స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి సెలవులో వెళ్లడంతో తాత్కాలికంగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మొత్తం ఈ వ్యవహారంపై డిప్యూటీ కలెక్టర్ రాజు, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖర్ లోతుగా విచారణ జరుపుతున్నారు. మొత్తం ఈ భూమి వ్యవహారంపై రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

### 1975 నుంచి రికార్డులు గల్లంతు

మంఖాల్‌లోని ఈ భూములకు సంబంధించిన రికార్డులు కొన్ని గల్లంతైనట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అయితే తొలుత ఈ భూమి సేత్వారీలో పట్టాగా ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. తరువాత కొన్నాళ్లు ప్రభుత్వ రికార్డుల్లో అలానే కొనసాగినప్పటికీ 1975 నుంచి ఈ సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులు గల్లంతయ్యాయి. అనుభవదారుల కాలమ్‌లో కొందరు వ్యక్తుల పేర్లు కొనసాగాయి. 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో పోరంబోకు/సర్కారీ గైరాన్ అని నమోదవుతూ వస్తోంది. చివరకు 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు.

దీంతో ఈ భూముల జోలికి ఎవరూ వెళ్లలేదు. కానీ, కొందరు పేర్లు మాత్రం అనుభవదారుల కాలమ్‌లో రాశారు. సేత్వారీలో గతంలో పట్టాగా నమోదైందని చెబుతూ దీని ఆధారంగానే మిగతా వ్యవహారమంతా నడిపి ఫైల్ క్లియర్ చేసుకున్నట్లు తెలిసింది.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2e6iuLd లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


బుద్వేల్ గ్రీన్ సిటీలో నిబంధనలకు విరుద్ధంగా తయారు చేస్తున్న అల్లం వెల్లుల్లి పేస్ట్ పరిశ్రమను సీజ్ చేసిన అధికారులు

## అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న పరిశ్రమ సీజ్

రాజేంద్రనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బుద్వేల్ గ్రీన్ సిటీ కాలనీలో అప్న ఎంటర్ ప్రైజెస్ అనే పేరుతో ఫ్యాక్టరీని నిర్వహిస్తు నిబంధనలకు విరుద్ధంగా అల్లం ఎల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్న అమీర్ నిజాన్ అనే వ్యక్తిని శుక్రవారం సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.15 లక్షల విలువ చేసే 7.3 టన్నుల అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. సింథటిక్ కలర్స్, యాసిడ్స్, కెమికల్ వాటర్‌ను అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో ఉపయోగిస్తున్నట్లు పోలీసులు కనుగొన్నారు. పరీక్షల నిమిత్తం వాటిని ఫుడ్ సేఫ్టీ అధికారులతో ల్యాబ్‌కు పంపించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

## అన్వేషణ పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రచయిత జీవితంలో నుంచి వచ్చిన అనుభవాలను అక్షరీకరించడం గొప్ప అనుభూతి అని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో డా.తూర్పు మల్లారెడ్డి సాహిత్య వ్యాసాల సంపుటి అన్వేషణ పుస్తకావిష్కరణ సభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నందిని సిధారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రచయిత తూర్పు మల్లారెడ్డి జీవితంలో చేసిన అన్వేషణను పుస్తకంగా తీసుకురావడం అభినందనీయమని అన్నారు. సమాజానికి అర్థమయ్యే భాషలో భిన్నమైన కోణంలో రచనలు రావాలని అన్నారు. కొత్తకోణంలో విమర్శలు చేసే మల్లారెడ్డి రచనలు పరిశోధాత్మకంగా ఉంటాయని అన్నారు. ఈ పుస్తకంలో చాలా విషయాలను సులువుగా చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో నాళేశ్వరం శంకరం, డా.వి.శంకర్, డా.ఏనుగు నరసింహారెడ్డి, మామిడి హరికృష్ణ, దేవదాస్, కందుకూరి శ్రీరాములు పాల్గొన్నారు.


డీజీపీ జితేందర్‌ను కలిసి అభినందనలు తెలుపుతున్న తెలంగాణ ఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.ముజీబ్

## డీజీపీని కలిసిన తెలంగాణ ఎన్జీవోస్ కేంద్ర సంఘం నాయకులు

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ డీజీపీగా నియామకమైన జితేందర్‌ను తెలంగాణ ఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.ముజీబ్‌లు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధక్షుడు డీజీపీ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు వివిధ ఆఫీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీకాంత్, భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ సభ్యులు మల్లారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న పరేడ్ గ్రౌండ్‌లో ప్రపంచ శాంతి సభ

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ పీస్ సంస్థ ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా అక్టోబర్ 2న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రపంచ శాంతి సభ నిర్వహిస్తున్నట్లు ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు కే.ఏ. పాల్, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ రోశయ్యలు తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రపంచ శాంతి సభ, గ్లోబల్ పీస్ ర్యాలీ వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఇండియన్ ఈమేజ్‌ను పెంచడానికి తెలుగు రాష్ట్రాలు, దేశం అప్పుల బాధ నుంచి బయటపడడానికి ఆర్థికాభివృద్ధి సాధించడానికి వందల కంపెనీలు దేశానికి రావడానికి సెక్యులరిజాన్ని కాపాడుకోవడానికి ఈ ప్రపంచ శాంతి సభ ఎంతో దోహదపడుతుందన్నారు. కంపెనీలు రావడం వల్ల ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని 28 రాష్ట్రాలు ప్రపంచంలోని 200 దేశాల నుంచి ప్రతినిధులు ఈ శాంతి మహాసభలో పాల్గొంటున్నారని వారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ ఎంపీ పురుషోత్తమ్ రూపాల ఈ మహాసభకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ ప్రపంచ శాంతి సభ విజయవంతం కావడానికి అందరూ సహకరించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీతోపాటు 18 పార్టీలకు చెందిన ఎంపీలు ఈ సభకు హజరు కాబోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్లోబల్ పీస్‌సంస్థ ప్రతినిధులు జ్యోతి,ఎం.బాబోని రాజు, పి.వి.రావు, దన్‌రాజ్,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


మొహర్రం సందర్భంగా డబీర్ పురాలోని బీబీకా ఆలంకు ముస్లింలు క్యూ కడుతున్నారు. ఆలంకు దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకుంటున్నారు



మాట్లాడుతున్న దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్

## గోల్కొండ బోనాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

● దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్

**హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** గోల్కొండ శ్రీ జగదాంబ ఆలయంలో ఆషాడ మాస బోనాల వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గోల్కొండ కోటలో పోలీస్, రెవెన్యూ, విద్యుత్, ఆర్అండ్బీ, దేవాదాయ, వైద్య, మున్సిపల్, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శైలజారామయ్యర్ మాట్లాడుతూ అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, అడిషనల్ పోలీస్ కమిషనర్ విక్రమ్ మాన్సింగ్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ పోలీస్ కమిషనర్ చంద్రమోహన్, ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్మహేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## లాల్దర్వాజా బోనాల జాతర ప్రత్యేక అధికారిగా అంజనరెడ్డి

**హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** లాల్దర్వాజా సింహవాహిని మహాకాళి బోనాల జాతర-2024 ప్రత్యేక అధికారిగా ఎస్.అంజనరెడ్డిని నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొంతకాలం నుంచి లాల్దర్వాజా ఆలయ నిర్వహణలో భారీ ఎత్తున అవకతవకలు జరుగుతున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై దేవాదాయ శాఖ విచారణకు ఆదేశించింది.

## డెంగీ నివారణకు సమన్వయంతో పనిచేయండి

● జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

**హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** డెంగీ నివారణకు సమన్వయంతో పనిచేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులకు సూచించారు. జోనల్ కమిషనర్లతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆమె దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. డెంగీ హాట్స్పాట్లు గుర్తించి.. ఆ ఏరియాల్లో వ్యాధి విస్తరించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. డెంగీ కేసుల వివరాలు, సంబంధిత చిరునామాలను వైద్యారోగ్య శాఖ నుంచి తీసుకోవాలన్నారు. వరదనీరు నిలిచే ప్రాంతాల్లో భూగర్భ సంపుల నిర్మాణం, వల్నరబుల్ గార్బేజ్ పాయింట్ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రై డేలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాలు, పాఠశాలల్లో అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

## బంగారం తాకట్టుపెట్టి సైబర్ నేరగాళ్లకు రూ.8.26 లక్షలు

● కస్టమ్స్ అధికారుల పేరుతో బెదిరింపులకు భయపడిన మహిళ

**హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** కస్టమ్స్ అధికారులమంటూ బెదిరించి ఓ మహిళ నుంచి రూ. 8.26 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. నగరానికి చెందిన మహిళకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి, కస్టమ్స్ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. మీ పేరుతో మలేషియాకు పంపిన కొరియర్లో మాదకద్రవ్యాలు, నిషేధిత పదార్థాలు ఉన్నాయని, దీనిపై ఢిల్లీ పోలీసులతో మాట్లాడుకోవాలని మరొకరికి కాల్ కలిపాడు. పోలీసు దుస్తులు ధరించిన వ్యక్తి మహిళతో మాట్లాడాడు. మనీ ల్యాండరింగ్, డ్రగ్స్ కేసులకు సంబంధించి పెద్ద ముఠా పట్టుబడిందని. వారి నుంచి మీ వివరాలు లభ్యమయ్యాయని, మీపై కూడా కేసు నమోదైందని బెదిరించాడు. బాధితురాలు ఆ పార్సిల్తో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపినా.. కేసు నుంచి తప్పించేందుకు డబ్బు ఖర్చు అవుతుందన్నాడు. అప్పటికే భయపడిన మహిళ కేసు నుంచి బయట పడేందుకు అతడు సూచించిన ఖాతాకు డబ్బులు పంపింది. కేసు ఢిల్లీ పోలీసులు నమోదు చేశారని, కేసు మూసేయించాలంటే ఢిల్లీ వెళ్లాలని చెప్పిన సైబర్ నేరగాడి మాటలు నమ్మి నగలు తాకట్టు పెట్టి మరీ అతడు సూచించిన ఖాతాకు డబ్బులు పంపింది. ఇలా మహిళ నుంచి రూ.8.26 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు ఫోన్ చేయడం మానేశారు. దాంతో మోసపోయానని గ్రహించిన మహిళ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## వర్క్ ఫ్రం హోం పేర రూ.6 లక్షలు లూటీ

**కీసర రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** వర్క్ ఫ్రం హోం పేరుతో సైబర్ నేరగాళ్ల చేతిలో ఓ మహిళ మోసపోయిన ఘటన శుక్రవారం మేడ్చల్ జిల్లా కీసర పోలీస్స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కీసర మండల కేంద్రంలో నివసించే లహరి గృహిణి. కుటుంబ సభ్యులతో కలిసి స్థానికంగా ఉన్న రాక్ ఫ్రంట్ కాలనీలో నివసిస్తుంది. వర్క్ ఫ్రం హోం ద్వారా ఆన్లైన్లో పనిచేస్తూ సులువుగా డబ్బులు సంపాదించవచ్చని టెలిగ్రాం గ్రూప్ ద్వారా ఈ నెల 4న సైబర్ నేరగాళ్లు ఆమెను సంప్రదించారు. వారి మాయమాటలు నమ్మిన ఆమె వారి ఉచ్చులో చిక్కింది. గూగుల్స్టార్ రేటింగ్స్ ఇస్తే, ఇచ్చిన టాస్కలను పూర్తి చేసిన పక్షంలో వెంటనే డబ్బులు చెల్లిస్తామని ఆమెకు ఆశ చూపారు. బ్యాంక్ ఖాతా, తదితర వివరాలు తెలియజేయాలని సూచించారు. లహరి తన బ్యాంక్ ఖాతాకు సంబంధించిన పూర్తి వివరాలను వెలువరించింది. వెంటనే ఆమెకు చెప్పిన విధంగా రూ.2,800 చెల్లించారు. టాస్కలను పూర్తి చేయడంతో పాటు పెట్టుబడి పెట్టిన పక్షంలో లక్షల్లో లాభం వస్తుందని ఆశ చూపారు. వారి సూచనల మేరకు ఇచ్చిన టాస్కలను, గేమ్లను పూర్తి చేస్తూ పెట్టుబడిగా ఆన్లైన్లో డబ్బులు చెల్లిస్తూ వచ్చిన ఆమెకు లాభంతో కలిపి తిరిగి ఇస్తూ వచ్చారు. ఇదంతా కూడా టెలిగ్రామ్ గ్రూప్ ద్వారా చాటింగ్ చేస్తూ వ్యవహారాన్ని కొనసాగించారు. మధ్యమధ్యలో నకిలీ సభ్యులను సృష్టించి, వారు లక్షల రూపాయలు పొందినట్లు గ్రూపుల్లో నమ్మబలికారు. ఇదంతా నమ్మిన లహరి తన ఖాతా నుంచి గురువారం రూ.40 వేలు సైబర్ మోసగాళ్ల ఖాతాలో వేసింది. ఆ డబ్బులు తిరిగి ఇవ్వకపోగా వివిధ కారణాలు చెబుతూ విడతల వారీగా అదనంగా రూ.ఆరు లక్షలను వారి ఖాతాలో జమచేయించుకున్నారు. మరో రూ.ఆరు లక్షలు చెల్లించినచో తిరిగి ఒకేసారి రూ.12 లక్షలు చెల్లిస్తామని చెప్పారు. వారి మోసాన్ని గమనించిన లహరి భర్త కిషన్ వెంటనే కీసర పోలీసులను ఆశ్రయించగా, సైబర్ క్రైం వారికి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## విజన్ 2054

(3వ పేజీ తరువాయి): నిర్వహణ కోసం ఏ వాహనాలను వినియోగిస్తున్నారు. సొంత వాహనాలా? లేక బస్సు, మెట్రోరైలు, ఎంఎంటీఎస్, ప్రైవేటు వాహనాలా? అనే అంశాలపై ఆరా తీయనున్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మెట్రోస్టేషన్లకు దాదాపు 500మీటర్ల నుంచి కిలోమీటర్ పరిధిలోని నివాసితులు సులువుగా చేరేందుకు గల అవకాశాలను పరిశీలించనున్నారు. వాకింగ్ చేస్తూ స్టేషన్లకు చేరేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించనున్నారు. సైక్లింగ్ ట్రాక్లకు ఉన్న అవకాశాలను సైతం గుర్తించనున్నారు. బస్సు, మెట్రో, ఎంఎంటీఎస్ ఇలా ప్రజా రవాణాను వినియోగించుకునేవారికి లాస్ట్ మైల్ కనెక్టివిటీ ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా తగిన సూచనలు చేయనున్నారు. మల్టీమోడల్ ఇంటిగ్రేషన్ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టేందుకు తగిన ప్రణాళికను అందజేయనున్నారు. అయితే ఈ సమగ్ర మొబిలిటీ ప్రణాళికలను రూపొందించడానికి ఇప్పటికే లీ అసోసియేట్ సర్వే చేపట్టింది. 2024 నుంచి 2054 వరకు 30ఏళ్లకు అంచనాలు వేయనున్నారు. ఈ సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహించి ఏడాదిలో సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించారు.

## రూ.లక్షకు 18 రోజుల చిన్నారి విక్రయం



పోలీసుల అదుపులో ఉన్న తండ్రి ఆసిఫ్, మధ్యవర్తులు

(3వ పేజీ తరువాయి)
చెందిన అస్మాబేగం, ఆసిఫ్ దంపతులకు ఇప్పటికే ఓ కుమారుడు(6) ఉండగా ఇటీవల కుమార్తె జన్మించింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆసిఫ్ అప్పుడే పుట్టిన తన కుమార్తెను అమ్మేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు భార్య అంగీకరించకపోవడంతో విడాకులిస్తానని బెదిరించి ఒప్పించాడు. అనంతరం తన బంధువైన చాంద్ సుల్తానాతో శిశు విక్రయం కోసం మాట్లాడుతుండగా వారి పక్కింటి వ్యక్తి పాషా విషయం తెలుసుకున్నాడు. కర్ణాటకలో ఉండే తన సోదరుడు మిలాన్ సాబ్కు పిల్లలు లేరని, అతనికి శిశువును ఇవ్వాలని కోరాడు. ఇందుకు ఆసిఫ్ అంగీకరిచడంతో కర్ణాటక నుంచి హైదరాబాద్ వచ్చిన మిలాన్ సాబ్ రూ.లక్ష చెల్లించి 18రోజుల శిశువును తీసుకెళ్లిపోయాడు. అయితే, కన్నబిడ్డ దూరం కావడాన్ని జీర్ణించుకోలేకపోయిన అస్మాబేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మిలాన్సాబ్ను హైదరాబాద్కు రప్పించిన పోలీసులు చిన్నారిని కన్నతల్లి బేగంకు అప్పగించారు. ఆసిఫ్, సుల్తానా, పాషా, మిలాన్సాబ్ను అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు.

# స్కూళ్ల పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్లు..!

- ప్రభుత్వ పథకాల పనితీరుపై పరిశీలన
- వారంలో మూడు పాఠశాలల సందర్శన
- పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ, హాజరుశాతంపై నివేదిక
- అమ్మ ఆదర్శ పాఠశాలల పురోగతిపై సమీక్ష
- ఇతర అధికారుల అజమాయిషీపై టీచర్ల అసహనం

**ప్రభుత్వ పాఠశాలల్లో సంక్షేమ పథకాల తీరుతెన్నులను పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని 24 మండలాలకు జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న పలువురు అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. ఈ మేరకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారుల నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను ఇటీవల జారీ చేశారు.**



నల్లగుట్ట స్కూల్లో పూర్తికాని వాటర్ సంప్ పనులు

**హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు రంగంలోకి దిగనున్నారు. జిల్లాలోని 691 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సుమారు 1,09,581 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 6,200 మంది ఉపాధ్యాయులు బోధనలు అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలపై పర్యవేక్షణ కోసం స్పెషల్ ఆఫీసర్లకు పలు రకాల పనులను అప్పగించి ప్రత్యేక ప్రొఫార్మాను అందజేశారు. ఇందులో రోజువారీగా విద్యార్థుల హాజరు, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, యూనిఫాంల పంపిణీ, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన విద్యుత్, తాగునీరు, బాలికల టాయిలెట్ల నిర్మాణం, పనిచేయని మరుగుదొడ్ల వివరాలను తెలుసుకుని నివేదికను డీఈఓకు అందజేయాల్సి ఉంది. వారంలో తమకు కేటాయించిన మండలంలోని మూడు స్కూళ్లను సందర్శించి అక్కడి పరిస్థితిపై నివేదిక రూపంలో సమగ్రంగా అందజేస్తే.. దానిపై ప్రతీ సోమవారం కలెక్టరేట్లో జరిగే ప్రజావాణిలో కలెక్టర్ చర్చించనున్నారు. అయితే, తమ పనితీరును తెలుసుకునేందుకు ఇతర శాఖల అధికారులను నియమించడంపై కొంతమంది ఉపాధ్యాయులు పెదవి విరుస్తున్నారు. తమపై డిప్యూటీ ఐఓస్, డిప్యూటీ ఈఓలు ఉండగా.. కొత్తగా వేరే వారు పర్యవేక్షించడం ఏమిటని చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా, అదనపు బాధ్యతలు అప్పగించిన స్పెషల్ ఆఫీసర్లు సైతం నిట్టూరుస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే పనిభారంతో సతమతమవుతున్న తమపై కొత్తగా విద్యాశాఖ పర్యవేక్షణ ఏమిటని కొందరు వాపోతున్నట్లు తెలుస్తోంది.

### సా.. గుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులు

అమ్మ ఆదర్శ పాఠశాల కింద జిల్లాలోని 691 స్కూళ్లలో 384 బడులను ఎంపిక చేశారు. ఈ మేరకు గ్రీన్చానల్ కింద ప్రభుత్వం రూ. 30.63 కోట్లు మంజూరు చేసింది. డీఈఓ ఆధ్వర్యంలో మేలో ప్రారంభించిన వివిధ రకాల పనులను జూన్ 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు పూర్తయినా ఆయా స్కూళ్లలో ఇంకా 30 శాతం పనులు మిగిలి ఉన్నాయి. విద్యుత్, తాగునీరు, చిన్న,చిన్న మరమ్మతులను త్వరగా పూర్తి చేయించినప్పటికీ.. టాయిలెట్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

| మండలం | ప్రత్యేక అధికారి, శాఖ |
|---|---|
| అమీర్పేట్ | పవన్కుమార్, ఇండస్ట్రియల్ జిల్లా మేనేజర్ |
| అమీర్పేట్-2 | రమేష్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్ |
| ఆసిఫ్నగర్ | యాదయ్య, ఎస్సీ వెల్ఫేర్, డీడీ |
| ఆసిఫ్నగర్-2 | వడ్డెన్న, జిల్లా ఇంటర్ విద్యాధికారి |
| బహదూర్పురా | ఇలియాస్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి |
| బహదూర్పురా-2 | ఆశన్న, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి |
| బండ్లగూడ | కోటాజీ, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి |
| బండ్లగూడ-2 | రాజేందర్, జిల్లా డిసేబుల్డ్ వెల్ఫేర్ అధికారి |
| చార్మినార్ | అక్కేశ్వర్రావు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి |
| చార్మినార్-2 | రమాదేవి, జిల్లా కోఆపరేటివ్ అధికారి |
| గోల్కొండ | సురేందర్, ముఖ్య ప్రణాళికాధికారి |
| హిమాయత్నగర్ | విజయ్కుమార్, రీజనల్ కోఆర్డినేటర్, మైనార్టీ వెల్ఫేర్ |
| ఖైరతాబాద్ | కేశవులు, డీడీ సర్వే డిపార్ట్మెంట్ |
| ఖైరతాబాద్-2 | జగన్నాథ్రావు, డీడీ గ్రౌండ్ వాటర్ |
| మారేడ్పల్లి | సుధాకర్, జిల్లా క్రీడాధికారి |
| ముషీరాబాద్ | రమేష్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి |
| ముషీరాబాద్-2 | చరితారెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి |
| నాంపల్లి | రాజేంద్రప్రసాద్, డిప్యూటీ కమిషనర్, కార్మికశాఖ |
| సైదాబాద్ | నాగలక్ష్మి, డీడీ, వయోజన విద్య |
| సైదాబాద్-2 | వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి |
| సికింద్రాబాద్ | మైత్రిప్రియ, జిల్లా ఉపాధికల్పన అధికారి |
| సికింద్రాబాద్-2 | ప్రభావతి, అసిస్టెంట్ కమిషనర్,కార్మికశాఖ |
| షేక్పేట్ | ఇందిరా, అసిస్టెంట్ డైరెక్టర్, హ్యాండ్లూమ్స్ |
| తిరుమలగిరి | వర్మ, రీజనల్ కోఆర్డినేటర్, బీసీ వెల్ఫేర్ |

## రేపు లష్కర్గూడలో సీఎం సభ

● స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

**అబ్దుల్లాపూర్మెట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం లష్కర్గూడలో ఈనెల 14న సీఎం రేవంత్రెడ్డి పాల్గొననున్న సభా స్థలాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ శశాంక, పోలీస్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. సభలో గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కార్మికులకు సేఫ్టీ కిట్స్లను పంపిణీ చేయనుంది. అందులో భాగంగా లష్కర్గూడ గ్రామ పరిధిలోని సుమారు మూడెకరాల తాటివనంలో కార్యక్రమం ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం రేవంత్రెడ్డితో పాటు మంత్రులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గీత కార్మికుల ప్రాణ రక్షణ కోసం బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో సీఎం చేతుల మీదుగా సేఫ్టీ కిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున గీత కార్మికులు ఈ సభలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, డీసీపీ ప్రవీణ్కుమార్, జిల్లా అధికారులు, పోలీస్, ఎక్సైజ్ శాఖ, బీసీ వెల్ఫేర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 90 శాతం ఫీడర్ల సర్వే పూర్తి

● పరిశీలించిన డిస్కం సీఎండీ



రాయదుర్గంలో విద్యుత్లైన్ల ఫొటో తీస్తున్న ముషారఫ్ ఫరూకీ

**హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** నగరాల్లో ఎక్కడ విద్యుత్ అంతరాయాలు తలెత్తినా నిమిషాల్లో సమస్యను గుర్తించి పరిష్కరించేలా టీజీఎయిమ్స్ యాప్ను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) అందుబాటులోకి తేనుంది. ఇందులో భాగంగా హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్నగర్, నల్లొండ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 11 పట్టణాలు, నగరాల పరిధిలో 11 కేవీ ఫీడర్ల సర్వేను జూన్ 24 నుంచి డిస్కం ప్రారంభించింది. హైదరాబాద్ సౌత్ సర్కిల్లోని చార్మినార్, గుల్జార్హౌస్, పత్తర్గట్టి, సైబర్సిటీ సర్కిల్ పరిధిలోని కేబుల్ బ్రిడ్జి, అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న 11 కేవీ ఫీడర్ సమగ్ర సర్వేను టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ శుక్రవారం పరిశీలించారు. సర్వే సందర్భంగా అధికారులు, సిబ్బంది తీసుకుంటున్న వివరాలు, ఫొటోలను పరిశీలించారు. ఇప్పటికే సర్వే 90 శాతం ఫీడర్ల పరిధిలో పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. సర్వేలో మెట్రోజోన్ చీఫ్ ఇంజనీర్ కె.నరసింహస్వామి, రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ పి.ఆనంద్, సైబర్సిటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.వెంకన్న, అధికారులు పాల్గొన్నారు.

## ట్రాన్స్జెండర్ దారుణహత్య

(3వ పేజీ తరువాయి)
అనుమానిస్తున్నారు. సనత్నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలు పరిశీలించడంతో పాటు సెల్ఫోన్ సిగ్నల్స్ను విశ్లేషిస్తున్నట్లు ఏసీపీ హన్మంతరావు వెల్లడించారు.

### ఠాణా వద్ద ట్రాన్స్జెండర్ల నిరసన



ఆందోళన చేస్తున్న ట్రాన్స్జెండర్లు

షీలా హత్యకు కారణమైన వారిని వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని ట్రాన్స్జెండర్లు డిమాండ్ చేశారు. భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని దాడులు జరుగుతున్నాయని ట్రాన్స్జెండర్లు ఠాణా వద్ద నిరసనకు దిగారు. గతంలో కూడా పలు హత్యలు జరిగాయని, వీటి వెనుక ఎవరి హస్తం ఉందనేది పోలీసులు దర్యాప్తు చేసి నిర్ధారించాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్జెండర్లకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య వారికి మద్దతు పలికారు.

# నగరంలో కాల్పుల కలకలం



గాయపడిన రాజు

(3వ పేజీ తరువాయి)
బస్తీకి చెందిన రాజు (24), అయ్యాను(26) పోలీసులపై గొడ్డలి, రాళ్లతో దాడికి దిగారు. పోలీసులమని చెబుతున్నా.. పట్టించుకోకుండా దాడికి తెగబడడంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు తుపాకీతో కాల్పులు జరిపారు. రాజు తొడలో బుల్లెట్ దిగడంతో అతను అక్కడే కింద పడిపోగా అయ్యాన్ పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు వెంబడించి అతన్ని పట్టుకుని నాంపల్లి పీఎస్కు తరలించారు. గాయాలపాలైన రాజును ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు శస్త్ర చికిత్స చేసి బుల్లెట్ను తొలగించారు. ప్రస్తుతం రాజు పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు.

### తరచూ దారి దోపిడీలు..

నిందితులపై గతంలోని హబీబ్నగర్ పోలీస్స్టేషన్లో సెల్ఫోన్ దొంగతనాలకు సంబంధించిన కేసు నమోదు అయినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. రోజూ నాంపల్లి రైల్వే స్టేషన్ వద్దకు వచ్చే ప్రయాణికులను బెదిరించి సెల్ ఫోన్లు, బంగారు ఆభరణాలు విలువైన వస్తువులు, నగదును తస్కరిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు వచ్చేవి. అర్ధరాత్రి దొంగతనాలు కావడంతో బాధితులు ఉదయం వరకు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయకపోవడంతో నిందితులు సాఫీగా తప్పించుకుంటున్నారని అధికారులు గుర్తించి ఈ డెకాయిట్ ఆపరేషన్ను నిర్వహించారు. స్థానికంగా ఉండే బస్తీ వాసులే ఈ సంఘటనలో పట్టుబడటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### వైట్నర్ మత్తులో..

మాంగార్ బస్తీ, హబీబ్నగర్, కోమటికుంట ప్రాంతాల్లో కొంతమంది యువకులు నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో బెల్ట్ షాపులు, గంజాయి, మత్తు టాబ్లెట్ల అమ్మకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా నాంపల్లి రైల్వేస్టేషన్, పబ్లిక్ గార్డెన్, ఎంజీబీఎస్, బజార్ ఘాట్ తదితర ప్రాంతాల్లో వైట్నర్ మత్తులో ఉండే యువకులు దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. తాజా ఘటనలో సైతం ఆయా యువకులు వైట్నర్ మత్తులో ఉన్నట్లు గుర్తించారు.

## 22 నిమిషాల్లో రూ.21.24 లక్షలు ఫ్రీజ్

(3వ పేజీ తరువాయి)
బాధితులు గోల్డెన్ అవర్లో స్పందించడం వల్లే సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన రూ. 21.24లక్షలు సైబర్ క్రైమ్ పోలీసులు ఫ్రీజ్ చేశారు. పోగొట్టుకున్న డబ్బును రికవరీ చేయడంతో బాధితుల ఆనందానికి అవధుల్లేవు. పూర్తి వివరాలను సైబర్ క్రైమ్ డీసీపీ కవిత ధార వెల్లడించారు.

● **రూ. 17.45లక్షలు పోగొట్టుకున్న వైద్యుడు**

ముంబై క్రైమ్ బ్రాంచి పోలీసులం అంటూ మాట్లాడి, మనీల్యాండరింగ్ కేసులో మీ పాత్ర ఉన్నట్లు తేలిందని, మీ ఖాతా నుంచి అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగాయని నగరానికి చెందిన ఓ వైద్యుడిని బెదిరించి, భయపెట్టిన సైబర్ నేరగాళ్లు జూలై-9న రూ. 17,45,0413 కొల్లగొట్టారు. వెంటనే తేరుకున్న డాక్టర్.. క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఎన్సీఆర్పీలో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన డ్యూటీ ఆఫీసర్ ఎండీ జావీద్ బాధితుడు కంప్లైంట్లో పేర్కొన్న వివరాల ప్రకారం.. డబ్బులు చెల్లించిన బ్యాంకు ఖాతా నుంచి ఆ డబ్బులు ఏ ఖాతాలకు జమయ్యాయో చూసి వెంటనే వాటిని స్తంభింపజేయాలని సంబంధిత బ్యాంకు అధికారులను సూచించారు. దాంతో బ్యాంకు అధికారులు టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా బాధితుడు పోగొట్టుకున్న రూ. 17.45లక్షల డబ్బును కేవలం 22 నిమిషాల్లోనే ఫ్రీజ్ చేశారు. డబ్బును ఫ్రీజ్ చేసిన విషయం తెలియగానే బాధితుడి ప్రాణం లేచి వచ్చినట్లయింది.

● మరో కేసులో ఈనెల 11న సైబర్ నేరగాళ్ల బారినపడిన నగరవాసి రూ. 3.79 లక్షలు పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే ఎన్సీఆర్పీ పోర్టల్లో ఫిర్యాదు చేశారు. డ్యూటీలో ఉన్న ఆఫీసర్ శ్రీకాంత్ నాయక్ వెంటనే స్పందించి సంబంధిత బ్యాంకు అధికారులను అప్రమత్తం చేశారు. వారి సహకారంతో కేవలం 21 నిమిషాల్లోనే మొత్తం రూ.3.79 లక్షలు ఫ్రీజ్ చేశారు.

● మరో కేసులో పోలీసులు బాధితుడు పోగొట్టుకున్న రూ.97,312 రికవరీ చేశారు. 11వతేదీ అర్ధరాత్రి నగరానికి చెందిన వ్యక్తి సైబర్ నేరం బారినపడి రూ.97,312లు పోగొట్టుకున్నాడు. వెంటనే తేరుకొని రాత్రిపూట హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. డ్యూటీలో ఉన్న ఆఫీసర్ బి.సందీప్ వెంటనే స్పందించి టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా ఆ డబ్బును రికవరీ చేశారు.

### గోల్డెన్ అవర్లో స్పందిస్తే రికవరీ చాన్స్

సైబర్ నేరాల బారినపడిన బాధితులు వెంటనే తేరుకొని మొదటి గంట (గోల్డెన్ అవర్)లోపే సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. లేదంటే ఎన్ఆర్పీ పోర్టల్లో నేరుగా ఆన్లైన్ ఫిర్యాదు చేయాలి. డ్యూటీలో ఉన్న అధికారులు సకాలంలో స్పందిస్తారు. బాధితులు తెలిపిన టెక్నికల్ ఆధారాల ప్రకారం బ్యాంకు అధికారులతో కో ఆర్డినేట్ చేసుకొని సైబర్ క్రిమినల్స్ ఖాతాల్లో ఉన్న డబ్బును వెంటనే ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది.

- కవిత ధార, సైబర్ క్రైమ్ డీసీపీ

## భార్యను హతమార్చి గోనె సంచిలో దాచిపెట్టి..

● కుమార్తెను తీసుకొని పరార్ ● ఆలస్యంగా వెలుగులోకి..



మధుస్మిత(ఫైల్)

**ఉప్పల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** భార్యను హతమార్చి కుమార్తెతో కలిసి పరారైన సంఘటన ఉప్పల్ పోలీస్స్టేషన్ పరిధిలోని న్యూభరత్నగర్లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన ప్రదీప్ బోలా, మధుస్మిత దంపతులు. వీరికి ఒక కుమార్తె. ఉప్పల్ న్యూభరత్నగర్లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ప్రదీప్బోలా స్థానికంగా ఓ హోటల్లో చెఫ్గా పనిచేస్తున్నాడు. ఆరు రోజులుగా హోటల్కు పోలేదు. హోటల్ నిర్వాహకులు అద్దె ఇంటి వద్దకు శుక్రవారం రాగా తాళం వేసి ఉంది. గది నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు 100కు డయల్ చేశారు. దీంతో పోలీసులు గది తాళం పగలగొట్టి చూసే సరికి బాత్రూమ్లోని ఓ గోనె సంచిలో మృతదేహం లభించింది. ఇది మధుస్మితదిగా గుర్తించారు. ఐదారు రోజుల క్రితం ప్రదీప్ బోలానే గొంత నులిమి చంపి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. క్లూస్ టీమ్ నమూనాలను సేకరించారు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## చిట్టీల వ్యాపారి వేధింపులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య



కనకరాజు(ఫైల్)

**కూకట్పల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** చిట్టీల వ్యాపారి వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కూకట్పల్లి పోలీస్స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై ప్రేమ్సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట ప్రగతినగర్లోని శ్రీసాయికృష్ణ క్లాసిక్ అపార్ట్మెంట్లో భోనగిరి కనకరాజు(40) వాచ్మన్గా పనిచేస్తున్నాడు. అదే అపార్ట్మెంట్లో నివాసముండే ఉషారాణి చిట్టీల వ్యాపారం నిర్వహిస్తోంది. ఉషారాణి వద్ద కనకరాజు చిట్టీ వేశాడు. గురువారం రాత్రి చిట్టీ డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన కనకరాజు శుక్రవారం ఉదయం అపార్ట్మెంట్లోని విద్యుత్ తీగలు పట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఉషారాణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆగస్టులో 3 ప్రాపర్టీ షోలు

- క్రెడాయబిలిటీ పేరుతో హైదరాబాద్లో నిర్వహణ
- క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్రెడ్డి వెల్లడి
- వరుస ఎన్నికలతో 8 నెలలుగా రియాల్టీలో కొంత స్తబ్దత
- క్రెడాయ్ జనరల్ సెక్రటరీ జగన్నాథరావు



ప్రాపర్టీ షోల బ్రోచర్ను ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రాజశేఖర్రెడ్డి తదితరులు

**హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) ఆధ్వర్యంలో ఆగస్టులో క్రెడాయబిలిటీ పేరుతో మూడు ప్రతిష్ఠాత్మక ప్రాపర్టీ షోలను నిర్వహించనున్నట్టు క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్రెడ్డి చెప్పారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో 'క్రెడాయబిలిటీ' ప్రాపర్టీ షోలకు సంబంధించిన బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్లో ఆగస్టు 2-4 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో, ఆగస్టు 9-11 తేదీల్లో కొంపల్లి శ్రీ కన్వెన్షన్స్, ఆగస్టు 23-25 తేదీల్లో నాగోల్ మెట్రోస్టేషన్లో ప్రాపర్టీ షోలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నిర్మాణ రంగాభివృద్ధితో ఉద్యోగావకాశాలు పెరగడమేకాకుండా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. బలమైన రియల్ ఎస్టేట్ మార్కెట్ కేంద్రంగా హైదరాబాద్ నిలుస్తుందని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల అన్ని వైపులా రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి జరుగుతుందని, దీంతో లాస్ట్ మైల్ కనెక్టివిటీపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. నిర్మాణ రంగ వృద్ధికి ప్రభుత్వంతో కలిసి క్రెడాయ్ పనిచేస్తుందని తెలిపారు. మహిళల పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి రిజిస్ట్రేషన్ చార్జీల్లో ఒక శాతం రాయితీ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన చెప్పారు. భూముల ధరల పెంపు విషయంపై ప్రభుత్వం ఆలోచించాలని, సహేతుకంగా ధరల్లో మార్పులు చేస్తే తమకు అభ్యంతరం లేదని అన్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలో ఆస్తుల రిజిస్ట్రేషన్లు 12.5 శాతం పెరిగాయని, హెచ్ఎండీఏ పరిధిలో గతేడాదిలో 1.94 లక్షల రిజిస్ట్రేషన్లు, ఈ ఏడాదిలో 2.18 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. 4 జోన్లుగా విభజించి కమిషనరేట్ల వారీగా ఫార్మాక్లస్టర్లు, టౌన్షిప్లు ఏర్పాటు చేయాల్సిన అవసరముందని తెలిపారు. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందని, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ చేత గ్రీన్ బిల్డింగ్లుగా ధ్రువీకరణ పొందిన 884 అభివృద్ధి ప్రాజెక్టులు హైదరాబాద్లో ఉన్నాయని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు(ఎలెక్ట్) ఎన్.జైదీప్రెడ్డి తెలిపారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పెట్టుబడికి ప్రధాన గమ్యస్థానమని, ఏ నగరంతో పోల్చినా హైదరాబాద్ బెస్ట్ సిటీగా ఉందని క్రెడాయ్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ బి.జగన్నాథరావు తెలిపారు. శాసనసభ, లోక్సభ ఎన్నికల నేపథ్యంలో గత 8 నెలలుగా రియల్ ఎస్టేట్ రంగంలో కొంత స్తబ్దత ఉందని, ఆగస్టు నుంచి మంచి రోజులు ప్రారంభమవుతుండడంతో ఇళ్ల అమ్మకాలు మరింత పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో క్రెడాయ్ వైస్ ప్రెసిడెంట్ రాంబాబు కొత్తపల్లి తదితరులు పాల్గొన్నారు.

# నారింజ పానకం

*సుపక్వా నారంగ ఫలం సుపీడితం సంయోజితం శర్కరయాతిశుభ్రయా*
*సహార్ద్రకం చెందూకర్ణేన వాసితం మహీతలె కేన న సంస్కృతం క్షణమ్!*

శ్రీకృష్ణ దేవరాయలు 'ఆముక్తమాల్యద'లో 'వాణిజ్యము పెంచి యేలగానగున్' అన్నాడు. ఆనాటి రాజులు ఆ విధానాన్నే పాటించారు. పోర్చుగీసులతో వాణిజ్యంవల్ల మిరప, బొప్పాయి, జామ, సపోటా, కమలా, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బంగాళదుంపలతో పాటు పొగాకు మనకు పరిచయం అయ్యాయి. 1606లో డచ్ వాళ్లు బతావియా నుంచి తెచ్చి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో పండ్ల తోటలు వేయించారు. వాటి కాయల్ని 'బతావియా నారింజ' అని పిలిచారు. జన వ్యవహారంలో అవే 'బత్తాయి పండ్లు' అయ్యాయి. ఆఖరికి బాతులు, సీమకుక్క పిల్లలు కూడా విదేశీయుల నుంచే మనకు చేరాయి. కాఫీ కూడా డచ్చి వాళ్లవలనే మనకు తెలిసింది. మిరప, బొప్పాయి, బత్తాయి, పొగాకు, సపోటా, బాదం లాంటి కొత్త పదాలు తెలుగులో ఏర్పడ్డాయి.

అంతకు ముందు మనకు తెలిసింది నారింజ (నారంగి) మాత్రమే. నారంగిలోంచి 'నాఖ' శబ్దం లోపించి 'ఆరెంజ్' అనే కొత్త పదం ఆంగ్ల భాషలో చేరింది. పంపరపనస కూడా మన నారింజలాగానే ఉండే పుల్లని పండు (మాండారిన్). నారింజ పంపరపనస ఫలాల సంకరంగా కమలాపండు

**నారంగఫల సంభూతం పానకం వాతనాశనమ్!**

మధురం విశదం రుచ్యం సుస్నిగ్ధం పిత్తహృద్వరమ్!

నారింజ పండు రసంతో చేసిన ఈ పానకం వాత వ్యాధుల్లో చాలా మేలు చేస్తుంది. అకారణంగా వచ్చే నొప్పులు, మైగ్రేన్ తలనొప్పి, చర్మవ్యాధుల్లో మంచిది. వేడివల్ల కలిగే జలుబుల్ని తగ్గిస్తుంది. వేడిని పోగొట్టి శరీరానికి కూలెంట్ ప్రభావాన్నిస్తుంది. ఉద్రేకం తగ్గిస్తుంది. రక్తనాళాలను శుభ్రపరుస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. రుచిని కలిగిస్తుంది. తక్షణం శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తుంది.



ఏర్పడింది. ఆయుర్వేద గ్రంథాలు నారంగ ఫలం గురించి మాత్రమే పేర్కొన్నాయి. నారంగ లేదా నారింజ గుణాలే ఇంచుమించుగా బత్తాయి, కమలాలకూ ఉన్నాయి. ఈ మూడింటిలోనూ అత్యంత శక్తిమంతమైనది నారింజే. కమలా గానీ, బత్తాయి గానీ పైమెరుగులతో మెరుస్తూ, గుజ్జు ఎక్కువగా, తోలు వదులుగా ఉన్నవి జన్యుపరమైన రూపాంతరాలు చేసినవి కావచ్చు. అవి ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయన్నది తెలియదు. చిన్నవిగా ఉన్న పండ్లనే ఎంచుకోవాలి.

ఈ పండ్ల నుంచి రసం తీసి లోపలి గుజ్జుని పారేయటం మంచిది కాదు. తోలు వలిచాక బత్తాయి, కమలాలపై ఉండే తెల్లని పీచును కూడా అలా పారేయకండి. ఈ పీచులో పెప్టిన్, ఏడు శాతం ప్రొటీన్, తగినంత సి, బి విటమిన్లతో సమానమైన 'హెస్పెరిడిన్' ఉంది. 'సి విటమిన్' శరీరానికి వంటబట్టేలా ఈ హెస్పెరిడిన్ దోహదపడుతుంది. రక్తస్రావాన్ని అరికడుతుంది. కేరెట్లో ఉండే బీటాకెరొటిన్ దీంట్లోనూ ఉండటాన, కాషాయ రంగులో దీని గుజ్జు ఉంటుంది. ఇది కంటిచూపునకు మేలు చేస్తుంది. గుండెను బలసంపన్నం చేస్తుంది. ఇందులో ఫాస్ఫరస్, పొటాషియం, కాల్షియం కూడా చాలినంత ఉన్నాయి. తొనలుగా తింటే గుజ్జు, పీచు కూడా ఏకంగా కడుపులోకి వెడతాయి.

జ్వరం రాగానే అన్నం మానేసి ఈ ఫలాల్ని తింటే వెంటనే జ్వరం ఉపశమిస్తుంది. జ్వరానికి వేసుకున్న బిళ్లలు బాగా పని చేస్తాయి. కొంతమందికి ఇవి జలుబు చేస్తాయనే భయం. వ్యక్తిగతంగా ఈ పండు సరిపడని వారికి తప్ప, తక్కినవారందరికీ జలుబుని తగ్గించే గుణమే వీటికి ఉంది. రక్తనాళాలను శుభ్రపరుస్తుంది. అజీర్తిని పోగొట్టి ఆకలిని పెంచుతుంది. నోటికి రుచిని కలిగిస్తుంది. గుండెకి మంచిది. వేడిని తగ్గిస్తుంది. తక్షణ శక్తినిస్తుంది. అలసట పోగొడుతుంది. వాతాన్ని, ఉద్రేకాన్ని, కఫాన్ని తగ్గిస్తుంది.

**షుగరు వ్యాధి ఉన్నవారు పంచదార కలపకుండా ఈ పానకం తాగవచ్చు. అల్లం బాగా ఫైబరుతో కూడినది కాబట్టి, ఈ రసం అంతగా షుగరుని పెంచదు. నారింజ లభించకపోతే... బత్తాయి, కమలాలు సంవత్సరం పొడవునా దొరుకుతున్నాయి. వీటిలో మీకు అందుబాటులో ఉన్న ఫలాన్ని రసం తీసి కమ్మని పానకం చేసుకుని తరచూ తాగుతూ ఉండండి. ఆరోగ్యానికి భరోసా ఇచ్చే పండ్లు ఈ నారింజ, బత్తాయి, కమలా.**

నారింజ పండ్ల రసంతో పానకం చేసుకునే విధానాన్ని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో వివరంగా పేర్కొన్నాడు:

- బాగా పండిన ఫలాన్ని ఎంచుకుని, మధ్యకు కోసి, చక్కగా రసాన్ని పిండాలి.
- ఈ రసంలో చాలినంత పంచదార కలపాలి. తగినంత అల్లం తీసుకొని, పొట్టు తీసి, మిక్సీ పట్టి, ముద్దగా చేయాలి. ఆ ముద్దని కూడా ఈ పండ్ల రసంలో కలపాలి.
- పరిమళం కోసం కొద్దిగా పచ్చకర్పూరం కలిపితే కమ్మని ఆరోగ్యదాయకమైన నారింజపండ్ల రసం తయారవుతుంది. బత్తాయితోనూ, కమలాలతో కూడా ఇదే పద్ధతిలో పానకం లేదా షర్బత్ చేసుకోవచ్చు.
- దీన్ని వేడి చేయటం, పాకం పట్టటం లాంటివి చేయకూడదు. అప్పటికప్పుడు కలుపుకోవటమే మంచిది.

• గంగరాజు అరుణాదేవి



# అలలపై ఆమె సంతకం



**పురుషుల ఆధిపత్యం కొనసాగే వాణిజ్య నౌకాయాన రంగంలో... తొలి భారతీయ మహిళా ఇటీఓ రొమీతా బుందేలా. ఈ ఘనత సాధించినా... ఆమె ప్రయాణం అంత సజావుగా సాగలేదు. అడుగడుగునా ఒడుదుడుకులనూ ఎదుర్కొన్నారు. అంకితభావంతో, నైపుణ్యంతో... విమర్శించిన వారితోనే 'భేష్' అనిపించుకొని... కెరీర్‌లో దూసుకెళ్తున్నారు.**

"అది 2017 డిసెంబర్. ఒక మెర్స్క్ వాణిజ్య నౌకలో ఉద్యోగిగా నాకు మొదటి రోజు. నౌక మేనేజర్‌కు రిపోర్ట్ చెయ్యడానికి వెళ్లాను. అతను నావైపు చిరాగ్గా చూశారు. "ఇక్కడ నువ్వేం చేస్తున్నావ్? ఇది నీకు ఉద్దేశించిన ఉద్యోగం కాదు. మనం ఇంకా పోర్టునుంచి బయల్దేరలేదు. నువ్వు ఓడ దిగిపో. ఇంటికి వెళ్ళు. వేరే ఉద్యోగం ఏదైనా చూసుకో" అన్నారు"అంటూ తనకు ఎదురైన అవహేళనను గుర్తు చేసుకున్నారు రొమీతా బుందేలా. మహారాష్ట్రలోని భుసావల్‌లో జన్మించిన ఆమెకు నౌకారంగంలో పని చెయ్యాలనేది చిన్ననాటి కోరిక. "9-5 ఉద్యోగం నా స్వభావానికి సరిపడదు. ప్రపంచమంతా తిరగడానికి వీలు కలిగించే ఉద్యోగాన్ని నేను కోరుకున్నాను. ఓడల్లో పని చెయ్యాలనుకున్నాను. దానికోసం ఎంత శ్రమించడానికైనా సిద్ధమయ్యాను" అంటున్న రొమితా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ తరువాత... షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సిఐ)లో ఉద్యోగానికి అప్లై చేశారు. కానీ ఎంపిక కాలేదు. దాంతో వేరే మార్గాలు కోసం వెతికారు. పుణేలోని తొలానీ మెరిటైమ్ ఇనిస్టిట్యూట్‌లో ఎలక్ట్రో టెక్నికల్ ఆఫీసర్ (ఇటీఓ) కోర్సు ఉందనీ, వాణిజ్య నౌకల్లో పని చేసేందుకు ఆ అర్హత ఉపకరిస్తుందనీ తెలుసుకున్నారు. ఆ కోర్సులో చేరారు. ఆ బ్యాచ్‌లో ఆమె ఏకైక మహిళ, అంతేకాదు, ఆ సంస్థలో ఆ కోర్సు చేసిన మొదటి మహిళ కూడా. కాలేజీలో నాలుగు నెలల శిక్షణ తీసుకున్న తరువాత.. ఎనిమిది నెలలపాటు ఓడలో శిక్షణ ఉంటుంది. దాన్ని కూడా పూర్తి చేశారు.

### అది గొప్ప కాంప్లిమెంట్..

"ఇటీవో హోదాతో ఉద్యోగంలో చేరిన ఒక వాణిజ్య నౌకలో మొదటి భారతీయ మహిళను నేనే. అయితే తొలిరోజే నాకు ఎగతాళి, అవమానాలు ఎదురయ్యాయి. నియామకం జరిగింది కాబట్టి... నన్ను తిరస్కరించడానికి కుదరలేదు. ఇరవై మంది పురుషుల మధ్య... సముద్రం మధ్యలో ఒకే ఒక మహిళగా నేను పని చెయ్యడానికి రకరకాల ఇబ్బందులు పడ్డాను. దానికి తోడు నా నైపుణ్యాన్నీ, నిబద్ధతను క్షణక్షణం అనుమానించారు. నా నైతిక స్థైర్యాన్ని దెబ్బతియ్యాలని చూశారు. నాలుగు నెలల ప్రయాణం ఎన్నో ఒడుదొడుకులతో సాగినా... చివరికొచ్చేసరికి నా పనితీరు చూసి అందరూ గౌరవించడం మొదలుపెట్టారు. ఆ ఓడలో మొదట నాకు నాలుగు నెలలు కాంట్రాక్ట్ ఇచ్చారు. ఏ మేనేజరైతే మహిళ ఈ పనికి పనికిరాదన్నారో... అతనే నన్ను మళ్ళీ రికమండ్ చేశారు. "నీ పనితీరును చూడకుండానే... నిన్ను తప్పుగా అంచనా వేశాను" అన్నారు. అది నాకు గొప్ప కాంప్లిమెంట్" అంటారు రొమీతా. "ఇటీవో లేదా ఎలక్ట్రికల్ ఇంజనీర్‌కు ఎన్నో బాధ్యతలు ఉంటాయి. షిప్‌లోని ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్, ఆటోమేషన్, కంట్రోల్ సిస్టమ్స్... అన్నిటికీ మాదే బాధ్యత. సరుకులు లోపలికీ, బయటకు క్షేమంగా రాకపోకలు సాగించడానికి అవసరమైన వ్యవస్థలన్నిటినీ పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రతి ఎలక్ట్రిక్ వైరు లేదా కేబుల్ సరిగ్గా ఉందో లేదో ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి. వాటితో పాటు డెక్ సేఫ్టీ పరికరాలు, లైటింగ్ సిస్టమ్, రిఫ్రిజిరేషన్, వెంటిలేషన్, పవర్... వీటన్నిటి మేనేజిమెంట్... ఇలా ఎన్నో బాధ్యతలు ఉంటాయి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం తప్పదు" అని చెప్పారామె.

### నరకం అనుభవించాం...

ఆ తరువాత ఆమె అనేక మర్చంట్ వెసెల్స్‌లో పని చేశారు. కరోనా సమయంలో చాలా ఇబ్బందులు పడ్డారు. చైనాలో తొమ్మిది నెలలకు పైగా సముద్రంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఓడను వదిలి వెనక్కు రావాలనుకున్నా విమానాలు తిరగలేదు. ఎప్పుడూ మాస్కులు, పిపిఇ కిట్స్ ధరించి ఉండాల్సి వచ్చేది. "మేము మానసికంగా నరకం అనుభవించాం ఓడలో జీవితం కష్టంగా ఉంటుందనేది అందరికీ తెలిసిందే. కనీసం మూడు నాలుగు నెలలు కుటుంబానికి, స్నేహితులకు దూరంగా ఉండాలి.

మన కదలికలు ఒక ఓడ పరిధికే పరిమితం చేసుకోవడం అంత సులువేం కాదు" అని అన్నారు. రొమీతా. ఆమె తన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు రుజువు చేసుకుంటూ... కేవలం నాలుగేళ్ళలోనే... ఇటీఓ నుంచి సీనియర్ ఇటీఓగా, ఆ తరువాత ఎలక్ట్రిక్ సూపరింటెండెంట్‌గా... అంచెలంచెలుగా ఎదిగారు. "మెర్స్క్‌లో తొలి లేడీ సూపరింటెండెంట్‌ను నేనే. అలాగే తక్కువ వయసున్న వ్యక్తిని కూడా. అప్పుడు నాకు ఇరవయ్యారేళ్ళు. అప్పటికే నేను 64 ఓడల్ని హ్యాండిల్ చేశాను అని చెబుతున్న ఆమె కిందటి ఏడాది... 'కార్నివాల్ యూకే' సంస్థలో చేరారు. "మా ఊర్లో నేనెప్పుడూ సౌకర్యవంతమైన జీవితాన్ని దాటి బయటకు రాలేదు. ఇప్పుడు విభిన్నమైన, ప్రమాదకరమైన వాతావరణాల్లో... ప్రపంచాన్ని చుట్టేస్తున్నాను. ఎక్కడికక్కడ పురుషాధిక్యత ఎదురవుతూనే ఉంటుంది. కానీ నా సామర్థ్యంతోనే దాన్ని ఎదుర్కొంటున్నాను. నా అనుభవంతో... తోటి మహిళలకు, బాలికలకు చెప్పేది ఒక్కటే. "నువ్వు ఆడపిల్లవు, నువ్వేం చెయ్యగలవు?" అనే మాటలు మీకు నిత్యం వినిపిస్తూనే ఉంటాయి. వాటిని పట్టించుకోకండి. మీ లక్ష్యాన్ని నిర్దేశించుకోండి. కృషి చేసి దాన్ని సాధించండి. మీ కెరీర్ మీద దృష్టి పెట్టండి. పురుషులు చేసే వృత్తులన్నీ మనం చెయ్యగలం" అంటున్న రొమీలా... మరింతమంది మహిళలు ఈ కెరీర్ ఎంచుకోవడానికి తన కథ స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నారు.

**కంటేనే అమ్మ కాదని... అమ్మతనం అనేది గుండెల్లో నుంచి రావాలని అంటారు రక్షా జైన్. అందుకే ఏ తల్లి బిడ్డయినా తన బిడ్డగానే భావిస్తారు ఆమె. తల్లి పాలు దానం చేసి... వేలమంది పిల్లలకు అమ్మ అయ్యారు. పసిబిడ్డల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు కారణమై... 'యశోదమ్మ'గా ఎందరో తల్లులకు స్ఫూర్తిమంత్రమై నిలిచారు. 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లోనూ స్థానం సంపాదించారు.**




# నిలువెత్తు అమ్మతనం

"పుట్టిన బిడ్డకు తల్లి పాలు పట్టకపోతే అది వారి ఎదుగుదల మీద ప్రభావం చూపిస్తుంది. మార్కెట్‌లో ఎన్ని ఉత్పత్తులున్నా... అవేవీ తల్లి పాలకు సరితూగవు. అందుకే నా వంతు బాధ్యతగా తల్లి పాలు దానం చేస్తున్నాను. దీనివల్ల ఎంతోమంది పసిపిల్లల ఆరోగ్యవంతమైన బాల్యానికి నేను కూడా ఒక కారణం అవుతాను కదా. ఒక తల్లిగా దీనికి మించిన సంతృప్తి ఏముంటుంది! ఈ ఆలోచనతోనే మరికొన్ని సంఘాలతో కలిసి 'లైఫ్ వెల్ఫేర్ సొసైటీ పింక్ స్క్వాడ్' నెలకొల్పాను. వివిధ కారణాలవల్ల మా సొసైటీలో సభ్యత్వం తీసుకోవడానికి ఆరంభంలో మహిళలు ఎవరూ ముందుకు రాలేదు. ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించడంవల్ల ప్రస్తుతం ఇరవైమంది సభ్యులు ఉన్నారు. రాజస్థాన్‌లోని బిల్వాడా నగరం మాది. వృత్తిరీత్యా నేను ఎలక్ట్రోథెరపిస్ట్‌ను. ఇద్దరు పిల్లల తల్లిని.

### అప్పుడే అనుకున్నా...

ఆరేళ్ల కిందట మా అబ్బాయికి జన్మనిచ్చాను. అదే నా తొలి కాన్పు. మూడు రోజులపాటు వాడికి పాలు ఇవ్వలేకపోయాను. ఆ సమయంలో ఎంతో వేదనకు లోనయ్యాను. మా కుటుంబం కూడా తీవ్ర ఆందోళన చెందింది. దాంతో మహాత్మాగాంధీ ఆసుపత్రిలోని 'ఆంచల్ మదర్ మిల్క్ బ్యాంక్'ను సంప్రతించాను. అక్కడి నుంచి తెచ్చిన వేరొక తల్లి పాలు నా బిడ్డను కాపాడాయి. ఆ క్షణమే భగవంతుడిని వేడుకున్నా... 'తల్లి పాలు దానం చేసే అదృష్టం నాకు కూడా కల్పించ'మని. నా ప్రార్థనలు ఫలించాయి. కొన్నాళ్లకే నా బిడ్డకు నేను పాలు ఇవ్వగలిగాను. అంతేకాదు... మిగిలిన పాలు వ్యర్థం కాకుండా 'ఆంచల్ మదర్ మిల్క్ బ్యాంక్'కు ఇస్తూ వచ్చాను.

### వద్దని వారించినా...

అయితే ఆరంభంలో అందరూ నన్ను వద్దని వారించారు. అలా ఇస్తూపోతే నా ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. నేను వినలేదు. తల్లిపాల దానం వినడానికి చాలా గొప్పగా అనిపిస్తుంది. కానీ దానివల్ల ఎంతో నొప్పిని భరించాల్సి వస్తుంది. అలాగని వెనకగుడు వేయలేదు. వేరొక తల్లి పాలు నా బిడ్డను కాపాడినప్పుడు... నేనెందుకు ఆ పని చేయకూడదని అనుకున్నాను. అవసరంలో ఉన్న పసి పిల్లల ఆకలి తీర్చడంలో ఎనలేని ఆనందం ఉంటుంది. అది వెల కట్టలేనిది. అందుకే మా అబ్బాయి పుట్టిన మూడో రోజు నుంచీ మిగిలిన పాలను మిల్క్ బ్యాంక్‌కు డొనేట్ చేస్తున్నాను.

### కన్న కూతురులా...

తొలి కాన్పు సమయంలో మండల్‌లోని మా అత్తవారింట్లో ఉండేదాన్ని. అక్కడి నుంచి రోజూ బిల్వాడాలోని మిల్క్ బ్యాంక్‌కు ట్యాక్సీలో వెళ్లేదాన్ని. రానూ పోనూ రూ.700 ఖర్చయ్యేది. అలా నెల రోజులు తిరిగాను. ఖర్చు మరీ ఎక్కువైపోవడంతో మా అబ్బాయిని నడుముకు కట్టుకుని, స్కూటీ మీద తిరిగాను. జోరు వానల్లో సైతం వెళ్లి వచ్చిన సందర్భాలు అనేకం. నా జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని ఘటన ఒకటి ఐదేళ్ల కిందట జరిగింది. మహాత్మాగాంధీ ఆసుపత్రికి వెళ్లినప్పుడు అక్కడి సిబ్బంది అప్పుడే పుట్టిన పాపను నా దగ్గరికి తెచ్చారు. పాపకు జన్మనిచ్చి తల్లి పురుట్లోనే చనిపోయిందని, నా పాలు ఆ చిన్నారికి పట్టమని చెప్పారు. నా కళ్లు చమర్చాయి. పసిపాపను నా చేతుల్లోకి తీసుకున్నప్పుడు తెలియని ఉద్వేగం. తను నా కూతురేనన్న అనుభూతి కలిగింది. రక్తదానం జీవితంలో ఎప్పుడైనా చేయవచ్చు. కానీ తల్లి పాలు దానం చేసే అవకాశం అరుదుగా లభిస్తుంది.

### మరింతమందిని ప్రోత్సహిస్తూ...

నన్ను చూసి మా బిల్వాడాలో అనేకమంది తల్లులు స్ఫూర్తి పొందుతున్నారు. వివిధ ప్రాంతాలకు వెళుతూ ఈ దిశగా మహిళలనే కాదు మగవారిని కూడా ప్రోత్సహిస్తున్నాను. ఎందుకంటే దీనికి కుటుంబ మద్దతు చాలా అవసరం. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. మావారు సునీల్, అమ్మ శారదాదేవి, సోదరుడు రాహుల్ సోనీ నా ఈ ప్రయాణంలో కీలక పాత్ర పోషించారు. మిల్క్ బ్యాంక్‌లకు వెళ్లాల్సి వచ్చినప్పుడు రాహుల్ నన్ను తీసుకువెళతాడు. నేను బయటకు వెళితే అమ్మ ఇల్లు, పిల్లల్ని చూసుకొంటుంది. తల్లి పాలు దానం చేయడానికి ఎవరూ సంకోచించక్కర్లేదు. ఆరోగ్య సమస్యలు వస్తాయని భయం అక్కర్లేదు. ఇన్నిసార్లు డొనేట్ చేసినా నేను పూర్తి ఆరోగ్యంగా ఉన్నాను. నా పేరు 'ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లోకి ఎక్కింది. స్థానికులు నన్ను ఆప్యాయంగా 'యశోదమ్మ' అంటుంటారు. ఏదిఏమైనా... ఇప్పటివరకు నావల్ల ఐదు వేలమంది పసిబిడ్డలకు లబ్ధి చేకూరింది. వారి మోముపై మెరిసే చిరునవ్వుకు నేను కూడా ఒక కారణమని తెలిసినప్పుడు... నా మనసు ఉప్పొంగుతుంది." •

### ఒక సంకల్పంతో...

గత ఏడాది నాకు రెండో సంతానం కలిగింది. కాన్పు తరువాత ఆసుపత్రి నుంచి బయటకు రాగానే పాలు దానం ఇవ్వడం ప్రారంభించాను. అలా దాదాపు పది నెలలు ఇచ్చాను. శారీరకంగా ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కానీ నా సంకల్పానికి అవేవీ అవరోధం కాలేదు. అవసరంలో అండగా నిలవడమే కదా మానవత్వం. కన్న బిడ్డకు పాలు ఇవ్వలేక ఎంతోమంది తల్లులు వేదన అనుభవిస్తున్నారు. అలాంటివారికి నేను మనోధైర్యం కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఇప్పటికి 160 లీటర్ల పాలు దానం చేశాను. రాజస్థాన్‌లోనే కాదు... బహుశా దేశంలోనే ఇంత మొత్తంలో తల్లి పాలు డొనేట్ చేసింది నేనే కావచ్చు. మా ప్రాంతానికే పరిమితం కాకుండా పక్క జిల్లాలకు కూడా వెళ్లి వచ్చాను.





వంటిల్లు

**కూరగాయల్లో పీచుపదార్థంతో పాటు విటమిన్లు, మినరల్స్, న్యూట్రిన్లు పుష్కలం. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పలురకాల కూరగాయలతో వండుకునే ఈ మిక్స్‌డ్ వెజిటెబుల్ ఫుడ్‌ను ఇంట్లోనే చేసుకోండిలా..**

# కూరగాయల్ని మిక్స్ చేసి వండితే..

## మిక్స్ వెజిటెబుల్ సబ్జి

**కావాల్సిన పదార్థాలు:** నూనె- 4 టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి రెబ్బలు-6, పచ్చి మిర్చి- 2, అల్లం ముక్కలు- 2 (చిన్నవి), ఎండుమిర్చి- 3, ఉల్లిపాయలు-2 (ముక్కలుగా తరగాలి), టమోటాలు-3 (ముక్కలుగా తరగాలి), జీడిపప్పులు- 10, పనీర్ క్యూబ్స్- 100 గ్రాములు, మీడియం సైజ్ బంగాళదుంప- 1 (ముక్కలుగా కట్ చేయాలి), క్యారెట్-1 (ముక్కలుగా తరగాలి), బీన్స్- 8 (ముక్కలుగా తరగాలి), కాలిఫ్లవర్ ముక్కలు- 10, క్యాప్సికం ముక్కలు- 6, నానబెట్టిన పచ్చి బఠాణీలు- టేబుల్ స్పూన్, జీలకర్ర- టీస్పూన్, పసుపు- కొద్దిగా, కసూరీ మేతీ- అర టీస్పూన్, కారం పొడి- అరటీస్పూన్, జీలకర్ర పొడి- అరటీస్పూన్, ధనియాల పొడి- అర టీస్పూన్, గరం మసాలా- అర టీస్పూన్, కొత్తిమీర- టీస్పూన్, పెరుగు- రెండు టేబుల్ స్పూన్లు

**తయారీ విధానం:** మూకుడులో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేయాలి. కాస్త వేడయ్యాక వెల్లుల్లి రెబ్బలు, అల్లం ముక్కలు, పచ్చిమిర్చి వేసిన తర్వాత గరిటెతో కదపాలి. ఆ తర్వాత ఎండుమిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. ఉల్లిపాయల రంగు మారిన తర్వాత టమోటా ముక్కలు వేసి మూడు నిముషాల పాటు కలిపాక జీడిపప్పు వేయాలి. మూకుడుపై మూత ఉంచి ఆరు నిముషాల పాటు లోఫ్లేమ్‌లో కుక్ చేయాలి. మూకుడులోని కూరగాయలు మగ్గుతాయి. గరిటెతో కదిపిన తర్వాత ప్లేట్‌లోకి తీసి చల్లబర్చిన తర్వాత రెండు స్పూన్ల నీళ్లు పోసి మిక్సీ పట్టాలి. మెత్తటి పేస్ట్‌లా వస్తుంది. ఇప్పుడు మరో ప్యాన్ తీసుకుని టేబుల్ స్పూన్ నూనె వేసి పనీర్ ముక్కలు వేయాలి. రెండు మూడు నిముషాల పాటు వీటిని వేయిస్తే రంగు మారుతుంది. దీన్ని ప్లేట్‌లో వేసి పక్కన ఉంచుకోవాలి. అదే ప్యాన్‌లో బంగాళదుంప ముక్కలు, క్యారెట్ ముక్కలు, బీన్స్, కాలిఫ్లవర్ ముక్కలు వేసి మూడు నిముషాల పాటు కుక్ చేయాలి. క్యాప్సికం ముక్కలు, పచ్చి బఠాణీలు వేశాక తగినంత ఉప్పు వేసి కలపాలి. మూడు నిముషాల పాటు కుక్ చేసిన తర్వాత ఈ కూరగాయముక్కల మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి. అదే ప్యాన్‌లో టేబుల్ స్పూన్ నూనె వేసి జీలకర్ర, పసుపు, కారం, కసూరీ మేతీ వేసి లోఫ్లేమ్‌లో కలపాలి. ఆ తర్వాత మిక్సీ పట్టిన పేస్ట్ వేయాలి. మీడియం ఫ్లేమ్‌లో నాలుగు నిముషాల పాటు కదుపుతూ కుక్ చేయాలి. అవసరం అనుకుంటే కొద్దిగా నీళ్లు పోయాలి. వేయించుకున్న వెజిటేబుల్స్ ముక్కలు వేయాలి. జీలకర్ర పొడి వేసి కొద్దిగా అవసరం అనుకుంటే కారం, ఉప్పు సరి చూసుకుని తగినంత ఉప్పు వేసుకోవాలి. ధనియాల పొడి వేసిన తర్వాత మూత ఉంచి నాలుగు నిముషాల పాటు కుక్ చేయాలి. చివరగా వేయించిన పనీర్ ముక్కలు వేసి రెండు నిముషాల పాటు ఉడికించాలి. చివరగా గరం మసాలా వేసి కలిపిన తర్వాత పెరుగు వేసి నిముషం పాటు కలిపాక.. కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి. ఈ కర్రీని చపాతీలోకి రుచిగా ఉంటుంది.

## వెజిటెబుల్ కట్‌లెట్

**కావాల్సిన పదార్థాలు:** నూనె- 2 టేబుల్ స్పూన్లు, జీలకర్ర- అర టీస్పూన్, ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), ఉప్పు- తగినంత, తరిగిన అల్లం ముక్కలు- అర టీస్పూన్, పచ్చిమిర్చి-1 (సన్నగా తరగాలి), క్యాబేజీ- 1 కప్పు, క్యారెట్- 1 (తురమాలి), తరిగిన కాలిఫ్లవర్- అరకప్పు, తరిగిన క్యాప్సికమ్ ముక్కలు- పావు కప్పు, పసుపు- చిటికెడు, కారంపొడి-అర టీస్పూన్, ధనియాల పొడి- అర టీస్పూన్, పావు బజ్జీ మసాలా- అరటీస్పూన్, పెప్పర్ పౌడర్- అరటీస్పూన్, పెద్ద బంగాళదుంప- 1, కొత్తిమీర- టేబుల్ స్పూన్, బ్రెడ్ -2 పీస్‌లు,

**తయారీ విధానం:** బంగాళదుంపను ఉడికించి మెత్తగా మ్యాష్ చేసుకుని పెట్టుకోవాలి. ప్యాన్‌లో నూనె వేసి.. కాస్త వేడయ్యాక జీలకర్ర, తరిగిన ఉల్లిపాయలు, తగినంత ఉప్పు వేసి కలపాలి. అల్లం, పచ్చిమిర్చి ముక్కలు వేసి



కలపాలి. నిముషం తర్వాత ఉల్లిపాయ ముక్కల రంగు మారుతుంది. వెంటనే క్యాబేజ్ ముక్కలు, తురిమిన క్యారెట్, క్యాప్సికమ్, కాలిఫ్లవర్ మిశ్రమాన్ని వేయాలి. నిముషం పాటు కలిపాక పసుపు, కారంపొడి, ధనియాల పొడి, పావుబజ్జీ మసాలా, పెప్పర్ పౌడర్ వేసి కలపాలి.

ప్యాన్‌మీద మూత ఉంచి లోఫ్లేమ్‌లో రెండు నిముషాల పాటు కుక్ చేయాలి. ఆ తర్వాత ప్యాన్‌పై మూత తీసి గరిటెతో కలిపాక.. బంగాళదుంప మిశ్రమం వేసి కలపాలి. కూరగాయల మిశ్రమం మెత్తగా అవుతుంది. స్టవ్ ఆఫ్ చేసి ఈ మిశ్రమాన్ని ప్లేట్‌లో వేసుకుని పక్కన ఉంచుకోవాలి.

బ్రెడ్ పీస్‌లను ముక్కలుగా చేసి పొడి పొడిగా మిక్సీ పట్టాలి. ఈ బ్రెడ్ ముక్కల పొడితో పాటు కొత్తిమీరను వెజిటెబుల్ మిశ్రమంలో వేసి కలపాలి. దీన్ని వడల్లా ఒత్తుకోవాలి. చదునైన ప్యాన్‌లో టేబుల్ స్పూన్ నూనె వేసి ప్యాన్ అంతా తిప్పిన తర్వాత ఈ కట్‌లెట్‌ను ఉంచి.. రెండువైపులా కాల్చుకోవాలి. ఈ వెజిటెబుల్ కట్‌లెట్స్‌ను టమోటా కెచప్‌తో తింటే రుచిగా ఉంటాయి. •

# వంటనూనెను తిరిగి వాడచ్చా?

వంటనూనె లేని వంటిల్లు ఉండదు. కానీ వంటనూనెను ఎలా వాడుకోవాలో ఎవరికీ తెలియదు. ఒక సారి వేడి చేసిన నూనెను మళ్లీ వాడచ్చా? దానిని ఎలా భద్రపరచుకోవాలి? అనే విషయాలను తెలుసుకుందాం.

ఎలాంటి నూనెలు వాడుతున్నాం? ఎంత వేడిలో నూనెను కాచాం? నూనెను ఎలా భద్రపరిచాం? అనే విషయాలపై ఆధారపడి ఉంటుంది. కొన్ని నూనెలకు ఎక్కువ స్మోక్ పాయింట్ (ఎక్కువ వేడిని తట్టుకొని నిలబడే శక్తి) ఉంటుంది. ఉదాహరణకు కనోలా, వేరుశనగనూనె, సన్‌ఫ్లవర్ వంటి నూనెలను ఎక్కువ ఉష్ణోగ్రతల వరకు వేడి చేయవచ్చు. ఆలీవ్ ఆయిల్ వంటి నూనెలు వేడిని తట్టుకొని నిలబడలేవు. వీటిని ఎక్కువగా వేడి చేస్తే చెడు వాసన వస్తుంది. అదే విధంగా కొన్ని నూనెలను పదే పదే వేడి చేస్తే- వాటి కణ నిర్మాణంలో మార్పు వచ్చి వాటి ద్వారా ఆరోగ్యానికి చెడు చేసే రసాయనాలు విడుదలవుతాయి. ఇలాంటి వాటిని పదే పదే వాడకూడదు. ఒక సారి వాడిన తర్వాత- నూనెలో పేరుకుపోయిన చిన్న చిన్న కణాలను తొలగించి ఒక గాజు లేదా స్టీలు



డబ్బాలో నిల్వ చేసుకుంటే మంచిది. ఇలా నిల్వ చేసుకున్న నూనెను మళ్లీ వాడినప్పుడు అది నల్లగా అయిపోతే వాడకుండా బయట పారబోయటం మంచిది. •

నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 13 జూలై 2024
cinema@andhrajyothy.com

## మా అల్లుడని డబ్బులిచ్చి ఆదుకున్నాం



**లావణ్య తల్లితండ్రులు**

ప్రస్తుతం టాలీవుడ్‌లో నటుడు రాజ్‌తరుణ్, లావణ్య వ్యవహారం ఓ హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకూ లావణ్య మాత్రమే మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు ఆమె తల్లితండ్రులు కూడా మీడియా ముందుకు వచ్చి ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. చెప్పుకోలేని సంఘటనలు జరిగాయని కన్నీళ్లు పెట్టుకున్నారు. కరోనా సమయంలో రాజ్‌తరుణ్‌కి ఎవరూ సాయం చేయకపోయినా అతన్ని అల్లుడిగా భావించి డబ్బు సాయం చేసి ఆదుకున్నట్లు వారు చెప్పారు. 'మా అమ్మాయికి రాజ్‌తరుణ్ అన్యాయం చేశాడు. అతను ఎక్కడున్నా తీసుకువచ్చి వాళ్లిద్దరినీ కలిపేవరకూ వెనుకంజ వేయం' అని లావణ్య తండ్రి స్పష్టం చేశారు. లావణ్యకు డ్రగ్స్ తీసుకునే అలవాటు లేదనీ, అక్రమ సంబంధాలు ఉన్నాయనడం కట్టుకథ అనీ, ఓ ఆడపిల్ల మీద ఇలా నిందలు వేయడం తగదనీ ఆయన అన్నారు. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయనీ, 'డ్రగ్స్ కేసులో నువ్వు బెయిల్ మీద బయటకు వచ్చావనీ, ఇలాంటి న్యూసెన్స్ చేస్తే బెయిల్ రద్దయి, ఇక జైలు నుంచి తిరిగి రాలేవని రాజ్‌తరుణ్, హీరోయిన్ మాల్వీ బెదిరించారని లావణ్య చెప్పారు. రూ. ఐదు కోట్లు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకుంటామని, కేసు వెనక్కి తీసుకోమని కూడా చెబుతున్నారని ఆమె వెల్లడించారు. 'నేను డ్రగ్స్ తీసుకుని ఉంటే రాజ్‌తరుణ్ కూడా తీసుకున్నట్లే. నేను వాటిని అమ్మితే .. అమ్మించింది అతనే. ఇందులో నిజం ఏవిటో పోలీసులే తేల్చాలి' అన్నారు లావణ్య 'ఈ పోరాటం ఆపను. రాజ్ ఎక్కడ ఉంటే అక్కడికి వెళతాను. 14 ఏళ్ల పరిచయం, పదేళ్ల సహజీవనం ఎలా కాదంటాడో నేనూ చూస్తా' అని స్పష్టం చేశారు లావణ్య.

## విజిలేస్కో...



తమిళ హీరో విజయ్ కథానాయకుడిగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). శుక్రవారం చిత్ర బృందం తొలి పాటను విడుదల చేసింది. 'విజిలేస్కో' అంటూ సాగే ఈ మాస్ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. యువన్ శంకర్ రాజా స్వరాలు సమకూర్చడంతో పాటు నకాష్ అజీజ్‌తో కలసి ఆలపించారు. ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బేనర్ నిర్మిస్తోంది. సినిమాటోగ్రఫీ: సిద్దార్థ నుని.

## ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి



సంతోష్ శోభన్, సోషల్ మీడియాలో పాపులర్ అయిన అలేఖ్య హారిక జంటగా ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఎస్.కె.ఎన్., దర్శకుడు సాయిరాజేశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. సుమన్ పాతూరి దర్శకుడు. హీరో సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఉన్న 'ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి' అనే క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే ఈ చిత్రం మ్యూజిక్ సిట్టింగ్స్ సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ సారథ్యంలో ప్రస్తుతం జరుగుతున్నాయి.

## ఆర్.సి 16లో శివన్న



రామ్‌చరణ్, జాన్వీ కపూర్ జంటగా రూపొందుతున్న ఆర్.సి. 16 చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ శుక్రవారం వచ్చింది. చిత్ర పరిశ్రమలో అందరూ ఆప్యాయంగా 'శివన్న' అని పిలుచుకునే శివ రాజ్‌కుమార్ ఇందులో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా సినిమాలో ఆయన లుక్‌ను విడుదల చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 'ఉప్పెన' చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. సంగీత సంచలనం ఏ.ఆర్.రెహమాన్ ఈ సినిమాకు స్వరాలు అందిస్తున్నారు.

## అక్షయ్‌కుమార్‌కు కరోనా




చిత్ర ప్రముఖుల్ని కరోనా రక్కసి ఇంకా వదిలి పెట్టలేదు. తాజాగా బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ ఈ రక్కసి చేతికి చిక్కారు. ప్రపంచ కుబేరుడు ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ వివాహానికి వెళ్లడం కోసం శుక్రవారం కొవిడ్ టెస్ట్ చేయించుకున్నారు. పాజిటివ్ రావడంతో పెళ్లికి వెళ్లడం మానుకుని ఇంటి గదికి పరిమితం అయ్యారు. తమిళంలో హిట్ అయిన సురారై పోట్రు' చిత్రం ఆధారంగా రూపొందిన 'సర్ఫిరా' చిత్రం శుక్రవారం విడుదల అయింది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఇటీవల చాలా చోట్లకు వెళ్లారు అక్షయ్. అప్పుడే ఆయనకు వైరస్ సోకి ఉంటుందని అంటున్నారు.

### నా ఫ్లాపుల్ని ఎంజాయ్ చేస్తున్నారు

'సర్ఫిరా' ప్రమోషన్స్‌లో భాగంగా అక్షయ్ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'నా ఫ్లాపుల్ని చూసి కొంతమంది ఎంజాయ్ చేస్తున్నారు. పరిశ్రమలో ఇలాంటి రాజకీయాలు బాధ కలిగిస్తున్నాయి' అని ఆవేదనతో చెప్పారు. ఏడాదికి నాలుగు సినిమాలు చేస్తూ, ఓవర్ ఎక్స్‌పోజ్ అవుతున్నాడంటూ వచ్చిన కామెంట్స్ ను ఆయన కొట్టి పడేశారు. 'నేను రెండేళ్లకు ఒక్క సినిమానే చేస్తా. అది హిట్ అవుతుందని ఎవరైనా గ్యారంటీ ఇవ్వగలరా?' అని అక్షయ్ ప్రశ్నించారు. 'వర్క్ చేస్తూనే ఉండాలి. నీ దగ్గరకు వచ్చిన అవకాశాల్ని పోగొట్టుకోకు. ఎవరి మాటా వినకు. నీ నటన ప్రేక్షకులకు నచ్చితే వాళ్లే నిన్ను నెత్తిన పెట్టుకుంటారు' అని అమితాబ్ చెప్పిన మాట పాటిస్తున్నా' అని చెప్పారు అక్షయ్.

## అప్పుడు సోలో.. ఇప్పుడు యుగళం



లవ్, రొమాంటిక్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్.. ఈ జానర్లలో రూపుదిద్దుకునే చిత్రాలను ప్రేక్షకులకు దగ్గర చేసేవి వాటిల్లో పాటలే. సంగీతం ఇంత ముఖ్య పాత్ర పోషిస్తుంది కనుక పాటల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంటారు. ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నటిస్తున్న 'డార్లింగ్' చిత్రం నుంచి ఇప్పటివరకూ రెండు పాటలు విడుదలయ్యాయి. ఇవి ప్రియదర్శి, నభా నటేశ్‌ల సోలో సాంగ్స్. ఇప్పుడు వీరిద్దరూ కలిపి పాడుకున్న లవ్ సాంగ్ 'సున్ చెలియా' ను శుక్రవారం విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. వివేక్ సాగర్ సంగీత దర్శకుడు. ఈ నెల 19న విడుదల కానున్న ఈ చిత్రాన్ని అశ్విన్ రామ్ దర్శకత్వంలో కెని రంజన్‌రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/69O24m1లో చదవండి.

## చిన్న సినిమా... వసూళ్లలో మిన్న

ఈ మధ్యకాలంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన చాలా చిత్రాలు బాక్సాఫీసు దగ్గర వసూళ్ల సునామీ సృష్టించడం చూసిందే. రూ. 300 కోట్లు, రూ. 500 కోట్ల వసూళ్లు అనే మాట చాలా సామాన్యంగా వినిపిస్తోంది. కానీ అవన్నీ భారీ బడ్జెట్‌తో తెరకెక్కడం వల్లే వసూళ్లు కూడా ఖర్చుకు తగిన స్థాయిలో వచ్చాయి. కానీ పరిమిత బడ్జెట్‌తో, అది కూడా ఎలాంటి స్టార్స్ లేకుండా వచ్చిన కొన్ని బాలీవుడ్ సినిమాలు రూ. వంద కోట్ల వసూళ్లను సాధిస్తున్నాయి. అగ్రహీరోలు, దిగ్గజ దర్శకులు లేకున్నా ఆకట్టుకునే కథలతో ప్రేక్షకులను అలరిస్తూ, కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

ఓ సినిమా కమర్షియల్‌గా హిట్టా, ఫట్టా అనేది చెప్పడానికి రూ. 100 కోట్ల వసూళ్లు అనేది ఇప్పుడు ఓ కొలబద్దగా మారింది. అయితే అగ్రతారలకు సైతం అన్నిసార్లు ఈ ఫీట్ సాధ్యం కావడం లేదు. భారీ హైప్‌తో వచ్చిన పాపులర్ హీరోల చిత్రాలు సైతం బాక్సాఫీసు దగ్గర రూ. వంద కోట్ల వసూళ్లను దాటలేక చతికిలపడుతున్నాయి. దీనికి భిన్నంగా ఎలాంటి స్టార్స్ లేకుండా, కంటెంట్‌ను మాత్రమే నమ్ముకొని వచ్చిన కొన్ని చిన్న సినిమాలు బాలీవుడ్‌లో అలవోకగా వందకోట్ల మార్క్‌ను అధిగమిస్తున్నాయి.



### కోట్లు కొల్లగొట్టిన పిల్లదెయ్యం



బాలీవుడ్ తాజా సంచలనం 'ముంజ్య' చిత్రం రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. హారర్ కామెడీ జానర్ సత్తా ఏంటో మరోసారి చూపింది. ఇందులో పేరున్న బాలీవుడ్ తారాగణం లేదు. శార్వరీ వాఘ్, అభయ్ వర్మ లాంటి చిన్న నటీనటులే. దర్శకుడు ఆదిత్య సర్పోదర్‌కు గతంలో భారీ హిట్లు ఇచ్చిన వ్యక్తి కాదు. అయినా 'ముంజ్య' మాత్రం విడుదలైన రెండు వారాల్లోనే రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. రూ. 30 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రాల్లో ఐదో స్థానంలో నిలిచింది.

### అగ్రతారలు లేకున్నా కాసుల వర్షం

సీనియర్ నటీమణులు కరీనాకపూర్, టబు... యువ కథానాయిక కృతీసనన్ ప్రధాన తారాగణంగా రూపొందిన హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ 'క్రూ' సైతం అంచనాలు మించి వసూళ్లను అందుకొంది. ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడడంతో దాదాపు 2500 స్క్రీన్లలో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. ఈ కామెడీ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. స్టార్ హీరోల రేంజ్‌లో ఈ చిత్రం వసూళ్లను సాధించడం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

### కంటెంట్‌తోనే కలెక్షన్లు

కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో రూపొందిన హిందీ చిత్రం 'ఆర్టికల్ 370'. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైంది. రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం రూ. 110 కోట్ల వసూళ్లను సాధించింది. కథానాయికగా ఇప్పటివరకూ పెద్ద విజయాలు దక్కని యామీ గౌతమ్ ఈ సినిమాలో లీడ్‌రోల్ పోషించగా, ప్రియమణి కీలకపాత్రలో నటించారు. వీరు తప్ప పేరున్న నటీనటులెవరూ ఈ చిత్రంలో లేరు. ఆర్టికల్ 370ని తొలగించే క్రమంలో ప్రభుత్వానికి ఎదురైన సవాళ్లు, లోయలో శాంతి భద్రతలను కాపాడేందుకు మిలిటరీ చేసిన ఆపరేషన్స్‌ను దర్శకుడు ఆదిత్య సుహాస్ ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను మెప్పించింది. ఫలితమే బాక్సాఫీసు దగ్గర మంచి మార్కులు కొట్టేసింది.


### సక్సెస్ బాటలో చిన్న సినిమా

కరోనా ప్రభావానికి బలైన చిత్రపరిశ్రమల్లో బాలీవుడ్‌ది అగ్రస్థానం. అప్పటివరకూ వరుస హిట్లతో కళకళలాడిన పరిశ్రమ కాస్తా ప్రేక్షకులు థియేటర్లకు రాక వెలవెలబోయింది. వరుస అపజయాలతో అగ్రహీరోలు, నిర్మాతలకు ఏం పాలుపోని పరిస్థితి. ఇంకా ఇప్పటికీ బాలీవుడ్ మునుపటి జోరు చూపించలేకపోతోంది. అగ్రహీరోలతో రూ. వందల కోట్లు ఖర్చుపెట్టి సినిమాలు తీసిన కొన్ని పెద్ద నిర్మాణ సంస్థలు దివాళా అంచుకుచేరాయి. ఈ పరిస్థితి ఇలా కొనసాగుతుండగా కొత్త తరహా కంటెంట్‌తో వచ్చిన కొన్ని చిన్న చిత్రాలు బాక్సాఫీసును దునేస్తున్నాయి.





అయితే కొంతమంది విమర్శకులు ప్రాపగాండా చిత్రాలుగా పేర్కొన్న 'ది కేరళ స్టోరీ', 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రాలు ఆశ్చర్యపరిచే వసూళ్లను సాధించాయి. మత మార్పిడికి గురైన అమాయక యువతి చివరకు సరిహద్దులు దాటి ఉగ్రవాద సంస్థ ఐసిస్ చెరలో బంధీగా మారిన వైనాన్ని ఇందులో చూపించారు. అదాశర్మ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో పేరున్న బాలీవుడ్ నటీనటులు లేరు. కథ కూడా పూర్తిగా కేరళ నేపథ్యంలో సాగుతుంది. దక్షిణాదిన ఈ సినిమాకు కమర్షియల్‌గా లాభించకపోయినా ఈ సినిమా హిందీ వెర్షన్‌ను ప్రేక్షకలోకం అమితంగా ఆదరించింది. అందుకే రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ఏకంగా రూ. 250 కోట్ల వసూళ్లతో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 2022లో వచ్చిన 'కశ్మీర్ ఫైల్స్' చిత్రం సైతం రికార్డులను తిరగరాసిందనే చెప్పాలి. ఒక డాక్యుమెంటరీలా సాగే కథనంతో తెరకెక్కిన ఈ సినిమా ఊహించని వసూళ్లను సాధించింది. తొలి రోజు 600 స్క్రీన్లలో విడుదల చేస్తే, వారం తిరగకుండానే నాలుగు వేల స్క్రీన్లకు పెంచాల్సి వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో రూ. 20 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రం కాస్తా రూ. 300 కోట్ల వసూళ్ల మార్క్‌ను అధిగమించింది. బాలీవుడ్‌లో విక్కీ కౌశల్‌కు ఒక్కసారిగా స్టార్‌డమ్ సంపాదించిపెట్టిన చిత్రం 'యురి' కేవలం రూ. 25 కోట్ల వ్యయంతో తెరకెక్కింది. ఈ చిత్రం హిందీ బెల్ట్‌లోనే రూ. 250 కోట్ల వసూళ్లను రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 350 కోట్ల వసూళ్లను రాబట్టింది. పలువురు అగ్రహీరోల చిత్రాలను పక్కకునెట్టి 2019లో అత్యధిక వసూళ్లు సాధించిన మూడో చిత్రంగా నిలిచింది.



అంగరంగ వైభవంగా

## అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ వివాహం

ముంబై, జూలై 12 : రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఆసియాలోనే ధనవంతుడు ముకేశ్ అంబానీ ఇంట పెళ్లిసందడి అత్యంత వైభవంగా జరుగుతోంది. ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ, ఫార్మారంగ దిగ్గజం వీరేన్ మర్చంట్ కుమార్తె రాధిక మర్చంట్ హిందూ సంప్రదాయ పద్ధతిలో శుక్రవారం దంపతులు అయ్యారు. ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ వేడుక అత్యంత ఘనంగా జరిగింది. యూకే మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, శాంసంగ్ చైర్మన్ జేలీ తోపాటు దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్, షారుఖ్‌ఖాన్, సల్మాన్ ఖాన్, రణ్‌బీర్ కపూర్, రణ్‌వీర్ సింగ్, దక్షిణాది సినీ తారలు రజనీకాంత్, రామ్‌చరణ్, మహేశ్ బాబు తదితరులు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోనీ, హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా తదితర క్రికెటర్లు, హాలీవుడ్ నటుడు, డబ్ల్యూడబ్ల్యూఈ స్టార్ జాన్ సీనా, రియాల్టీ టీవీ స్టార్ కిమ్ కర్దిషన్ వంటి ప్రముఖులు కూడా ఈ వేడుకలో సందడి చేశారు.

## 317 జీవో కింద 52,235 దరఖాస్తులు

స్ర్కూట్నీ చేసి.. 16వరకు నివేదిక ఇవ్వండి

శాఖల ముఖ్య కార్యదర్శులకు ప్రభుత్వ నిర్దేశం

హైదరాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సాధారణ బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేసిన నేపథ్యంలో 317 జీవో కింద వచ్చిన దరఖాస్తులను స్ర్కూట్నీ(పరిశీలన) చేయాలని అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్ర్కూట్నీ అనంతరం ఆ నివేదికను జూలై 16 వరకు తమకు అందించాలని పేర్కొంది. కాగా 317 జీవో కింద స్పౌజ్(భాగస్వామి), మ్యూచువల్, మెడికల్, లోకల్ ఇతర విభాగాల పరిధిలో మొత్తం 52,235 దరఖాస్తులు వచ్చాయి. శాఖల కార్యదర్శులు వాటిని పరిశీలించి 16వ తేదీ వరకు నివేదిక అందించనున్నారు.


# గెలవాలంటే 'గ్రేటరే'

(మొదటిపేజీ తరువాయి)

లెక్కల ప్రకారం అంతకుమించి పెరిగే అవకాశం ఉందని అంచనా. వాటిలోనూ అత్యధికం జీహెచ్ఎంసీ పరిధిలోనే పెరుగుతాయి. జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరగడం.. రాష్ట్ర జనాభాలో మూడో వంతుకు పైగా ఈ ప్రాంతంలోనే ఉండడం ఇందుకు కారణం. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ప్రతి పదేళ్లకొకసారి జనగణన జరగాలి. జనాభా నిష్పత్తి ఆధారంగా లోక్‌సభ, విధానసభ నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించాలి. ఈ క్రమంలోనే.. మొదటి లోక్‌సభ ఎన్నికలు జరిగే సమయానికి మన పార్లమెంటులో 489గా ఉన్న సభ్యుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. 1971లో జరిపిన జనాభా లెక్కల ఆధారంగా 1973లో పార్లమెంటు సభ్యుల సంఖ్యను 545కు పెంచారు. అయితే.. జనసంఖ్య ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజిస్తే.. కుటుంబ నియంత్రణ విధానాన్ని సమర్థంగా పాటించి జనాభాను తగ్గించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో 42వ రాజ్యాంగ సవరణ చట్టం (1976) ద్వారా లోక్‌సభ సీట్ల సంఖ్యలో 2001 దాకా ఏ మార్పూ లేకుండా ఉండేలా స్తంభింపజేశారు. దీంతో అప్పటిదాకా లోక్‌సభ సీట్ల సంఖ్య అలాగే ఉండిపోయింది. 2002లో నియోజకవర్గాల పునర్విభజన జరపాలని నాటి ఎన్డీయే సర్కారు భావించింది. కానీ.. 2001లో జనాభా లెక్కల తర్వాత కూడా అదే పరిస్థితి కనిపించడంతో.. దక్షిణ భారతదేశ రాష్ట్రాలు నష్టపోకుండా ఉండేందుకుగాను లోక్‌సభ సీట్ల సంఖ్య 2026 దాకా మారకుండా ఉండేలా మరోసారి రాజ్యాంగ సవరణ చేశారు. అంటే 50 ఏళ్లుగా అదే పరిస్థితి. 2021లో జరగాల్సిన జనగణన కొవిడ్ కారణంగా జరగకపోవడంతో.. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత జనగణన జరుపుతామని గత సెప్టెంబరులో కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటించారు. ఈ నేపథ్యంలో.. 2026లోపే జనాభా లెక్కల సేకరణ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన పూర్తవుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవేళ ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా జరపకపోయినా.. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.

### అధికారానికి సోపానం..

ఇప్పుడు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అసెంబ్లీ సీట్ల సంఖ్య (24).. నియోజకవర్గాల పునర్విభజనతో 50కి చేరే అవకాశాలున్నాయి. అంటే పునర్విభజన తరువాత రాష్ట్రంలో మొత్తం పెరిగే స్థానాల్లో (153).. మూడోవంతు స్థానాలు ఈ పరిధిలోనే ఉంటాయన్న మాట. ఇక్కడ అత్యధిక స్థానాలు దక్కించుకున్న పార్టీకే రాష్ట్రంలో అధికారం చేపట్టే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఈ నేపథ్యంలోనే.. పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యే సమయానికి జీహెచ్ఎంసీ, సహా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలపై కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు సంబంధించి బలమైన ముద్రను వేయాలని



సీఎం రేవంత్ నిర్ణయించుకున్నారని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అందుకే ఆయన ఈ ప్రాంతంలో ఒకపక్క రాజకీయ వ్యూహాలు అమలు చేస్తూనే, మరోపక్క అభివృద్ధి పథకాలకూ పెద్దపీట వేస్తున్నారని గుర్తుచేస్తున్నారు. రాష్ట్ర సమగ్ర సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతూనే.. జీహెచ్ఎంసీ పరిధిలో పట్టు పెంచుకునేందుకు వ్యూహరచన చేస్తున్నట్టు చెబుతున్నారు. రాజకీయంగా ఈ ప్రాంతంలో బలంగా ఉన్న ఇతర పార్టీల నేతలను కాంగ్రెస్ వైపు ఆకర్షించేందుకు రేవంత్ చేస్తున్న ప్రయత్నం అందులో భాగమేనన్నది రాజకీయ నిపుణుల మాట. అదీ చిన్నాచితకా లీడర్లు కాకుండా.. ప్రజల్లో పట్టున్నవారిపై, ఎమ్మెల్యేలుగా పలుమార్లు గెలిచిన వారిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్టు సమాచారం. ఉదాహరణకు.. తాజాగా కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ 2009 నుంచి 2023 వరకూ వరుసగా గెలిచారు. శనివారంనాడు (జూలై 13న) కాంగ్రెస్ కండువా కప్పుకోబోతున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ.. హ్యాట్రిక్ ఎమ్మెల్యే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పరిధిలో కాంగ్రెస్‌కు తక్కువ సీట్లు వచ్చిన నేపథ్యంలో.. బలమైన నాయకులను తీసుకుని పార్టీని బలోపేతం చేయాలని సీఎం భావిస్తున్నారు. పెరగనున్న అసెంబ్లీ స్థానాలకు అనుగుణంగా అవసరమైన బలమైన నాయకత్వాన్ని పార్టీలో ఉండేలా చేయాలనుకుంటున్నారు.

అదేసమయంలో.. హైదరాబాద్ అభివృద్ధిలో బలమైన ముద్రవేసిన నాయకుల జాబితాలో తానూ చేరాలనే కృతనిశ్చయానికి వచ్చారు. మూసీ ప్రక్షాళన లాంటి భారీ ప్రాజెక్టును రేవంత్ చేపట్టిన కారణం అదేనని గుర్తుచేస్తున్నారు. మరోవైపు నగరంలో మెట్రో లైన్ పొడిగింపు ప్రాజెక్టుకు సంబంధించిన పనులను శరవేగంగా పట్టాలెక్కిస్తున్నారు. ఈ మెట్రో లైన్‌ను పాతబస్తీ సహా, శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయానికి అనుసంధానం చేయడంతో పాటు, ఎల్‌బీ నగర్ నుంచి నాగోలు వరకు కూడా లింక్ చేస్తున్నారు. ఎల్‌బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు కూడా మెట్రోరూట్‌ను పొడిగిస్తున్నారు. ఇందుకు సంబంధించి మెట్రో సంస్థ పలు సర్వేలను చేస్తోంది. అలాగే.. జీహెచ్ఎంసీ పరిధిని ఔటర్ రింగ్ రోడ్ వరకూ పెంచడం, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయడం, ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం, మెట్రో లైన్‌ను వివిధ మార్గాల్లో పొడిగించడం, న్యూయార్క్‌లోని ప్రపంచ ప్రసిద్ధ వాణిజ్య కూడలి అయిన టైమ్స్ స్క్వేర్ తరహాలోనే.. రాజధానిలోని రాయదుర్గం ప్రాంతంలో 'టీ-స్క్వేర్' పేరుతో ఐకానిక్ ప్లాజాను నిర్మించడం, గట్టిగా వాన కురిస్తే నదిలా మారి ట్రాఫిక్‌తో స్తంభించిపోయే హైదరాబాద్ మహానగరానికి ఆ దుస్థితి తప్పించేలా విపత్తు నిర్వహణకు, కబ్జాదారుల నుంచి ప్రభుత్వభూములు, చెరువులు, పార్కులను రక్షించడానికి.. హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్)ను ఏర్పాటు చేయడం, నగరం చుట్టూ ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేయడం, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, హైదరాబాద్‌కు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది ఉపాధి కోసం వస్తున్న నేపథ్యంలో.. టాటా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని ఐటీఐలను ఆధునిక నైపుణ్య కేంద్రాలుగా తీర్చిదిద్దడం వంటి అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఓఆర్ఆర్ అవతలివైపు కూడా అనేక భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా ఓ ప్రణాళిక రూపొందించారు. ఇలా వచ్చే నాలుగున్నరేళ్లలో అటు రాజకీయ, ఇటు అభివృద్ధి ప్రణాళికలతో.. ద్విముఖ వ్యూహంతో ముందుకెళ్లాలని సీఎం భావిస్తున్నారు.

### ఈ ఏడాది మొదలుపెట్టి..

ఈ ఏడాది చివర్లో.. పునర్విభజనకు ప్రామాణికమైన జనగణనను ప్రారంభించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోందని.. రానున్న పార్లమెంటు సమావేశాల్లో దీనిపై ఒక నిర్ణయాన్ని వెల్లడించే అవకాశం ఉంది. జనగణన మొదలైతే సాంకేతిక పరిజ్ఞానం సాయంతో 6-7 నెలల్లోనే జనాభా వివరాలు వెల్లడవుతాయి. 2026 ఆగస్టు-సెప్టెంబర్ నాటికి లెక్కలు పూర్తిగా తేలుతాయని అంచనా. అనంతరం.. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధించి ఆ ప్రక్రియపై ముందుకెళ్లే అవకాశం ఉంది. ఆందులో భాగంగానే నియోజకవర్గాల రిజర్వేషన్లను ఖరారు చేసే అవకాశాలున్నాయి. దీంతో ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్ల రిజర్వేషన్లలోనూ మార్పుచేర్పులు చోటుచేసుకోనున్నాయి.

## నేడు, రేపు భారీ వర్షాలు..

హైదరాబాద్/గద్వాల/మహదేవపూర్ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుక్రవారం హెచ్చరించింది. శని, ఆదివారాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. శుక్రవారం రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు పడ్డాయి. రాత్రి హైదరాబాద్‌లోని ఉప్పల్, మల్కాజ్‌గిరి, కాప్రా, అల్వాల్, నిజాంపేట, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో రహదారులు జలమయమయ్యాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా ఖమ్మం జిల్లా వైరాలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

## గత సర్కారు వల్లే ఉద్యోగులకు చిక్కులు

» ఆర్ అండ్ బీ ఉద్యోగులతో మంత్రి కోమటిరెడ్డి

గత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై దృష్టిపెట్టకపోవడంతో పాటు ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని.. ఆ కారణంగానే పదోన్నతులు, బదిలీల వ్యవహారం శాఖలో కొలిక్కి రాలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రోడ్లు, భవనాల శాఖకు సంబంధించిన ఉద్యోగ సంఘాలతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడారు. శాఖలో చేపట్టాల్సిన పని అయినా, సమస్యల పరిష్కారం కోసమైనా కలిసి పనిచేద్దామని అన్నారు. శాఖలోని సర్వీస్ రూల్స్, సీనియారిటీ జాబితా, పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన సమస్యలపై ఉద్యోగులంతా ఏకాభిప్రాయానికి వస్తే త్వరితగతిన పరిష్కారమవుతాయని సూచించారు. ఇక నుంచి కలిసికట్టుగా కష్టపడి.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనాలు, కలెక్టరేట్లు, ఎమ్మెల్యేలు, మంత్రుల నివాస సముదాయాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేద్దామని అన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

చందంపేట, జూలై 12: అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. నల్లగొండ జిల్లా చందంపేట మండలం తెల్‌దేవరపల్లి గ్రామానికి చెందిన సభావత్ రమేశ్(27) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటను కాపాడుకునేందుకు ఈ ఏడాది ఆరు బోర్లు వేసినా ఫలితం దక్కలేదు. సుమారు రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు ఎక్కువై కొద్దికాలంగా మనస్తాపంగా ఉన్న రమేశ్ ఈ నెల 10న తన పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు అతణ్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా... చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

## 6 నెలల్లో 151 డ్రగ్స్ కేసులు నమోదు: సర్కారు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :హైదరాబాద్‌లో డ్రగ్స్ కట్టడికి కఠిన చర్యలు చేపట్టామని ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 151 కేసులు నమోదు అయ్యాయని, గత సంవత్సరం మొదటి ఆరు నెలల్లో కేవలం 103 కేసులు నమోదైనట్లు ప్రభుత్వం పేర్కొంది. నగరంలో శాంతి భద్రతలు, డ్రగ్స్ కేసులు, హత్యలు, తీవ్ర నేరాలు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాల్ని ప్రభుత్వం వెల్లడించింది. గత సంవత్సరం మొదటి ఆరు నెలల్లో 47 హత్య కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 5 శాతం తగ్గుదలతో 45 కేసులు నమోదయ్యాయి. ఇదే కాలానికి సంబంధించి గత సంవత్సరం హత్యాయత్నం కేసులు 155 నమోదు కాగా ఈసారి 145కు పరిమితమై 8 శాతం తగ్గుదల నమోదైనట్లు ప్రభుత్వం వివరించింది. తీవ్రత ఎక్కువగా ఉన్న కేసుల్లో 27 శాతం తగ్గుదల ఉంది.



# 'భరోసా'పై దుష్ప్రచారాలను నమ్మొద్దు!

» రైతు భరోసా అమలు పరంగా సీలింగ్‌పై, ఐటీ పరిమితి మీద నిర్ణయం తీసుకోలేదు
» మంత్రులు తుమ్మల, పొంగులేటి



సమావేశానికి హాజరైన మంత్రులు

మహబూబ్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాపై విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని, ఇప్పటి వరకు పథకం అమలు పరంగా సీలింగ్‌పై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రాష్ట్రంలో ఉన్న మెజారిటీ చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి సాయం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా రైతులతో మాట్లాడి, వారి అభిప్రాయాలు సేకరిస్తున్నామని చెప్పారు. వనపర్తి జిల్లాకేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం ఉమ్మడి పాలమూరు జిల్లా రైతు భరోసా వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. గతంలో అమలు చేసిన రైతు బంధు పథకంలో ఎక్కువగా కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, వివిధ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములకు పెట్టుబడి సాయం ఇచ్చారని వెల్లడించారు. ఈసారి ఆ తప్పు జరగకుండా.. ఎక్కువ మంది రైతులకు మేలు చేయడంతో పాటు, అనర్హులను ఏరివేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. పంటల బీమా పథకంపైనా రేవంత్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారని, ఆకాల వర్షాలు కురిసి పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తామని అన్నారు. మద్దతు ధర ఇచ్చి పంటలను కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. రైతులకు ఇచ్చిన ప్రతిమాటా నెరవేర్చడమే తమ లక్ష్యమని తెలిపారు. రైతుభరోసా పథకం అమలులో ఆదాయ పన్ను పరిమితి అని, సీలింగ్ అని బీఆర్ఎస్ నేతలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, కానీ అలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. టాక్స్ పేయర్స్, టాక్స్ రిటర్న్స్ దాఖలు చేసేవారు వేర్వేరని తెలిపారు. రైతులకు కచ్చితంగా మినహాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పదెకరాల కంటే తక్కువ ఉన్న రైతులు 90 శాతం పైగా ఉన్నారని, వారందరికీ రైతు భరోసా కల్పిస్తామని చెప్పారు. రైతుల నుంచి కొందరు మాట్లాడుతూ పదెకరాల సీలింగ్ పెట్టాలని, వ్యక్తికి పదెకరాలు కాకుండా కుటుంబానికి పదెకరాలు సీలింగ్ నిర్ణయించాలని తెలిపారు. ప్రతి పంటకాలంలో సాగుచేసే భూములను మాత్రమే ఏఈవోల ద్వారా గుర్తించి.. ఆ రైతులకు మాత్రమే భరోసా కల్పించాలన్నారు. రైతు రుణమాఫీకి రేషన్‌కార్డు కచ్చితాన్ని తొలగించాలని కోరారు. కౌలు రైతులకు సంబంధించి అగ్రిమెంట్లు చేసుకోవాలంటే పట్టాదారులు కచ్చితంగా ఒప్పుకోరని, దానివల్ల భూమిలో హక్కు అడుగుతారని తెలిపారు. దీనిపై ఎంపీ మల్లు రవి స్పందిస్తూ.. అసెంబ్లీలో కౌలు రైతులు కేవలం సాగు చేసుకోవడానికి మాత్రమే, వారికి భూమిలో హక్కు లభించదనే విషయంపై చట్టం చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

## ముగిసిన కురియన్ కమిటీ విచారణ

» 21న ఏఐసీసీకి కమిటీ నివేదిక

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఆశించిన సీట్లు రాకపోవడంతో నిజనిర్ధారణ కోసం ఏఐసీసీ నియమించిన కురియన్ కమిటీ.. తన విచారణను ముగించింది. ఏఐసీసీ నేతలు కురియన్, రకిబుల్ హుస్సేన్, పర్గత్ సింగ్‌తో కూడిన త్రిసభ్య కమిటీ.. గురు, శుక్రవారాల్లో గాంధీ భవన్ వేదికగా 16 మంది లోక్‌సభ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, డీసీసీ అధ్యక్షుల నుంచి అభిప్రాయాలను స్వీకరించింది. ఈ అభిప్రాయాలన్నింటినీ క్రోడీకరించి ఈ నెల 21న ఏఐసీసీకి ఓ నివేదికను అందజేయనున్నట్లు కమిటీ సభ్యుడు రకిబుల్ హుస్సేన్ మీడియాకు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌కు వచ్చిన కమిటీ.. ఆదివారం వరకూ రాష్ట్రంలో పర్యటించాల్సి ఉంది. అయితే గురువారం కురియన్ కమిటీ ముందు హాజరైన నేతలందరూ దాదాపుగా ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ కావడం, ఉత్తర తెలంగాణలోని కొన్ని చోట్ల హిందుత్వ ప్రభావం చూపడమే కారణమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నుంచి వచ్చి పోటీ చేసిన నేతలపై స్థానికంగా కాంగ్రెస్ కార్యకర్తలు కొంత మేరకు కోపంగా ఉండడమూ ప్రభావం చూపిందని అభిప్రాయపడ్డారు. దాదాపు అందరి అభిప్రాయం ఒకే విధంగా ఉండడంతో తన విచారణను కమిటీ శుక్రవారమే ముగించింది. సమావేశంలో స్వేచ్ఛగా అభిప్రాయం చెప్పలేకపోయిన వారు... ఫోన్ ద్వారా గానీ, రాతపూర్వకంగా కానీ కమిటీకి అభిప్రాయం చెప్పవచ్చని నేతలకు సూచించారు. ఇదిలా ఉండగా.. కురియన్ కమిటీ సభ్యులు గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆశించిన మేరకు సీట్లు రాకపోవడంపై అధిష్ఠానానికి చెప్పిన అంశాలనే రేవంత్ మరొకసారి కురియన్ కమిటీకి వివరించారు. ఇదిలా ఉండగా, కురియన్‌కు సమీప బంధువు ఒకరు మరణించడంతో శుక్రవారం ఉదయం ఆయన కేరళ వెళ్లారు. దీంతో శుక్రవారం రకిబుల్ హుస్సేన్, పర్గత్ సింగ్ మాత్రమే పలువురు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల అభిప్రాయాలను సేకరించారు.

## సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా అలేఖ్య బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్/రవీంద్రభారతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా ప్రముఖ కూచిపూడి నర్తకి అలేఖ్య పుంజాల బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం రవీంద్రభారతి ప్రాంగణంలోని సంగీత నాటక అకాడమీ కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అలేఖ్య పుంజాల బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా పొదెం వీరయ్య హైదరాబాద్ కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నాగరిగారి ప్రీతమ్ బాధ్యతలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఏజెన్సీతో పక్కా సమాచారం!

(మొదటి పేజీ తరువాయి)

అందించే బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించాలని ఆలోచిస్తోంది. అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తే పూర్తిస్థాయిలో వివరాలు అందవని.. బహిరంగ మార్కెట్‌లో ఉన్న రేట్లు, స్థిరాస్తుల లావాదేవీలపై కచ్చితమైన సమాచారం సేకరించలేరని భావిస్తున్నట్లు సమాచారం. ప్రైవేటు ఏజెన్సీ అయితే భూ యజమానులు, రియల్టర్లు, మధ్యవర్తులు వంటి వారితో మాట్లాడి పూర్తిస్థాయిలో సమాచారాన్ని రాబడుతుందని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఏజెన్సీకి బాధ్యతలు ఎలా అప్పగించాలన్న దానిపై త్వరలోనే విధివిధానాలు ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఏజెన్సీ అయితే మార్కెట్ ధరలు ఎక్కడ ఎక్కువగా ఉన్నాయి? రిజిస్ట్రేషన్ విలువల మధ్య ఎంత వ్యత్యాసం ఉంది? ఎక్కడ లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్నాయి? భవిష్యత్తులో డిమాండ్ ఉండే ప్రాంతాలేవి? అక్కడ మార్కెట్ రేట్లు ఎలా ఉండబోతాయి? అనే వివరాలను సమగ్రంగా సేకరిస్తుందని భావిస్తోంది. ఇక రిజిస్ట్రేషన్ విలువల కంటే మార్కెట్ రేటు తక్కువగా ఉండే ప్రాంతాలను, అందుకు గల కారణాలను గుర్తించి.. అలాంటి చోట్ల రిజిస్ట్రేషన్ విలువలను తగ్గించేందుకూ నివేదిక ఉపయోగపడుతుందని అంచనా వేస్తోంది. మొత్తంమీద ఏజెన్సీ నివేదిక అందిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. సవరించిన విలువలను ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెబ్‌సైట్‌లో ఉంచి, అభ్యంతరాలు తెలిపేందుకు గడువు విధిస్తుంది. వచ్చిన అభ్యంతరాలను



పరిశీలించి, పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని రిజిస్ట్రేషన్ విలువలను ఖరారు చేస్తుంది.

### విలువల సవరణపై జీవో ఇచ్చినా..

స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువలను సవరించేందుకు జూన్ 7న అప్పటి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ నవీన్‌మిత్తల్ జీవో నంబరు 211 జారీ చేశారు. విలువల సవరణకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను జూన్ 14న జారీ చేశారు. సవరణ ప్రతిపాదనలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విలువల నిర్ధారణ కమిటీలను కూడా నియమించారు. ఈ ప్రక్రియ ప్రారంభం, ముగింపునకు సంబంధించిన తేదీలను కూడా ప్రకటించారు. అంతలోనే ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీగా జ్యోతి బుద్ధప్రకాశ్‌ను నియమించింది. ఆ క్రమంలో మార్గదర్శకాల అమలులో జాప్యం జరిగింది. నిర్దేశిత తేదీల్లో రిజిస్ట్రేషన్ సవరణ జాబితాను ప్రకటించలేదు. తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. 50-60 శాతానికి మించి రిజిస్ట్రేషన్ విలువలు పెంచరాదని సూచించారు.

## కేసీఆర్‌ను జైలుకు పంపడమే లక్ష్యం: రాజగోపాల్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌ను గద్దె దించాలన్న తన లక్ష్యం నెరవేరిందని, తన మరో లక్ష్యం కేసీఆర్‌ను జైలుకు పంపడమేనని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ సమాధి అయిందని, ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ వైపునకు చూస్తున్నారని చెప్పారు. శుక్రవారం గాంధీభవన్‌లో కురియన్ కమిటీని కలిసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. 'బీఆర్ఎస్‌లో ఎవరూ ఉండబోరు. హరీశ్‌రావు సైతం బీజేపీలోకి వెళ్తారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి జైలుకెళ్లడం ఖాయం. జైలుకెళ్లే వారిని మా పార్టీలో చేర్చుకోం' అని అన్నారు. రాష్ట్రంలో 43 శాతం మంది జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదని, ఈ రెండు జిల్లాల నుంచి ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పార్టీలో సీనియర్‌గా తనకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పెద్దలను కోరానని, తనకు కాకున్నా.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎవరికి ఇచ్చినా ఫర్వాలేదని చెప్పారు.

## నిమ్స్‌కు బక్క జడ్సన్

పది రోజులుగా నిరాహార దీక్షతో లేవలేని స్థితికి

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తన నివాసంలో నిరాహార దీక్ష చేస్తోన్న కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్‌ను శుక్రవారం నిమ్స్‌కు తరలించారు. పది రోజులుగా దీక్ష చేస్తోన్న ఆయన తీవ్రంగా నీరసించారు. జడ్సన్‌ను పరామర్శించేందుకు శుక్రవారం వెళ్లిన బీఆర్ఎస్ నాయకురాలు రజనీసాయిచంద్ లేవలేని స్థితిలో ఉన్న ఆయన్ను చూసి వెంటనే అంబులెన్స్‌లో నిమ్స్‌కు తరలించారు. జడ్సన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని నిమ్స్ వైద్యులు తెలిపారు.

# తప్పుడు పత్రాలతో ఐఏఎస్?

» పూజా ఖేద్కర్‌పై తీవ్ర ఆరోపణలు..

» రుజువైతే సర్వీస్ నుంచి అవుట్



న్యూఢిల్లీ, జూలై 12: ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ వరుస వివాదాల్లో కూరుకుపోతున్నారు. అఖిల భారత సర్వీసుకు ఎంపిక య్యేందుకు దివ్యాంగ, ఓబీసీ కోటాను ఆమె దుర్వినియోగం చేశారని తాజాగా ఆరోపణలు వచ్చాయి. ఆమె తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్టు ఆరోపణలు రావడంతో విచారణ చేసేందుకు కేంద్రం ఓ కమిటీని నియమించింది. ప్రొబేషనరీ టైమ్‌లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొన్న పూజను మహారాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే. 2023 బ్యాచ్‌కు చెందిన ఆమె యూపీఎస్సీ పరీక్షలో 841 ర్యాంక్ సాధించారు. ఆమె ఓబీసీ నాన్ క్రిమిలేయర్ కోటాలో ఐఏఎస్‌కు ఎంపికైనట్టు ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపారు. అయితే శిక్షణ పొందేందుకు లాల్ బహదూర్ శాస్త్రి అకాడమీలో జాయిన్ అయ్యాక సమర్పించిన ఆస్తుల ధ్రువీకరణ పత్రంలో రూ.22 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్టు పేర్కొన్నారని వెల్లడించారు. ఓబీసీ నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్, ఆస్తుల ధ్రువీకరణ పత్రంలో పూజ పేర్కొన్న వివరాల్లో పొంతన లేదని.. ఈ విషయం యూపీఎస్సీ, సిబ్బంది శిక్షణ విభాగం పరిశీలనలో ఉందని పలువురు ఐఏఎస్ అధికారులు తెలిపారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన పూజ తండ్రి దిలీప్ కొండిబా ఖేద్కర్ అఫిడవిట్‌లో తనకు 40 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు పేర్కొన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పూజ తప్పుడు పత్రాలు సమర్పించి ఐఏఎస్‌కు ఎంపికైనట్టు రుజువైతే ఆమెను సర్వీసు నుంచి తొలగించడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చని అధికార వర్గాలు తెలిపాయి.

# ఢిల్లీలో జనమే జనం!

» ప్రపంచంలోనే అత్యధిక జనసమ్మర్ధ నగరాల్లో రెండోది

న్యూఢిల్లీ, జూలై 12: ప్రపంచ జనాభా శరవేగంగా పెరుగుతోంది. నగరాలు, పట్టణాల్లో ఈ పెరుగుదల మరింత వేగంగా ఉంది. ఉద్యోగావకాశాలు, వలసల కారణంగా ప్రజలు నగరాలకు తరలివచ్చి స్థిరపడుతున్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన వరల్డ్ అర్బనైజేషన్ ప్రాస్పెక్ట్ తాజా నివేదిక ప్రకారం.. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన నగరాల జాబితాలో మన దేశ రాజధాని ఢిల్లీ రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం 3.3కోట్ల మంది ఢిల్లీలో నివాసం ఉంటున్నారు. ప్రపంచంలో టాప్-10 అత్యంత జనసమ్మర్ధ నగరాల జాబితాలో భారత్ నుంచి ఢిల్లీ, ముంబై(9వ స్థానం) చోటు దక్కించుకున్నాయి. హైదరాబాద్ 34వ స్థానంలో ఉంది. 2028 నాటికి ఢిల్లీ ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక జనాభా కలిగిన నగరంగా అవతరించనుందని నివేదిక అంచనా వేసింది. కాగా 3.7 కోట్ల మంది జనాభాతో టోక్యో ఈ జాబితాలో టాప్‌లో నిలిచింది. ఈ నివేదిక ప్రకారం.. 2062 నాటికి భారత్ జనాభా 170 కోట్లకు చేరనుంది. 2050 నాటికి ప్రతి ముగ్గురిలో ఇద్దరు నగరాలు లేదా పట్టణ కేంద్రాల్లో నివసించే అవకాశం ఉంది.

## లోకం తీరు




## మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# 'మహాయుతి' ఘనవిజయం

» పోటీ చేసిన 9 స్థానాల్లోనూ గెలుపు



ముంబై, జూలై 12: మహారాష్ట్ర శాసన మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో బీజేపీ-శివసేన (షిండే)-ఎన్సీపీ (అజిత్) పార్టీల కూటమి అయిన 'మహాయుతి' ఘనవిజయం సాధించింది. పోటీ చేసిన మొత్తం తొమ్మిది స్థానాలను దక్కించుకొంది. మొత్తం 11 స్థానాలకు శుక్రవారం ఎన్నికలు జరిగాయి. విపక్ష కూటమి అయిన కాంగ్రెస్-శివసేన (ఠాక్రే), ఎన్సీపీ (శరద్)ల మహా వికాస్ అఘాడీ రెండు స్థానాల్లో పోటీ చేయగా రెండింట్లోనూ గెలిచింది. 11వ స్థానానికి ఎన్సీపీ (శరద్) మద్దతుతో పోటీ చేసిన పీజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ అభ్యర్థి జయంత్ పాటిల్ ఓడిపోయారు. పార్టీ ఆదేశాలను కాదని ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు క్రాస్ ఓటింగ్ చేసినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ తరఫున 37 మంది ఎమ్మెల్యేలు ఉండగా అందులో 30 మంది తొలి ప్రాధాన్యత కింద పార్టీ అభ్యర్థి ప్రద్న సాతవ్‌కు ఓటు వేయాలని నిర్ణయించారు. మిగిలిన ఏడుగురు శివసేన అభ్యర్థి మిలింద్ నర్వేకర్‌కు వేయాలని పార్టీ సూచించింది. అయితే సాతవ్‌కు 25, నర్వేకర్‌కు 22 ఓట్లు మాత్రమే రావడంతో క్రాస్ ఓటింగ్ జరిగినట్టు అనుమానిస్తున్నారు.

## హెచ్‌ఎంటీ పునరుద్ధరణపై త్వరలోనే నిర్ణయం

జీడిమెట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంటీ కంపెనీ పునరుద్ధరణపై కేంద్రం ఆలోచన చేస్తోందని, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని కేంద్ర భారీ పరిశ్రమలు, స్టీల్ శాఖ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ చెప్పారు. శుక్రవారం. జీడిమెట్లలోని హెచ్‌ఎంటీ మెషీన్ టూల్స్ యూనిట్‌ను వారు సందర్శించి పరిశీలించారు. దాదాపు మూడు గంటల పాటు కంపెనీలో ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలోని అన్ని యూనిట్లను పరిశీలిస్తున్నామని చెప్పారు. కబ్జాకు గురవుతున్న హెచ్‌ఎంటీ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్‌తో పాటు, పలు కార్మిక యూనియన్ నాయకులు జీడిమెట్ల హెచ్‌ఎంటీ కంపెనీలో సమస్యలను మంత్రులకు వివరించారు.

## ఖాళీ స్థలాలపై సంపద పన్ను వేయండి: ఎస్‌జేఎం

న్యూఢిల్లీ, జూలై 12: త్వరలోనే ప్రవేశ పెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విభాగం స్వదేశీ జాగరణ్ మంచ్(ఎస్‌జేఎం) కొన్ని సూచనలు చేసింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో గత నెలలో భేటీ అయిన అశ్వినీ మహాజన్ నేతృత్వంలోని ఎస్‌జేఎం ప్రతినిధులు.. ఏఐ ఆధారిత సంస్థలపై రోబో ట్యాక్స్ విధించాలని సూచించారు. ఏఐ వినియోగంతో ఉద్యోగాలు కోల్పోయేవారికి పరిహారం కింద దీనిని చెల్లించవచ్చని పేర్కొన్నారు. అయితే.. సాంకేతికతను అడ్డుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇలా వసూలు చేసే పన్నులను ఉద్యోగాలు కోల్పోయేవారు సరికొత్త సాంకేతికతలను నేర్చుకునేందుకు సాయం కింద అందించాలని సూచించారు. అదేవిధంగా ఖాళీ స్థలాలపై సంపద పన్ను విధించాలని, తద్వారా భూకబ్జాలను, ఆక్రమణలను కూడా తగ్గించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

## నేపాల్‌లో నదిలో పడిపోయిన రెండు బస్సులు

» ఏడుగురు భారతీయులు సహా 65 మంది గల్లంతు

ఖాఠ్మాండు, జూలై 12: నేపాల్‌లో కొండచరియలు విరిగిపడి రెండు బస్సులు నదిలో పడిపోయాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు భారతీయులు సహా 65 మంది గల్లంతయ్యారు. ఈ విషాదం శుక్రవారం తెల్లవారుజామున చిత్వాన్ జిల్లాలో జరిగింది. 24 మంది ప్రయాణికులతో ఏంజెల్ బస్సు ఖాఠ్మాండుకు, 41 మంది ప్రయాణికులతో గణపతి డీలక్స్ బస్సు గౌర్‌కు బయలుదేరాయి. ఈ క్రమంలో బస్సులు నారాయణ్‌ఘట్-ముగ్లింగ్ రోడ్డుపైకి చేరుకున్నాక వాటిపై కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో బస్సులు పక్కన ఉన్న త్రిశూలి నదిలో పడిపోయాయి.

## విశ్వాస పరీక్షలో ఓడిన నేపాల్ ప్రధాని ప్రచండ

కాఠ్మాండు, జూలై 12: నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ ఆ దేశ పార్లమెంటులో శుక్రవారం నిర్వహించిన విశ్వాస పరీక్ష ఓడారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన సీపీఎన్-యూఎంఎల్ మద్దతు ఉపసంహరించుకోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలి ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు కానుంది. 275 మంది సభ్యులున్న నేపాల్ దిగువ సభలో ప్రచండకు కేవలం 63 ఓట్లే వచ్చాయి. వ్యతిరేకంగా 194 ఓట్లు పడ్డాయి. విశ్వాస పరీక్ష నెగ్గాలంటే 138 ఓట్లు అవసరం. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్-మావోయిస్టు సెంటర్(సీపీఎన్-ఎంసీ) చైర్మన్ అయిన ప్రచండ 2022 డిసెంబరు 25న అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు విశ్వాస పరీక్షలో గట్టెక్కారు.

# జూన్ 25 రాజ్యాంగ హత్యా దినం

## ఎమర్జెన్సీ ప్రకటించిన రోజుపై కేంద్రం సంచలన నిర్ణయం.. ఆ చీకటి రోజులకు నిరసనగానే: అమిత్ షా

» ఎమర్జెన్సీ.. దేశ చరిత్రపై కాంగ్రెస్ రాసిన చీకటి అధ్యాయం: మోదీ



న్యూఢిల్లీ, జూలై 12: దేశ ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించిన జూన్ 25వ తేదీని 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏటా జూన్ 25ను ఈ విధంగానే వ్యవహరించాలంటూ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. '1975 జూన్ 25న ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ నియంతలా మారి ప్రజాస్వామ్యం గొంతునొక్కారు. మీడియాను అణచివేశారు. కారణం లేకుండా లక్షల మందిని జైల్లో పెట్టారు. ఎమర్జెన్సీ బాధితులు, దానిపై పోరాడిన వీరులను స్మరించుకునేందుకు, ఆ చీకటి రోజులను గుర్తు చేసుకునేందుకు జూన్ 25ను రాజ్యాంగ హత్యా దినం (సంవిధాన్ హత్యా దివస్)గా నిర్వహించాలని నిర్ణయించాం" అని పేర్కొన్నారు. షా ప్రకటన అనంతరం ప్రధాని మోదీ స్పందించారు. "ఎమర్జెన్సీ.. దేశ చరిత్రపై కాంగ్రెస్ పార్టీ రాసిన చీకటి అధ్యాయం. నాడు రాజ్యాంగాన్ని తొక్కిపెట్టి పరిపాలన సాగించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరినీ స్మరించుకునే రోజు" అని ట్వీట్ చేశారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థ వంటి రాజ్యాంగ వ్యవస్థలను బలహీనం చేస్తోందంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, ఇతర ప్రతిపక్షాల నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని ఎన్నికల వేళ విపక్షాలు పెద్దఎత్తున ప్రచారం చేశాయి. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనూ రాహుల్ సహా 'ఇండియా' ఎంపీలు పలువురు రాజ్యాంగ ప్రతులతో హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఇండియా కూటమి ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ సర్కారు జూన్ 25ను "రాజ్యాంగ హత్యా దినం"గా ప్రకటించింది. ఇదిలా ఉండగా, మోదీ హయాంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, అసమానతలతో కోట్లాది ప్రజల జీవితలు ఛిన్నాభిన్నం అయ్యాయని, త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనైనా దేశ ప్రాథమిక ఆర్థిక అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రధాని మోదీకి సూచించారు.

### మోదీ ముక్త్ దివస్‌గా జూన్ 4

న్యూఢిల్లీ, జూలై 12: దేశంలో ఎమర్జెన్సీ విధించిన 1975 జూన 25ను 'సంవిధాన్ హత్యా దివస్' (రాజ్యాంగ హత్యా దినం)గా పాటించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంపై శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన తెలిపింది. పత్రికల్లో పతాక శీర్షికల కోసం ప్రధాని మోదీ ప్రదర్శిస్తున్న కుటిలనీతి అని విమర్శించింది. నిజానికి వ్యక్తిగతంగా, రాజకీయంగా నైతిక ంగా మోదీ ఓడిపోయిన రోజైన 2024 జూన్ 4వ తేదీయే (లోక్‌సభ ఫలితాలు వెల్లడయిన రోజు) చరిత్రలో మోదీ ముక్త్ దివస్‌గా మిగిలిపోతుందని వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేస్తూ 'రాజ్యాంగం' అన్నది పవిత్రమైన పదమని, దాన్ని 'హత్య' చేయడం అంటే అంబేడ్కర్‌ను అవమానించడమేనని విమర్శించారు. నోట్లను రద్దు చేసిన 2016 నవంబరు 8వ తేదీని 'ఆజీవక హత్యా దివస్'గా పరిగణిస్తామని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం గత పదేళ్లుగా ప్రతి రోజూ రాజ్యాంగాన్ని హత్య చేస్తునే ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ట్వీట్ చేస్తూ.. దేశంలో గత పదేళ్లుగా అప్రకటిత అత్యయిక పరిస్థితి అమలవుతూనే ఉందన్నారు. 'మానవేతర ప్రధాని' ఒక పద్ధతి ప్రకారం రాజ్యాంగ విలువలు, సిద్ధాంతాలు, రాజ్యాంగ సంస్థలపై దాడి చేస్తునే ఉన్నారని ఆరోపించారు.

## ప్రెసిడెంట్ అయ్యే అర్హత

# కమల హ్యారిస్‌కే ఉంది

» నాటో సమావేశం తర్వాత బైడెన్ వ్యాఖ్య

జెలెన్‌స్కీని పుతిన్ అంటూ పరిచయం



వాషింగ్టన్, జూలై 12: అమెరికా ఉపాధ్యక్షురాలు, భారత సంతతికి చెందిన కమలా హ్యారిస్‌కు అధ్యక్ష పదవి చేపట్టేందుకు కావలసిన అన్ని అర్హతలున్నాయని ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. గురువారం జరిగిన నాటో కూటమి దేశాల సదస్సు తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "కమలా హ్యారిస్ సమర్థురాలు. అందుకే ఆమెను ఉపాధ్యక్షురాలిగా ఎంపిక చేశాన"ని తెలిపారు. డెమోక్రాట్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా అమెరికన్ల నుంచి బైడెన్ విషయంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇదిలావుండగా, బైడెన్ మరోసారి నోరుజారారు. కమలా హ్యారిస్‌నుద్దేశించి మాట్లాడే సందర్భంలో ఆయన పొరపాటున మాజీ అధ్యక్షుడు ట్రంప్ పేరు ఉటంకించారు. అదేవిధంగా నాటో సభ్య దేశాల ప్రతినిధులకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని పరిచయం చేస్తూ "ఉక్రెయిన్ అధ్యక్షుడు పుతిన్" అని సంబోధించారు. మరోవైపు, బైడెన్‌అభ్యర్థిత్వంపై వ్యతిరేకత నేపథ్యంలో తాను న్యూరాలాజికల్ వైద్యపరీక్షలకు సిద్ధమని ఆయన ప్రకటించారు.

## ప్రత్యేక హోదాపై బిహార్‌లో పోరు

ఎన్డీయే, మహాకూటమి పరస్పర విమర్శలు

పట్నా, జూలై 12: పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ముంగిట ప్రత్యేక హోదాపై బిహార్‌లో అధికార ఎన్డీయే, విపక్ష మహాకూటమి పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. హోదా ఇవ్వాలంటూ ఇటీవల ఎన్డీయే భాగస్వామి జేడీయూ కార్యవర్గ సమావేశాల్లో తీర్మానించారని.. మిత్రపక్షం డిమాండ్‌ను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆమోదించడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం జేడీయూపై ఆధారపడి ఉన్నా పట్టించుకోవడం లేదని శుక్రవారం అన్నారు. అయితే కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వమే హోదా డిమాండ్‌ను అటకెక్కించిందని జేడీయూ నేత శ్రావణ్‌కుమార్ దుయ్యబట్టారు. ఎన్డీయే మరో భాగస్వామి ఎల్‌జేపీ(రాంవిలాస్) ఎంపీ అరుణ్ భారతి కూడా హోదా డిమాండ్‌ను సమర్థించారు. రాష్ట్రానికి హోదా గానీ, ప్రత్యేక ప్యాకేజీ గానీ ఇస్తారని ఆశాభావంతో ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీయేనే అధికారంలో ఉందని.. హోదా ఇవ్వడానికి చర్యలు తీసుకోకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని ప్రతిపక్షంలోని ఆర్జేడీ ఆరోపించింది. రాష్ట్రాన్ని చీల్చి జార్ఖండ్‌ను ఏర్పాటుచేసిన తర్వాత ఖనిజ సంపదను బిహార్ కోల్పోయింది. దీనికి ప్రతిగా ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండ్ 2000 నుంచీ వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ విభజన చేసినప్పుడు ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని అప్పటి ప్రధాని మన్మోహన్ హామీ ఇచ్చారు. కానీ 14వ ఆర్థిక సంఘం ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వొద్దని చెప్పిందంటూ మోదీ ప్రభుత్వం పక్కనపెట్టేసింది.

# కేజ్రీకి మధ్యంతర బెయిల్

## ఈడీ కేసులో మంజూరు చేసిన సుప్రీంకోర్టు

» మరోవైపు సీబీఐ కేసులో కేజ్రీవాల్ కస్టడీని 25 వరకు పొడిగించిన ప్రత్యేక కోర్టు

» బెయిలొచ్చినా జైల్లోనే ఢిల్లీ సీఎం



న్యూఢిల్లీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయిన కేజ్రీవాల్ ప్రస్తుతం తిహాడ్ జైల్లో ఉన్నారు. మనీలాండరింగ్ కేసులో తనను ఈడీ అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన కొన్ని చట్టపరమైన ప్రశ్నలను విస్తృత ధర్మాసనానికి నివేదించాల్సి ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం అభిప్రాయపడింది. మధ్యంతర బెయిల్‌ను పొడిగించేందుకు, రద్దు చేసేందుకు విస్తృత ధర్మాసనానికి అధికారాలు ఉన్నాయని తెలిపింది. సుప్రీంకోర్టు మధ్యంతర బెయిలు ఇచ్చినా.. కేజ్రీవాల్‌కు నిరాశే మిగిలింది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అవినీతికి సంబంధించి సీబీఐ దాఖలు చేసిన కేసులో రౌస్ అవెన్యూ కోర్టు ఆయన జ్యుడీషియల్ కస్టడీని పొడిగించింది. శుక్రవారంతో ఆయన కస్టడీ ముగియడంతో ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ముందు కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. కస్టడీని ఈ నెల 25 వరకు పొడిగిస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. దీంతో కేజ్రీవాల్ తిహాడ్ జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, మధ్యంతర బెయిల్‌పై కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని చెప్పినంత మాత్రాన ఆయనపై మనీలాండరింగ్ చట్టం కింద ఉన్న ఆరోపణలను తిరస్కరించినట్లు కాదని జస్టిస్ ఖన్నా చెప్పారు. మధ్యంతర బెయిల్ కాలంలో కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కార్యాలయానికి కానీ, ఢిల్లీ సచివాలయానికి కానీ వెళ్లరాదని ధర్మాసనం ఆంక్షలు విధించింది. ఇక కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించాలన్న వాదనపై స్పందిస్తూ.. ఆయన ఎన్నికైన నాయకుడని తమకు తెలుసని, గద్దె దిగాల్సిందిగా ఎలాంటి ఆదేశాలూ జారీ చేయబోమని ధర్మాసనం స్పష్టం చేసింది.

### ఇదేం గెలుపు కాదు: బీజేపీ

కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిలు వచ్చినంత మాత్రాన ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించినట్లు కాదని బీజేపీ పేర్కొంది. కేజ్రీవాల్‌పై ఆరోపణలకు సుప్రీంకోర్టు ఆమోదముద్ర వేసిన విషయాన్ని మరిచిపోరాదని వ్యాఖ్యానించింది. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు నేరాలకు పాల్పడితే తమ పదవులకు రాజీనామా చేయాలని సుప్రీంకోర్టు సూచించిందని, కేజ్రీవాల్ మొండి వైఖరి వల్ల ఢిల్లీలో పాలన స్తంభించిపోయిందని బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్ చెప్పారు.

### సత్యానికి లభించిన గెలుపు

సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడాన్ని ఆప్ స్వాగతించింది. ఇది సత్యానికి లభించిన విజయమని, బీజేపీ కుట్రలకు దక్కిన ఓటమి అని పేర్కొంది. 'సత్యమేవ జయతే' అని ట్వీట్ చేసింది. ప్రతి కోర్టూ కేజ్రీవాల్‌పై బీజేపీ కుట్రను బహిర్గతం చేసిందని ఢిల్లీ మంత్రి అతిషీ వ్యాఖ్యానించారు.

## గ్రామ న్యాయాలయాల ఏర్పాటులో జాప్యమా?

6 వారాల్లో సమాధానం ఇవ్వండి: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 12: ప్రజలందరికీ న్యాయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన గ్రామ న్యాయాలయాల ఏర్పాటు అత్యవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సత్వరమే న్యాయం అందించేందుకు, కేసుల పెండింగ్‌ను తగ్గించేందుకు వీటిని ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపింది. ఈ విషయమై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో ఆరు వారాల్లో సమాధానం ఇవ్వాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్లను ధర్మాసనం ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం 2008లో గ్రామ న్యాయాలయాల చట్టాన్ని తీసుకువచ్చింది. అయితే ఈ చట్టాన్ని అమలు చేయడం లేదంటూ 2019లో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఫర్ ఫాస్ట్ జస్టిస్ అనే స్వచ్ఛంద సంస్థ పిల్ దాఖలు చేసింది.

## వివాదాస్పద రచనలను పాఠ్యాంశాలు చేసే ప్రసక్తే లేదు

న్యూఢిల్లీ, జూలై 12: వివాదాస్పద అంశాలను విద్యార్థుల పాఠ్యాంశాల్లో చేర్చే ప్రసక్తే లేదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం స్పష్టం చేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం(డీయూ) న్యాయ విద్యార్థులకు మనుస్మృతి బోధించాలనే ప్రతిపాదనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డీయూ న్యాయ(లా) విద్యార్థులకు మనుస్మృతి బోధించనున్నారనే సమాచారం గురువారం తమకు అందడంతో వర్సిటీ వీసీతో మాట్లాడానని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. అయితే, పలువురు ఆచార్యులు చేసిన ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్లు వీసీ చెప్పారన్నారు.

# కన్న కొడుకే కాల యముడు

» తండ్రిని హతమార్చేందుకు బాడీగార్డుతో పథకం

» రియల్టర్ కృష్ణ హత్య కేసులో వెలుగులోకి వాస్తవాలు

» ఆస్తులు.. డబ్బుల వ్యవహారమే ప్రధాన కారణం

షాద్‌నగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ శివార్లలోని ఓ ఫాంహౌజ్‌లో ఇటీవల హత్యకు గురైన ప్రముఖ రియల్టర్ కమ్మరి కృష్ణ హత్య కేసులో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. కన్నకొడుకే కృష్ణను హత్య చేసినట్లు తెలుస్తోంది. ఆస్తులు, డబ్బుల విషయంలో కొడుకు పట్ల కృష్ణ చూపించిన వివక్షే ఆయన హత్యకు కారణంగా కనిపిస్తోంది. కక్షపెట్టుకొని... ఆయన అంగరక్షకుడి సాయంతోనే తండ్రిని కొడుకు హతమార్చినట్లు స్పష్టమవుతోంది. ఈనెల 10న ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామంలోని సొంత ఫామ్‌హౌజ్‌లో కృష్ణ హత్యకు గురయ్యారు. రియల్ ఎస్టేట్‌లో వందల కోట్లు సంపాదించిన ఆయనకు ముగ్గురు భార్యలు. మొదటి భార్య అనారోగ్యంతో మంచంపట్టగా, రెండో భార్య చనిపోయింది. కొంతకాలంగా కృష్ణ మూడో భార్యతోనే ఉంటున్నాడు. ఇటీవల ఆమె పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించాడు. అంతేకాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వచ్చిన రూ.15 కోట్ల ఆస్తి, కొంత నగదును కూడా ఆమెకు కానుకగా అందజేసినట్లు సమాచారం. ఇదిలావుంటే.. మొదటి భార్యకు ఓ కొడుకు ఉన్నాడు. తన తండ్రి... సంపాదించిన డబ్బు, నగదు అంతా మూడో భార్యకే ఇస్తున్నట్లు అతను గుర్తించాడు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక తండ్రిని ఎలాగైనా హతమార్చాలని కుట్ర పన్నాడు. ఇందుకుగాను గతంలో తండ్రి వద్ద బాడీగార్డుగా పనిచేసి మానేసిన బాబా అనే వ్యక్తిని ఆశ్రయించాడు. ఆస్తి, నగదు విషయంలో తనకు జరుగుతున్న అన్యాయాన్ని మొత్తం బాబాకు చెప్పి ఎలాగైనా తిరిగి తన తండ్రి వద్ద బాడీగార్డుగా చేరాలని పురమాయించాడు. గతంలో తనకు నమ్మిన బంటుగా ఉన్నాడన్న ఆలోచనతో కృష్ణ మళ్లీ బాడీగార్డుగా బాబాను నియమించుకున్నాడు. అనంతరం మొదటి భార్య కుమారుడు, బాబాలు కృష్ణను హతమార్చడానికి ప్రణాళికలు రచించారు. ఫాంహౌజ్‌లో హత్య చేస్తే పోలీసుల నుంచి తప్పించుకోవడానికి సులువుగా ఉంటుందని నిర్ణయానికి వచ్చి దానినే అమలు చేశారు. కృష్ణ వద్ద లైసెన్స్‌డ్ రివాల్వర్ ఉన్న విషయం బాబాకు మినహా మరెవ్వరికీ తెలియదు. హత్య చేయడానికి వెళ్తే తన వద్ద ఉన్న గన్‌తో కృష్ణ ఫైరింగ్ చేస్తాడని గ్రహించిన బాబా.. ముందు కృష్ణ చేతులను గట్టిగా పట్టుకుని కేకలు వేశాడు. వెంటనే హత్య చేయడానికి సహకరించిన మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి పదునైన కత్తితో కృష్ణ గొంతు కోసి హత్య చేసినట్లు సమాచారం. కాగా, నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలను శంషాబాద్ డీసీపీ రాజేశ్ నేడు మీడియాకు వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

## మధ్యాహ్న భోజనం తిని

# 18 మంది విద్యార్థులకు వాంతులు

» మరో పాఠశాలలో అన్నంలో పురుగులు

» రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఘటనలు

నిజామాబాద్ అర్బన్, పెద్దేముల్, జూలై 12: ఓ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసి విద్యార్థులు అనారోగ్యానికి గురవ్వగా మరోచోట విద్యార్థులకు పెట్టిన అన్నంలో పురుగులు కన్పించాయి. రంగారెడ్డి జిల్లా పెద్దేముల్ మండలం కందనెల్లితండాలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనం కింద ఏజెన్సీ నిర్వాహకురాలు పులిహోర తయారు చేశారు. అనంతరం అత్యవసర పని ఉందని ఆమె వెళ్లిపోవడంతో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు పులిహోర వడ్డించారు. తింటున్న సమయంలోనే విద్యార్థులు ఒకరితరువాత వాంతులు చేసుకోవడంతో ఆందోళనకు గురైన ఉపాధ్యాయులు విద్యార్థులు మందులు ఇచ్చారు. ఆశావర్కర్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు తెచ్చి ఇచ్చారు. అయినా వాంతులు తగ్గలేదు. కడుపు నొప్పి కూడా పిల్లలు వస్తుందని చెప్పడంతో వెంటనే తల్లిదండ్రులకు సమాచారమిచ్చి వాంతులు చేసుకున్న 18 మంది పిల్లల్ని తాండూరులోని మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి తరలిచారు. అయిదుగురిని మినహా మిగిలిన వారిని డిశార్జ్ చేశారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. మరోవైపు శుక్రవారం నిజామాబాద్ నగరంలోని కోటగల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పెట్టిన మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చాయి. పప్పు సైతం నీళ్లలా ఉండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. రంగుమారిన బియ్యాన్ని కనీసం కడగకుండా వండటంతో అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు వాపోయారు. పాఠశాలకు ప్రతిరోజు 500 వరకు విద్యార్థులు హాజరవుతుండగా.. 200 మందికి సరిపడే సరుకులతోనే వారందరికీ భోజనం తయారు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి విచారణ జరిపి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



తాండూరు మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో చికిత్సలు పొందుతున్న విద్యార్థులు

### మోడల్ స్కూల్ వసతిగృహం ఉప్మాలో బల్లిపై కేంద్రం సీరియస్

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా రామాయంపేట మోడల్ స్కూల్ బాలికల వసతిగృహంలో రెండు రోజుల క్రితం ఉప్మాలో బల్లి బయటపడడంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈ ఉదంతంలో కఠిన చర్యలు తీసుకున్నామని, కుక్, అసిస్టెంట్ కుక్‌లను విధుల నుంచి తొలగించామని, ప్రత్యేకాధికారి, కేర్‌టేకర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం తన సొంత పథకం కింద విద్యార్థులకు 'ఉపాహారాన్ని(బ్రేక్‌ఫాస్ట్)' అందిస్తుందని, కేంద్ర ప్రభుత్వ 'ప్రధానమంత్రి పోషణ్' పథకాన్ని అమలుచేయడం లేదని కేంద్ర విద్యాశాఖ తెలిపింది. పీఎం పోషణ్ పథకం కింద విద్యార్థులకు వేడివేడి మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నామని వివరించింది. ఈ దృష్ట్యా రాష్ట్రాలు విద్యార్థులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

# ఇంద్రలోకం చూపిస్తానని మభ్యపెట్టి..

» జగిత్యాల జిల్లాకు చెందిన తల్లీ, ఇద్దరు కుమార్తెలను ఎత్తికెళ్లిన మహిళ

» ఏపీలోని ప్రకాశం జిల్లాలో ఉంచిన వైనం

» భార్యాబిడ్డలను ఇంటికి రప్పించేందుకు 9 నెలలుగా భర్త విఫలయత్నం

» సాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి వేడుకోలు

సుభాష్‌నగర్, జూలై 12: తనతో వస్తే ఇంద్రలోకం చూపిస్తానని చెప్పి ఏపీకి చెందిన ఓ మహిళ తన భార్య, ఇద్దరు కుమార్తెలను ఎత్తుకెళ్లిందని, ఆమె చెర నుంచి వారిని రక్షించాలని జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి వేడుకుంటున్నాడు. ఏపీ అధికారులు, పోలీసులు తనకు సహకరించడం లేదని తన భార్యాబిడ్డలు తిరిగి ఇంటికి చేరేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయం చేయాలని కోరాడు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన జాడి మల్లేశం ఈ మేరకు కరీంనగర్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తన గోడు వెళ్లబోసుకున్నాడు. బాధితుడి కథనం ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన జాడి మల్లేశంకు భార్య భాగ్య, ఇద్దరు కుమార్తెలు(13, 15 ఏళ్లు), ఓ కుమారుడు ఉన్నారు. మరోపక్క, ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన కృష్ణవేణి తొమ్మిది నెలల క్రితం సూరారం వచ్చి బాతుల వ్యాపారం చేసుకునేది. మల్లేశం ఇంటి సమీపంలో గుడారం ఏర్పాటు చేసుకుని అందులోనే నివసించేది. ఈ క్రమంలో భాగ్యతో పరిచయం పెంచుకున్న కృష్ణవేణి.. తాను ఇంద్రలోకం వెళ్లి వస్తుంటానని, తనతో వస్తే అక్కడికి తీసుకెళతానని నమ్మబలికింది. కృష్ణవేణి మాటలు నమ్మిన భాగ్య, ఆమె కుమార్తెలు ఎవ్వరికీ చెప్పకుండా ఆమెతో వెళ్లిపోయారు. కుమారుడితో మిగిలిపోయిన మల్లేశం భార్యాబిడ్డల ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. వాళ్లు ఏపీ, ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం గుడ్లూరు గ్రామంలో ఉన్నారని తెలిసి అక్కడికి వెళ్లాడు. కృష్ణవేణి యజమానురాలైన దేవరకొండ అంకాలమ్మ అనే మహిళ.. భాగ్య, ఆమె ఇద్దరు కుమార్తెలను అక్కడ ఓ గదిలో ఉంచింది. ఇంటికి తిరిగి వచ్చేయమని మల్లేశం వారిని పిలవగా.. తాము దేవుడి వద్దకు వెళుతున్నామని, ఇంటికి రామని భాగ్య, పిల్లలు చెబుతున్నారు. పైగా, కృష్ణవేణికి చెందిన వారు మల్లేశంను అక్కడి నుంచి తరిమేశారు. దీంతో జగిత్యాల జిల్లా వెల్గటూరు పోలీసులకు మల్లేశం ఫిర్యాదు చేయగా.. ఇద్దరు కానిస్టేబుళ్లు గుడ్లూరు వెళ్లినా వారికి ఎవరూ సహకరించలేదు. దీంతో తనకు సాయం చేయాలని ఏపీ హోం మంత్రి అనితకు మల్లేశం వినతి పత్రం కూడా ఇచ్చారు. కొండగట్టు వచ్చిన ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి సాయం అడిగేందుకు విఫలయత్నం చేశాడు. ఇలా తొమ్మిది నెలలుగా భార్యాబిడ్డలకు దూరమై దిక్కుతోచని స్థితిలో ఉన్న మల్లేశం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై దయ చూపాలని కోరుతున్నాడు.

## సచివాలయ భద్రత మార్పు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయ భద్రతలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. సచివాలయ భద్రత బాధ్యతలను తిరిగి ఎస్పీఎఫ్‌కు అప్పగించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. పోలీస్ ఉన్నతాధికారులు, జీఏడీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన అనంతరం ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం వెలువర్చనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, విభజన అనంతరం నూతన సచివాలయ భవన నిర్మాణానికి ముందు రాష్ట్రంలో సచివాలయ భద్రతను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) బలగాలు పర్యవేక్షించేవి. కొత్త సచివాలయ నిర్మాణానంతరం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ బాధ్యతను టీజీఎస్పీకి అప్పగించింది. కాగా ప్రస్తుతం టీజీఎస్పీ, ఏఆర్, సివిల్ ఇలా మొత్తంగా సుమారు 600 మందికిపైగా పోలీస్ సిబ్బంది సచివాలయ భద్రత విధుల్లో పాల్గొంటున్నారు.

## నెలాఖరున గోదావరి బోర్డు సమావేశం

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సమావేశం ఈనెలాఖరున జరిగే అవకాశాలున్నాయి. దీనికి సంబంధించి సమావేశం తేదీ ఖరారు చేసే అంశంపై తెలుగు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ఉన్నతాధికాలతో బోర్డు సంప్రదింపులు జరుపుతోంది. ఆ సమావేశంలో సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు డీపీఆర్‌పై కూడా చర్చ జరుగనుంది. దీంతో పాటు నిధులు, గెజిట్ ప్రకారం ప్రాజెక్టుల అప్పగింత, టెలిమెట్రీ కేంద్రాలపై చర్చించే అవకాశాలున్నాయి.

## 15న కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నుంచి ఏపీ విజ్ఞప్తి మేరకు 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలా.. వద్దా? అనే అంశంపై నిర్ణయం తీసుకోవడానికి వీలుగా ఈ నెల 15వ తేదీన కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి చెందిన త్రిసభ్య కమిటీ సమావేశం జరుగనుంది. నాగార్జునసాగర్ నుంచి 5 టీఎంసీల నీటిని కుడి కాలువ ద్వారా విడుదల చేయడానికి అనుమతించాలని కోరుతూ ఈ నెల 8న బోర్డుకు ఏపీ లేఖ రాసింది. దీనిపై ఏం నిర్ణయం తీసుకోవాలో చెప్పాలని తెలంగాణను బోర్డు కోరగా.. ఎగువ నుంచి తగినన్ని ఇన్‌ఫ్లోలు లేనందున నీటి విడుదలకు అంగీకరించే ప్రసక్తే లేదని బోర్డుకు తెలంగాణ తేల్చి చెప్పింది. దాంతో ఈ అంశాలపై 15వ తేదీన ఉదయం 11 గంటలకు జరిగే త్రిసభ్య కమిటీ(తెలంగాణ, ఏపీ ఈఎన్‌సీలు, కృష్ణా బోర్డు సభ్య కన్వీనర్) సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

## బ్యారేజీలపై వివరాలు అందించండి

▸▸ విద్యుత్ రంగ నిపుణుడు రఘుకు కమిషన్ సమన్లు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈ నెల 15వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు కమిషన్ ముందు హాజరై... వివరాలు ఉంటే అందించాలని విద్యుత్ రంగ నిపుణుడు కంచర్ల రఘుకు శుక్రవారం సమన్లు జారీ చేసింది. బ్యారేజీల నిర్మాణంలో వైఫల్యాలు, నిర్లక్ష్యంతో పాటు అవినీతిపై కమిషన్ విచారణ జరుపుతున్న విషయం విదితమే. విచారణకు ఉపయుక్తంగా ఉండే సమాచారం ఏమైనా ఉంటే అందించాలని రఘును కమిషన్ కోరింది.

## 14న జెన్‌కో ఏఈ ఉద్యోగ పరీక్షలు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జెన్‌కోలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్స్(ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్)తో పాటు కెమిస్ట్ ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 14వ తేదీన కంప్యూటర్ ఆధారిత పరీక్ష జరుగనుంది. మెకానికల్, కెమిస్ట్ విభాగాలకు ఉదయం 9 గంటల నుంచి 10.40 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2.40 గంటలదాకా ఎలక్ట్రికల్, సాయంత్రం 5 గంటల నుంచి 6.40 గంటల దాకా సివిల్, ఎలక్ట్రానిక్స్ విభాగం వారికి పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు విధిగా హాల్‌టికెట్‌తో పాటు ఒక ఒరిజనల్ ఫొటో గుర్తింపు కార్డు(పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ, ఆధార్ కార్డులో ఏదైనా ఒకటి) వెంట తెచ్చుకోవాలని జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రాస్ కోరారు. పరీక్ష కేంద్రానికి 2 గంటల ముందే చేరుకోవాలని, పరీక్ష ప్రారంభం కావడానికి 15నిమిషాల ముందే గేట్లను మూసివేయడం జరుగుతుందన్నారు.

## హైకోర్టులో 19మంది ప్రభుత్వ ప్లీడర్ల నియామకం

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల తరఫున హైకోర్టులో ప్రాతినిధ్యం వహించేందుకు మరో 19 మంది ప్రభుత్వ ప్లీడర్లను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి ఆర్ తిరుపతి శుక్రవారం జీవో జారీచేశారు. డీవీ చలపతిరావు, ఎం శాలిని, మహమ్మద్ హుస్సేన్, బీ కృష్ణ, ఎస్ సుమన్, ఈ పూర్ణచందర్‌రావు, జీ తిరుపతి రెడ్డి, అనంతుల రవీందర్, ఏ అనంతసేన్ రెడ్డి, ఎం విఘ్నేశ్వర్ రెడ్డి, టీ వెంకటరాజు, పీ శ్రవణ్‌కుమార్ గౌడ్, జీ భాస్కర్, హెచ్ రాజేశ్‌కుమార్, గడ్డం కిరణ్‌కుమార్, ఈ వెంకట రెడ్డి, కే మణిదీపిక, శ్రీరాంభట్ల ప్రదీప్‌కుమార్, కూరపాటి సుజాత జీపీలుగా నియామకమయ్యారు. మొదటి విడతలో 11 మంది తాజాగా 19 మందితో జీపీల సంఖ్య 30కి చేరింది.

## వైద్య శాఖలో 15 నుంచి బదిలీల ప్రక్రియ

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో బదిలీల ప్రక్రియ ఈనెల 15 నుంచి ప్రారంభం కానుంది. ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో మొత్తం 1,180 మంది బదిలీ కానున్నారు. వారిలో 449 మంది వైద్యులు ఉండగా వారికి ఈనెల 17, 18 తేదీల్లో కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. అలాగే నర్సింగ్ విభాగంలో మొత్తం 546 మంది బదిలీ కాబోతుండగా వారికి 19, 20 తేదీల్లో, అలాగే 120 మంది పారామెడికల్ స్టాఫ్, 60 మంది మినిస్టిరియల్ స్టాఫ్‌కు ఈనెల 16వ తేదీన కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. ఇక తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని బదిలీల్లో భాగంగా 15న అడ్మినిస్ట్రేటివ్, పారామెడికల్ స్టాఫ్‌కు, 16, 18 తేదీల్లో స్టాఫ్‌నర్స్‌లకు, 19, 20 తేదీల్లో వైద్యులకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు.డీఎంఈ పరిధిలోని బదిలీల ప్రక్రియ ఇంకా ఖరారు కాలేదు. దీనిపై శనివారం నిర్ణయం తీసుకుని షెడ్యూల్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది.

## నైనీ బ్లాకులో బొగ్గు ఉత్పత్తికి సహకరిస్తాం

▸▸ భట్టి విన్నపానికి ఒడిసా సీఎం సానుకూల స్పందన

హైదరాబాద్/కొత్తగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి కేటాయించిన ఒడిసాలోని నైనీ బొగ్గు గనుల్లో తవ్వకాలు చేపట్టడానికి పూర్తిగా సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంజీ చెప్పారు. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర అధికారులను ఆయన ఆదేశించారు. నైనీ బొగ్గు బ్లాక్‌లో సింగరేణి కార్యకలాపాల ప్రారంభానికి సంబంధించి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. సింగరేణి అధికారుల బృందంతో కలిసి ఒడిసా సీఎంను ఆ రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందిస్తూ.. సింగరేణికి భూముల బదలాయింపు, విద్యుత్తు, రహదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు.

## ఖమ్మం జిల్లాలో డ్రోన్ పరీక్ష కేంద్రం

▸▸ రేమిడిచర్లలో స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ఖమ్మం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో డ్రోన్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లలో 53.18 ఎకరాల భూమిని ప్రతిపాదించారు. ఈ స్థలాన్ని శుక్రవారం ఏవియేషన్ అధికారులు పరిశీలించారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతోపాటు నూతనంగా ఏర్పాటు కానున్న జాతీయ రహదారికి సమీపంలో ప్రతిపాదిత స్థలం ఉండటం, రైల్వేజోన్ కూడా దగ్గరలో ఉండటంతో ఏవియేషన్ అధికారులు సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు తెలిసింది. అయితే ప్రస్తుతం ప్రతిపాదించిన స్థలం సరిపోతుందో లేదోనన్న అంశంపై మాత్రం నివేదిక సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్థలం విషయంపై సందిగ్ధం వీడితే ఖమ్మం జిల్లాలో డ్రోన్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జమలాపురంలోని వాసిరెడ్డి కల్యాణ మండపంలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహకారముంటుందని, డ్రోన్ పరీక్ష కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలెక్టర్ కోరారు.

## గొల్ల, కురుమలకు 45 వేల డీడీలు వాపస్

**గొర్రెల పథకం కోసం సేకరించిన డీడీలకు మోక్షం.. 196కోట్ల విడుదలకు ఉత్తర్వులు**

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా సేకరించిన డీడీలను లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు సుమారు 45 వేల డీడీలను గొల్ల, కురుమలకు తిరిగి ఇచ్చేందుకు వీలుగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం రూ.196 కోట్లను విడుదల చేయాలని ఆదేశించింది. దీంతో సుదీర్ఘకాలంగా డీడీల కోసం ఎదురు చూస్తున్న గొల్ల, కురుమలకు ఉపశమనం లభించింది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే. యూనిట్ విలువ(రూ.1.75లక్షలు)లో 25 శాతం లబ్ధిదారులు చెల్లిస్తే... ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ ఇచ్చేలా మార్గదర్శకాలు రూపొందించింది. మొత్తం 7.50 లక్షల మంది గొల్ల, కురుమలను లబ్ధిదారులుగా ఎంపిక చేసి... సుమారు 4లక్షల యూనిట్లు పంపిణీ చేసింది. ఇంకా 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా... నిధులు సర్దుబాటు కాలేదు. దీంతో లబ్ధిదారుల వాటా కింద సమర్పించిన 86 వేల డీడీలు ప్రభుత్వం వద్ద అలాగే ఉండిపోయాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గొల్ల, కురుమల డిమాండ్ మేరకు తొలుత 54 వేల డీడీలను వాపస్ చేసింది. ఇంకా 32 వేల డీడీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కాకుండా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగానే అందజేసిన డీడీలు మరో 13వేలు కలిపి మొత్తం 45 వేల డీడీలను లబ్ధిదారులకు వాపస్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, ఏసీబీ కేసు తేలిన తర్వాత గొర్రెల పథకంపై పునరాలోచన చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. యూనిట్లు కొనుగోలు చేసి ఇవ్వడం కన్నా.. సబ్సిడీని లబ్ధిదారులకు బదిలీ చేసే ఆలోచనలో ఉంది. లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకూడదన్న ఉద్దేశంతోనే డీడీలను తిరిగి ఇచ్చేస్తున్నట్లు తెలిసింది.

## ట్యాపింగ్ కేసులో చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు అధికారులు దాఖలు చేసిన చార్జిషీట్‌ను నాంపల్లి కోర్టు పరిగణనలోకి తీసుకుంది. పలుమార్లు సాంకేతిక కారణాలతో చార్జిషీట్‌ను తిరస్కరించిన కోర్టు.. తాజాగా అధికారులు పూర్తి ఆధారాలతో దాఖలు చేయటంతో స్వీకరించింది. ఈ మేరకు చార్జిషీట్‌కు ప్రీ రిజిస్టర్ కేస్(పీఆర్‌సీ) నంబరు 260/2024 కేటాయించింది. మరోవైపు, కేసులో నిందితులుగా ఉన్న ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం తిరస్కరించింది. గురువారం వాదనలు విన్న న్యాయాధికారి.. ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించారు.

# హైడ్రాకు ప్రత్యేక నిధులు

**హైదరాబాద్ విస్తరణకు అనుగుణంగా ఏర్పాటు.. సమీక్షలో సీఎం రేవంత్**

▸▸ విధివిధానాలపై అధ్యయనం చేయండి

▸▸ 2 వేల చ.కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పనిచేయాలి

▸▸ విపత్తుల నుంచి ఆస్తుల సంరక్షణ వరకు బాధ్యత

▸▸ బడ్జెట్ కేటాయింపు అంశాన్నీ పరిశీలించాలి: రేవంత్

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగర విస్తరణకు అనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలందించేలా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. విపత్తుల నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ, చెరువులు, నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయడం, అక్రమ నిర్మాణాలను, ఆక్రమణలను తొలగించడం, నిబంధనలకు విరుద్ధంగా ఉండే ఫ్లెక్సీలు, ప్రకటనల హోర్డింగులను ఏర్పాటు చేయకుండా చూడటం, తాగునీరు, విద్యుత్తు సరఫరా వంటి అంశాల్లో హైడ్రా కీలకంగా వ్యవహరించాలన్నారు. ఇందుకు అనుగుణంగా విధులు, అధికారాలను బదలాయించాలని పురపాలక శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో హైడ్రా ఆవశ్యకత, పరిధి, పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా ఈ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి వ్యవస్థాగత నిర్మాణం, విధి విధానాలపై లోతైన అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, విజిలెన్స్, ట్రాఫిక్, విద్యుత్తు, పోలీసు విభాగాలను సమన్వయం చేసుకుని సమర్థవంతమైన వ్యవస్థగా హైడ్రా మారాలని సీఎం ఆకాంక్షించారు. ప్రస్తుతం ఉన్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను పునర్వ్యవస్థీకరించాలని ఆదేశించారు. కొత్తగా ఏర్పడే హైడ్రాలో ఏ స్థాయి అధికారులు ఉండాలి, ఎంత మంది సిబ్బంది అవసరం, ఎన్ని విభాగాలకు డిప్యుటేషన్‌పై సిబ్బందిని తీసుకోవాలి అనే అంశాలపై స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీతోపాటు ఔటర్ రింగ్ రోడ్డు వరకు 2వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో హైడ్రా కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుందని, పని విభజనకు వీలుగా నగరంలో ఇప్పుడున్న జోన్ల తరహాలో భౌగోళిక పరిధిని నిర్ణయించాలని ఆదేశించారు.

### హైడ్రాకు ప్రత్యేక బడ్జెట్..

హైడ్రాకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోగా ముసాయిదా తయారు చేయాలన్నారు. హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మునిసిపల్ విభాగాల మధ్య సమన్వయం ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. అనధికారిక హోర్డింగుల తొలగింపు, అపరాధ రుసుము వసూలు బాధ్యతలను జీహెచ్ఎంసీ నుంచి హైడ్రాకు బదలాయించాలని ఆదేశించారు. చెరువుల ఆక్రమణల విషయంలో నిబంధనలు కఠినంగా ఉండేలా అధ్యయనం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఎస్ శాంతికుమారి, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జీహెచ్ఎంపీ ఈవీడీఎం కమిషన్ రంగనాథ్, సీఎంవో ముఖ్యకార్యదర్శి శేషాద్రి, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, పురపాలక శాఖ అధికారులు పాల్గొన్నారు.



హైడ్రాపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ శాంతి కుమారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తదితరులు

## కలెక్టర్లు కదలాలి!

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి నెలా 5వ తేదీలోగా 'టూర్ డైరీ' రూపంలో సీఎస్‌కు నివేదిక పంపాలని ఆదేశించింది. ఈ పర్యటనల వల్ల గ్రామీణ సమూహాలకు అందుతున్న సంక్షేమం ద్విగుణీకృతం అవుతుందని, ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని పేర్కొంది. కలెక్టర్ల పనితీరును అంచనా వేసే సందర్భంలో వారి క్షేత్ర స్థాయి పర్యటనలు, నిబద్ధత వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపింది. దీని ఆధారంగా రివార్డులు, పనిష్మెంట్లు ఉంటాయని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లకు అంతర్గత ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి ముఖ్యంగా 10 ప్రధాన అంశాలను పరిశీలించాలని ఈ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

**ఆరోగ్యం:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, జిల్లా ఆస్పత్రుల పనితీరును తనిఖీ చేయాలి. ప్రజలకు ఆరోగ్య సేవలు ఎలా అందుతున్నాయి? వంటి వివరాలను పరిశీలించాలి.

**విద్య:** పాఠశాలలను తనిఖీ చేసి.. విద్యార్థులు ఏ మేరకు నేర్చుకుంటున్నారు? ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారా? మధ్యాహ్న భోజనంఎలా ఉంది? వంటివి అంచనా వేయాలి. దరిదాపుల్లోని హాస్టళ్లను కూడా తనిఖీ చేయాలి.

**నీటి సరఫరా, పారిశుధ్యం:** సురక్షిత నీరు ప్రజలకు అందుబాటులో ఉందా? పారిశుద్ధ్య నిర్వహణ ఎలా ఉంది? మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించాలి.

**వ్యవసాయం:** విత్తనాలు, ఎరువుల సరఫరాను తనిఖీ చేయాలి.

**ప్రజా పంపిణీ వ్యవస్థ:** లబ్ధిదారులకు బియ్యం, సరుకులు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అన్నది పరిశీలించాలి.

**గృహనిర్మాణ పథకాలు:** ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ పథకాల కింద ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల నాణ్యత, నిర్మాణ దశలను తనిఖీ చేయాలి.

**రోడ్లు, మౌలిక సదుపాయాలు:** రోడ్ల పరిస్థితి, ప్రజా రవాణా, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధిని సమీక్షించాలి.

**సాంఘిక సంక్షేమం:** వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పింఛన్ల వంటి సాంఘిక సంక్షేమ కార్యక్రమాల అమలుతీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి.

**మునిసిపాలిటీలు:** పురపాలక సంస్థల పరిధిలో పైన చెప్పిన అన్ని కార్యక్రమాలు, పథకాలు అమలవుతున్నాయా లేదా చూడాలి. ముఖ్యంగా పారిశుద్ధ్యం, నీటి సరఫరా, టౌన్ ప్లానింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

**మహిళా శిశు సంక్షేమం:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలు, శిశువులకు అందుతున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను తనిఖీ చేయాలి.

### ఆకస్మిక తనిఖీలు జరపాలి

ఆకస్మిక తనిఖీల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలను కలెక్టర్లు అంచనా వేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఈ నెల 2న అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. కలెక్టర్లు క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లేలా చూడాలంటూ ముఖ్యకార్యదర్శులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే సీఎస్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

## త్వరలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ఎల్పీ విలీనం

▸▸ కేటీఆర్ వల్లే ఆ పార్టీ భ్రష్టు పట్టింది.. ఎమ్మెల్యేలను పురుగుల్లా చూశారు

▸▸ ప్రాంతీయ పార్టీల్లో టీడీపీ ఆదర్శం.. ఆ మర్యాదను చూసి నేర్చుకోవాలి: దానం



హిమాయత్‌నగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ శాసనసభాపక్షం (బీఆర్ఎస్ఎల్పీ) త్వరలో కాంగ్రెస్‌లో విలీనం కావడం ఖాయమంటూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌లో మిగిలేది ఆ నలుగురు ఎమ్మెల్యేలేనని, విగతా వాళ్లంతా కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని జోస్యం చెప్పారు. "బీఆర్ఎస్‌లో గతం నుంచీ ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ లేదు. పదిమందిదాకా ఎమ్మెల్యేలతో మాట్లాడా. వారంతా అసంతృప్తితో ఉన్నారు. ఆత్మగౌరవంతో బతకొచ్చని, కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. గతంలో కూడా ఇదే విషయం చెప్పా" అని దానం వ్యాఖ్యానించారు. శుక్రవారం హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కారులో రూ.వేల కోట్ల అభివృద్ధిని ముగ్గురు నలుగురు మంత్రుల నియోజకవర్గాల్లోనే చేసుకున్నారని, నచ్చనివారిపై వివక్ష చూపారని అన్నారు. టీడీపీలో ఎమ్మెల్యేలకు ఉండే మర్యాద వేరని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా అండగా నిలిచి మనోధైర్యం ఇవ్వడానికి అక్కడ ఒక వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. కేటీఆర్ వల్లే బీఆర్ఎస్ భ్రష్టు పట్టి పోతోందన్నారు. ఎమ్మెల్యేలను పురుగులు, పూచిక పుల్ల మాదిరిగా చూశారని.. సీఎంను కలవాలంటే కేటీఆర్, ఆయన అనుచరుల అనుమతి తీసుకోవాల్సి వచ్చేదన్నారు.'గుండు శ్రీధర్ అనే బినామీ రూ.వేల కోట్లు ఎలా సంపాదించాడు? సత్యం రామలింగ రాజు కుమారుడు తేజ రాజు ఎలా మళ్లీ సంపాదించాడు? రాజేష్ రాజు ఎలా సంపాదించాడు? అన్నీ బయటకు తీస్తున్నా. రూ.వేల కోట్ల విలువైన వందల ఎకరాల ప్రభుత్వ భూములను కేటీఆర్ కోటరీ, స్నేహితులు, అనుచర వర్గం ఆక్రమించుకున్నారు. అన్నీ తప్పకుండా బయటపెడతా" అని దానం వ్యాఖ్యానించారు.

## 'దానం'పై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించండి

▸▸ హైకోర్టులో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి పిటిషన్

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ బీజేపీకి చెందిన నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచి ఆ పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఉల్లంఘించినట్లు అన్ని ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయనపై అనర్హత పిటిషన్ సమర్పించేందుకు వెళ్లగా స్పీకర్ అందుబాటులో లేరని తెలిపారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

▸▸ సీఎం రేవంత్ సమక్షంలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే

▸▸ కాంగ్రెస్‌లో 8కి చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య

▸▸ నేడు చేరనున్న ఎమ్మెల్యే గాంధీ

హైదరాబాద్/మియాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. ఊహించినట్లుగానే రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.. కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో శుక్రవారంతన అనుచరులతో కలిసి హస్తం పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ముందే సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసిన ప్రకాష్‌గౌడ్.. అప్పుడే కాంగ్రెస్‌లో చేరాలని భావించారు. అయితే అప్పుడున్న పరిస్థితుల్లో స్థానికంగా తన అనుచరగణం నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో వెనక్కి తగ్గారు. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాకపోవడం, పార్టీ మరింత బలహీనపడడంతో ప్రకాష్‌గౌడ్ పునరాలోచనలో పడ్డారు. మరోమారు తన అనుచరులతో సంప్రదింపులు జరిపి కాంగ్రెస్‌లో చేరాలన్న నిర్ణయానికి వచ్చారు. శుక్రవారం ఉదయం తిరుమల వెంకటేశ్వరుడిని దర్శించుకొని.. సాయంత్రానికి హైదరాబాద్‌కు చేరుకుని కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుంచి ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం కాగా, ప్రకాష్‌గౌడ్ చేరిక పూర్తయింది. ఇక శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ.. కాంగ్రెస్‌లో చేరనున్నారు. మిగిలిన నలుగురు కూడా ఈ వారం లోపే చేరనున్నట్లు వర్గాలు తెలిపాయి. ముహూర్తాలు చూసుకుని చేరేందుకు ఎమ్మెల్యేలు ఆసక్తి చూపుతుండడంతో ఒక్కొక్కరుగా చేరికలు జరుగుతున్నట్లు పేర్కొన్నాయి. అయితే వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ శాసనసభాపక్షంలో విలీనం చేసుకునే వ్యూహంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. అందుకు అనుగుణంగా కసరత్తు కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రకాష్‌గౌడ్ చేరికతో ఇప్పటిదాకా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల సంఖ్య 8కి చేరింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి సేఫ్‌గా ల్యాండ్ అవ్వాలంటే.. మూడింట రెండొంతుల మంది శాసనసభాపక్షంగా ఏర్పడి సీఎల్పీలో విలీనం కావాల్సి ఉంటుంది. ఇందుకోసం 26కు తగ్గకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక అవసరం. దీంతో ఇంకా 18 మందిని చేర్చుకోవాల్సి ఉంటుందని, ఆ వెంటనే ఎమ్మెల్యేల విలీన ప్రక్రియ జరుగుతుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

### నేడు హస్తం గూటికి అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఆయనతోపాటు పలువురు కార్పొరేటర్లు హస్తం తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన అనుచరులు, ముఖ్యనాయకులు, కార్పొరేటర్లతో సమావేశమై ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది. కాగా, శేరిలింగంపల్లి నుంచి గాంధీ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన గాంధీ.. ఆ తరువాత బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో, ఇటీవల 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున వరుసగా రెండుసార్లు విజయం సాధించారు.

## బీఆర్ఎస్‌ను అంతం చేయడం కాంగ్రెస్‌వల్ల కాదు: శ్రీనివాస్‌గౌడ్

ఒక్కసారి ఓడిపోయినంత మాత్రాన బీఆర్ఎస్ పని అయిపోయిందని ప్రచారం చేయడం తగదని, తమ పార్టీని అంతం చేయడం కాంగ్రెస్ వల్ల కాదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు మెతుకు ఆనంద్, పి.శశిధర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయ పరిజ్ఞానం లేనివారే.. బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా దక్కలేదంటూ విమర్శలు చేస్తున్నారని, అసలు మోదీ కావాలా..? వద్దా..? అనే ప్రాతిపదికన లోక్‌సభ ఎన్నికలు జరిగాయని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీకే కాదు.. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 14 రాజకీయ పార్టీలకూ ఎంపీ సీట్లు దక్కలేదని పేర్కొన్నారు. పార్టీ మారుతున్నవారు తమ పదవులకు రాజీనామా చేసి.. మరోసారి గెలవాని, బీఆర్ఎస్ నాయకత్వంపై విమర్శలు చేయడం తగదని ఆయన అన్నారు.

## ఉచిత చేపపిల్లల పంపిణీకి 114 కోట్లు!

▸▸ టెండరు బిడ్డింగ్‌ల దాఖలుకు ఈనెల 23 దాకా గడువు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26వేల నీటి వనరుల్లో.. 86 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలు పోయాలని నిర్ణయించింది. చేపల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించటానికి, మత్స్యకారుల కుటుంబాలకు చేయూతనివ్వటానికి ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించేందుకు ఆదేశాలిచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఈ పథకం అమలుచేయటానికి రూ.114 కోట్ల నిధులతో ప్రతిపాదనలు రూపొందించారు. చెరువులు, జలాశయాలు అన్నీకలిపి రాష్ట్రవ్యాప్తంగా 26 వేల వరకు ఉన్నాయి. మరింత వర్షాలు కురిసి, చెరువులు, ప్రాజెక్టులు నిండిన తర్వాత ఈ నీటివనరుల్లో చేప, రొయ్య పిల్లలు పోసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక.. ఈనెల పదో తేదీన టెండరు నోటిఫికేషన్ జారీచేశారు. టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకోవటానికి ఈ నెల 20 తేదీ మధ్యాహ్నం వరకు సమయం ఇచ్చారు. శుక్రవారం ప్రీ బిడ్డింగ్ సమావేశాన్ని మత్స్యశాఖ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. టెండరు బిడ్ల దాఖలుకు ఈనెల 15వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 23వ తేదీ సాయంత్రం 3గంటల వరకు గడువు ఇచ్చారు. 23వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు టెండర్ల స్వీకరణ ముగించి, తర్వాత అరగంటకు బిడ్డింగ్‌లు తెరుస్తారు. చేపపిల్లల టెండర్లను ఈ- ప్రొక్యూర్మెంట్ ప్లాట్ ఫామ్‌పై నిర్వహిస్తారు. టెండర్ల నిర్వహణ కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాలవారీగా చేపట్టనున్నారు. కాగా రాష్ట్ర మత్స్య శాఖ డైరెక్టరేట్‌లో చేప పిల్లల ప్రతిపాదిత ధరను కూడా ఖరారుచేశారు. 35-40మి.మీ సైజులో ఉన్న చేప పిల్లలు 61పైసల చొప్పున, 80-100మి.మీ సైజులో ఉన్న చేపపిల్లలకు రూ.1.63 చొప్పున, రొయ్య పిల్లలకు రూ.2.34చొప్పున ధరను ప్రతిపాదించారు. రొయ్య పిల్లల టెండర్లను రాష్ట్రం యూనిట్‌గా మత్స్య శాఖ డైరెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కాగా నిరుడు చేప పిల్లలు సరఫరా తాలూకు బకాయిలను అప్పటి కేసీఆర్ ప్రభుత్వం చెల్లించలేదు. 2023-24బడ్జెట్‌లో ఉచిత చేపపిల్లల పంపిణీకి నిధులు కేటాయించినప్పటికీ, సమకూర్చలేదు. దీంతో రూ.96.52 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

## ఎస్సీ గురుకులాల్లో భోజన కాంట్రాక్ట్.. మహిళా స్వయం సహాయక సంఘాలకు

▸▸ అడ్మిషన్ల కోసం దళారులను ఆశ్రయించొద్దు

▸▸ త్వరలోనే ఎస్సీ గురుకుల పరిధిలో ఎంబీఏ కాలేజీ

▸▸ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి వర్షిణి

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల్లో భోజన, శానిటేషన్ కాంట్రాక్ట్‌లను మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మహిళా గ్రూపులు తమను సంప్రదిస్తే పనులను అప్పగిస్తామని గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు. పనులకు సంబంధించిన బిల్లులను కూడా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తున్నామని చెప్పారు. గురుకులాలకు సంబంధించిన పలు అంశాలపై ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గురుకులాల్లో శానిటేషన్ నిర్వహిస్తున్నామని.. ఇందుకోసం ప్రత్యేకంగా శానిటేషన్ రెస్క్యూ ఫోర్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక పాఠశాలలు, ఇంటర్ కాలేజీల్లో సీటు పొందినవారు వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యేందుకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లిస్తే.. మెరిట్ ప్రకారం బదిలీ చేస్తామని తెలిపారు. ప్రవేశాలు, బదిలీలకు దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. ఇక త్వరలోనే ఎస్సీ గురుకుల పరిధిలో ఎంబీఏ కాలేజీ కూడా రాబోతుందని, సూర్యాపేట జిల్లాలో ఏర్పాటు కాబోతుందని వెల్లడించారు. గురుకులాల్లో మెనూ అమలుకాకపోయినా, ఇతర సమస్యలు ఉన్నా పిల్లలు నేరుగా రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసేలా ప్రత్యేక ఫోన్ సదుపాయాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ఈ హెల్ప్‌లైన్ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా కొన్ని స్కూళ్లలో అమలు చేస్తున్నామని, త్వరలో అన్ని పాఠశాలల్లో తీసుకువస్తామన్నారు. ఇక ప్రపంచ స్థాయి చెస్ పోటీలకు భారతదేశం నుంచి మొత్తం 9 మంది ఎంపిక కాగా అందులో ఎస్సీ గురుకులం నుంచే నలుగురు ఎంపికయ్యారని అలుగు వర్షిణి తెలిపారు.

## అడిషనల్ చార్జ్‌షీట్‌లో తప్పులు లేవు

- మద్యం కుంభకోణం కేసులో సీబీఐ వాదన
- చార్జ్‌షీట్‌లో తప్పులు.. బెయిల్ ఇవ్వండి
- కోర్టులో కవిత తరపు న్యాయవాది వాదన

న్యూఢిల్లీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవిత పాత్రపై దాఖలు చేసిన అడిషనల్ చార్జ్‌షీట్‌లో తప్పులేమీ లేవని న్యాయస్థానానికి సీబీఐ తెలిపింది. ఈ కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పాత్రపై సీబీఐ అడిషనల్ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే, చార్జ్‌షీటే సరిగాలేదని, అందులో తప్పులు ఉన్నాయని, అందువల్ల తనకు బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేశారు. చార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశం, కవిత బెయిల్ పిటిషన్.. రెండింటిపైనా శుక్రవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది నితేష్ రాణా వాదనలు వినిపించారు. సీబీఐ చార్జ్‌షీట్‌లో తప్పులు ఉన్నాయని ఆరోపించారు. దీనిపై సీబీఐ న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. తప్పులు ఉన్నాయన్న వాదనలో వాస్తవం లేదని, నిబంధనల ప్రకారమే ఫైల్ చేశామని వెల్లడించారు. అయితే చార్జ్‌షీట్‌లో తప్పులు, కవిత బెయిల్ పిటిషన్ అంశాలపై సమగ్ర విచారణ జరిగే వరకూ చార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవద్దని నితేష్ రాణా కోరారు. దీనికి సీబీఐ తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. కవిత బెయిల్ పిటిషన్‌కు, చార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి సంబంధం లేదని వాదించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం.. కవిత బెయిల్ పిటిషన్, చార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై ఈ నెల 22న విచారణ చేపడతామని స్పష్టం చేసింది.

## ఢిల్లీ టూర్లు.. మా ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ తిరగడమేనా?

- ప్రజాసమస్యలపై సీఎం రేవంత్‌కు పట్టింపులేదు
- ఇది అసమర్థ ప్రభుత్వం: కేటీఆర్

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): "షటిల్ సర్వీస్‌లాగా.. ఢిల్లీటూర్లు., మా ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ తిరుగుతూ.. వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ప్రజా సమస్యలపై ఏమాత్రం పట్టింపు లేదు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. నిర్మాణం పూర్తయిన గోపన్‌పల్లి ఫ్లై ఓవర్‌ను ప్రారంభించేందుకు కూడా సీఎంకు సమయం లేకుండా పోయిందని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు. ప్రజాసమస్యలపై అవగాహనలేని అసమర్థ ప్రభుత్వం, నాయకత్వం ఉన్నప్పుడే ఇటువంటి పరిస్థితి వస్తుందన్నారు. వెంటనే ఆ ఫ్లై ఓవర్‌ను సంబంధిత అధికారులు ప్రారంభించాలని, లేదంటే ప్రజలే దాన్ని ప్రారంభించుకునే పరిస్థితి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ హెచ్చరించారు.

## గుండెపోటుతో బస్సులోనే డ్రైవర్ మృతి

- అస్వస్థతతోనే 11 కి.మీ దూరం డ్రైవింగ్
- జహీరాబాద్ వద్ద నిలిపి బస్సు వెనక సీట్లోకి..
- అక్కడ పడుకునే ప్రయత్నం చేస్తూ కిందపడి మృతి

జహీరాబాద్, జూలై 12: గుండెనొప్పితో బాధపడుతూనే ఆ డ్రైవర్, ఆర్టీసీ బస్సును 11 కి.మీ మేర సురక్షితంగా నడిపాడు. అలసటగా ఉందంటూ బస్సును ఓ చోట ఆపి, వెనుక సీట్లోకి వెళ్లి పడుకునే ప్రయత్నంలో తుది శ్వాస విడిచాడు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డిపో ప్రాంగణంలో ఈ ఘటన జరిగింది. మృతుడు కర్ణాటకలోని బస్వకల్యాణ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ మహదేవ్ (45). ఆ ఆర్టీసీ బస్సును మహదేవ్ గురువారం సాయంత్రం జహీరాబాద్ శివారు సత్వార్‌లోని ఓ దాబా వద్ద భోజనం కోసం ఆపాడు. ఆ సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా.. వారిలో కొందరు దాబాలో భోజనం చేశారు. డ్రైవర్ మహదేవ్ కూడా భోజనం చేస్తుండగానే ఛాతీలో నొప్పిగా ఉందంటూ ప్రయాణికులకు చెప్పాడు. ఆ తర్వాత ప్రయాణికులను ఎక్కించుకొని 11 కిలోమీటర్ల దూరంలో ఉన్న జహీరాబాద్‌కు సురక్షితంగా చేర్చాడు. తర్వాత మహదేవ్ తనకు అలసటగా ఉందంటూ బస్సు వెనుక సీట్లోకి వచ్చి పడుకునే ప్రయత్నం చేస్తూ కిందపడి మృతిచెందాడు.

## ప్రేమ పేరుతో వేధింపులు.. బాలిక ఆత్మహత్య

సిద్దిపేట క్రైం, జూలై 12: ప్రేమ పేరుతో యువకుడి వేధింపులు తట్టుకోలేక ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. సిద్దిపేట పట్టణంలోని కాళ్లకుంట కాలనీలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. కాళ్లకుంట కాలనీకి చెందిన చిగురు కావ్య (17) పట్టణంలోని ప్రతిభ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్‌పల్లికి చెందిన కొత్తపల్లి తేజ కొద్దిరోజులుగా ప్రేమించాలంటూ కావ్య వెంటపడుతున్నాడు. కాలేజీకి వెళ్లి వచ్చే సమయంలో వెంబడిస్తూ ఇబ్బందులకు గురి చేసేవాడు. ఈ క్రమంలోనే అతడి వేధింపులను భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో కావ్య ఫ్యాన్‌కు ఉరివేసుకొని ప్రాణం తీసుకుంది. కావ్య తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## జీతాలివ్వడం లేదనే ఆగ్రహంతో సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవో కిడ్నాప్

- సంస్థ ఉద్యోగుల నిర్వాకం.. 8మంది అరెస్టు

బంజారాహిల్స్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదనే ఆగ్రహంతో సంస్థ ఉద్యోగుల్లో కొందరు తాము పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవోనే కిడ్నాప్ చేశారు. జూబ్లీహిల్స్‌లో ఈ ఘటన జరిగింది. అపహరణకు గురైంది ఇన్ ఆర్బిట్ మాల్ ఎదురుగా ఉన్న టీ హబ్‌లో గిగిలియాస్ సంస్థ సీఈవో రవిచంద్రారెడ్డి. ఆయన జూబ్లీహిల్స్‌లోని హుడా కాలనీలో నివసిస్తున్నారు. ఈ నెల 10న రాత్రి ఇంట్లో స్నేహితుడు మోహన్, తల్లి మాధవితో కలిసి రవిచంద్రారెడ్డి డిన్నర్ చేస్తుండగా ఆయన ఇంటిముందు ఓ కారు ఆగింది. అందులోంచి దిగిన కొందరు నేరుగా ఇంట్లోకి ప్రవేశించారు. రవిచంద్రారెడ్డి, మోహన్‌ను బలవంతంగా తమతో తీసుకుపోయారు. రవిచంద్రారెడ్డి కారును కూడా తీసుకువెళ్లారు. మాధవిని ఇంట్లోనే నిర్బంధించారు. మరుసటి రోజు మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటపడ్డ మాధవి, ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ సీసీ ఫుటేజీ ద్వారా నిందితుల కార్లు బెంగళూరు హైవే మీదుగా వెళ్లినట్లు గుర్తించారు. రవిచంద్రారెడ్డి, మోహన్‌లను నాగర్‌కర్నూల్‌లోని ఓ హోటల్‌లో బంధించినట్లు తెలియడంతో పోలీసులు అక్కడకు వెళ్లి ఇద్దరినీ సురక్షితంగా రక్షించారు. రవిచంద్రారెడ్డిని అపహరించింది ఆయన సంస్థల్లో పనిచేస్తున్న 8మంది ఉద్యోగులని గుర్తించి.. వారిని అదుపులోకి తీసుకున్నారు. రవిచంద్రారెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇస్తానని 1500 మందిని నియమించుకున్నారని, అందరికీ శిక్షణ ఇచ్చి మూడు నెలలుగా ఉద్యోగం చేయించుకున్నారని, జీతాలు ఇవ్వలేదని నిందితులు ఆరోపించినట్లు తెలిసింది.

## పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి సహకరించండి

- బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను పట్టించుకోండి: హరీశ్

హైదరాబాద్, జూలై12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. నిరుపేద బ్రాహ్మణుల అభ్యున్నతికి, ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుక్రవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ప్రస్తుత ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు. ప్రభుత్వం స్పందించి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు గతంలో మాదిరిగా ఏటా రూ.100 కోట్లు కేటాయించాలని, పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

## దేవాదాయ శాఖలో ఈవోలకు పదోన్నతులు

దేవాదాయ శాఖలో ముగ్గురు గ్రేడ్-2 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)లకు గ్రేడ్-1 ఈవోలుగా, 8 మంది గ్రేడ్-3 ఈవోలకు గ్రేడ్-2 ఈవోలుగా పదోన్నతి దక్కింది. సీనియారిటీ జాబితా పూర్తి కాగానే త్వరలో మరికొందరు ఈవోలకు పదోన్నతి లభించనుంది. ఈవోలకు పదోన్నతిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించినందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## రాయదుర్గంలో 'టి-స్క్వేర్'

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి గాంచిన న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ తరహాలో.. రాష్ట్రంలోనూ అలాంటి ఒక ఐకానిక్ ప్లాజాను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) సిద్ధమైంది. రాయదుర్గంలో 30 ఎకరాల్లో ఏర్పాటు చేసిన నాలెడ్జ్ సిటీ సమీపంలో.. 'టి-స్క్వేర్' పేరిట దీన్ని నిర్మించాలని ప్రతిపాదించి, ఈమేరకు టెండర్లు ఆహ్వానించింది. ఆసక్తి ఉన్న ఏజెన్సీలు బిడ్ దాఖలు చేయడానికి ఆగస్టు 9 వరకూ అవకాశం కల్పించింది. క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్ (క్యూసీబీఎస్) పద్ధతిలో నిర్మాణ సంస్థను ఎంపిక చేయనున్నట్టు టీజీఐఐసీ పేర్కొంది. రోజువారీ పనులతో సతమతమయ్యే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని, వినోదాన్ని అందించేలా ఈ 'టి-స్క్వేర్' నిర్మాణం, ఏర్పాట్లు ఉండాలని నిర్ణయించారు. నగరంలో ప్రధాన పర్యాటక కేంద్రంగా దీన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రముఖుల పుట్టినరోజుల వేడుకలు, సినిమాల అప్‌డేట్లు, అవార్డులు, చారిత్రక విశేషాల వంటివాటిని న్యూయార్క్‌లోని ప్రధాన వాణిజ్య కూడలి అయిన టైమ్స్ స్క్వేర్‌లో ప్రదర్శిస్తుంటారు. రాయదుర్గంలోని 'టి-స్క్వేర్' నిర్మాణం పూర్తయితే.. అలాంటి ప్రదర్శనలు హైదరాబాద్‌లోనూ చూసే అవకాశం ఉంటుంది.

## వరుణుడి భక్తి అద్దం పట్టి..



గోపురం సహా ఆలయం తనను తాను అద్దంలో చూసుకున్నట్టు లేదూ! యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి సన్నిధిలోనిదీ దృశ్యం. చినుకులతో ఉత్తరంవైపు తిరువీధిలో నీళ్లు నిలిస్తే నిలిచాయి గానీ అద్భుత దృశ్యాన్నే ఆవిష్కరించాడు వరుణదేవుడు! శుక్రవారం సాయంత్రం ఈ సుందర దృశ్యం భక్తులను కట్టిపడేసింది. - భువనగిరి అర్బన్

# రాష్ట్రంలో నిస్సిగ్గుగా ఫిరాయింపులు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర పదాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణ, స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ సమావేశంలో చర్చించారు. బీజేపీ సభ్యత్వం, సంస్థాగత ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల ఫలితాలపైనా చర్చ జరిగింది. సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విచిత్ర రాజకీయ పరిస్థితి కొనసాగుతోందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని.. ఆ రెండు పార్టీల డీఎన్ఏ ఒక్కటేనని, కవలపిల్లలని వ్యాఖ్యానించారు. గాంధీభవన్, తెలంగాణ భవన్ మధ్య తేడా లేదన్నారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నాడు కేసీఆర్ కూటమి పార్టీలకు నిధులు పంపిస్తే, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి సూట్‌కేసులు పంపిస్తోందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరితే, ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. నిండు సభలో 'జైపాలస్తీనా' అని నినాదం చేసిన ఒవైసీకి కొమ్ముకాస్తున్నందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు సిగ్గుండాలన్నారు. తాము రాష్ట్రంలో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయం అని ప్రజలు తీర్పు ఇచ్చారని తెలిపారు. త్వరలో సభ్యత్వ నమోదుకు సిద్ధం కావాలని కిషన్‌రెడ్డి పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.

### దమ్ముంటే భద్రత లేకుండా ఓయూకి వెళ్లండి..

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం అంటువ్యాధిలా వ్యాపిస్తోందని ఆరోపించిన కాంగ్రెస్ నేత రాహుల్, దమ్ముంటే ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)కి భద్రత లేకుండా వెళ్లాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్ సవాల్ చేశారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆరే తన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి పంపిస్తున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ అధికారంలోకి వస్తే తమకు పుట్టగతులు ఉండవని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గుర్తించారని.. అందుకే కేసీఆర్ తన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి పంపిస్తున్నారని చెప్పారు. కేంద్రంలో వరసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీని అభినందిస్తూ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని 8 స్థానాల్లో గెలిపించినందుకు రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తూ సంజయ్ 'సెల్యూట్ తెలంగాణ' తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 'మీరు కష్టపడి మమ్మల్ని గెలిపించారు. ఇక మిమ్మల్ని ప్రజాప్రతినిధులుగా చేయడమే మా లక్ష్యం' అని పార్టీ నాయకులనుద్దేశించి సంజయ్ వ్యాఖ్యానించడంతో సభలో హర్షధ్వానాలు చేశారు. ఈ తీర్మానాన్ని మహబూబ్‌నగర్ ఎంపీ, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ బలపరిచారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనతి కాలంలోనే నిరుద్యోగ యువత విశ్వాసాన్ని కోల్పోయిందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కాంట్రాక్టర్లు, సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రావడం లేదని.. సీఎం, ఆర్థిక మంత్రి చెబితేనే బిల్లులు ఇస్తామని అధికారులు అంటున్నారని తెలిపారు. 8 శాతం డబ్బులు ముందు ఇస్తేనే బిల్లులు మంజూరు చేస్తున్నారనిచెప్పారు. ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల నుంచి ట్రిపుల్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారన్నారు. అందుకే కాలేజీలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

### సామాన్య కార్యకర్తే సీఎం: ప్రధాన్

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సామాన్య కార్యకర్త సీఎం అవుతారని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణలో బీజేపీ ముఖ్యమంత్రి ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ మూడు నుంచి రెండో స్థానానికి చేరిందని, ఇక నంబర్ వన్ స్థానమే లక్ష్యమని చెప్పారు. పార్టీ నాయకులంతా కష్టపడి 2028లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. 35 వేల పోలింగ్ బూత్‌లను పటిష్ఠం చేయాలని, యువతను పార్టీలో చేర్పించాలని సూచించారు. పార్టీలో పాత, కొత్త లేదని.. ఎంపీ ఈటల రాజేందర్ పాత నేత అయిపోయారని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 13 రాష్ట్రాల్లో ఒక్క ఎంపీ కూడా లేరన్నారు. మిత్ర పక్షాలు దూరమైతే కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా వచ్చేవి కాదని చెప్పారు.

## మేడిగడ్డలో పరీక్షలకు అంతరాయం

- ప్రాణహితకు వరదలతో తీవ్ర ఆటంకం
- నిపుణులతో నీటి పారుదల శాఖ భేటీ
- తదుపరి చేపట్టాల్సిన చర్యలపై చర్చలు
- ఎన్డీఎస్ఏ నిపుణులను కలవాలని నిర్ణయం

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ వద్ద జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలు (ఇన్వెస్టిగేషన్లు) అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రాణహితకు వరద క్రమేణా పెరుగుతుండటంతో పరీక్షలను నిపుణుల కమిటీ నిలిపివేసింది. మరోవైపు, జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్డీఎస్ఏ) ఇచ్చిన మధ్యంతర నివేదిక మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద చేపట్టిన పనులపై శుక్రవారం జలసౌధలో నిర్మాణ సంస్థలు, పరీక్షలు చేసే ఏజెన్సీల ప్రతినిధులతో ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా నీటి పారుదలశాఖ ఈఎన్సీ బి.నాగేందర్‌రావు మధ్యంతర నివేదిక అమలు పురోగతిని వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరింత నష్టం జరగకుండా ఎన్డీఎస్ఏ సూచించిన అత్యవసర మరమ్మతులను పూర్తి చేశామని వెల్లడించారు. మేడిగడ్డలో జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు ఎక్కడిదాకా వచ్చాయని కమిటీ ఆరా తీయగా.. పరీక్షల కోసం బోర్‌హోల్స్ వేస్తుండగా ఇసుకతోపాటు నీరు బయటికి వస్తుందని ఆయా ఏజెన్సీల ప్రతినిధులు వివరించారు. ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం పూర్తిస్థాయిలో బోర్‌హోల్స్ వేయలేకపోయామని నివేదించారు. పరీక్షల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు ఎలా అధిగమించాలన్న అంశంపై చర్చించడానికి వచ్చే వారం ఢిల్లీకి వెళ్లి ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీతో సమావేశం కావాలని నీటి పారుదల శాఖ అధికారుల బృందం నిర్ణయించింది. అన్నారం, సుందిళ్లలో నీటిని నిల్వ చేయాలా? వద్దా? అనే అంశంపై ఎన్డీఎస్ఏ అభిప్రాయం తీసుకోనుంది. ఈ రెండు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసి, పంపింగ్ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఎన్డీఎస్ఏ అనుమతినిస్తే ప్రాణహితకు వరదలు వచ్చే సమయంలో కన్నెపల్లి(మేడిగడ్డ) పంప్‌హౌస్ నుంచి అన్నారంలోకి నీటిని ఎత్తిపోయాలని యోచిస్తోంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి ఇవ్వాలి

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసు కూడా.. 'విద్యుత్తు'పై దర్యాప్తును వేగిరం చేయాలి

- రుణమాఫీని వెంటనే అమలు చేయాలి
- 15 అంశాలతో బీజేపీ రాజకీయ తీర్మానం

హైదరాబాద్/రంగారెడ్డి అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, ఫోన్ ట్యాపింగ్ కేసులను తక్షణమే సీబీఐకి అప్పగించాలని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యుత్తు కొనుగోలు అంశంలో జ్యుడీషియల్ కమిషన్ దర్యాప్తును వేగవంతం చేయాలని పేర్కొంది. రుణమాఫీ వెంటనే అమలు చేయాలంది. రైతుభరోసా కింద రైతులకు రూ.15 వేలు అందించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు 15 అంశాలతో రూపొందించిన రాజకీయ తీర్మానాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆమోదించింది. ఈ తీర్మానాన్ని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రవేశపెట్టగా, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్‌రావు బలపరిచారు. 'విద్యార్థి, యువ వికాసం గ్యారెంటీలను అమలు చేసి ప్రోత్సాహకం అందించాలి. శాంతి భద్రతలను కాపాడాలి. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలి. ధరణిని ప్రక్షాళన చేయాలి. ధాన్యం కొనుగోలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి. గొర్రెల స్కాంలో అవినీతిపరులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలి. ఇసుక, గ్రానైట్, డ్రగ్స్, లిక్కర్ మాఫియాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి. రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి. ఆయుష్మాన్ భారత్ అమలు చేయాలి. ఫీజు రీఇంబర్స్‌మెంటు నిధులు వెంటనే విడుదల చేయాలి' అని బీజేపీ తీర్మానంలో డిమాండ్ చేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

### హామీలపై రేవంత్‌ది రోజుకో మాట: ఏలేటి

సీఎం రేవంత్ ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా రోజుకో మాట చెబుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 7 నెలలు దాటుతున్నా రైతు భరోసా ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. ధరణిని ప్రక్షాళన చేస్తామని, అక్రమాలపై విచారణ చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. ఎందుకు జాప్యం చేస్తోందని నిలదీశారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై బీజేపీ ఎమ్మెల్యేలు సమావేశమై చర్చించారు.

### కేసీఆర్‌ను అరెస్టు చేయడానికి భయమెందుకు?: రఘునందన్

ట్యాపింగ్ కేసులో ఆధారాలుండగా కేసీఆర్‌ను అరెస్ట్ చేయడానికి రేవంత్ ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని మెదక్ ఎంపీ రఘునందన్ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై ప్రతిపక్షంలో ఉన్నపుడు సీబీఐ విచారణ జరిపించాలన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. ట్యాపింగ్ కేసులో సీబీఐ విచారణ జరపాలని కేంద్రానికి లేఖ రాసేందుకు ఎందుకు వెనకాడుతున్నారని ప్రశ్నించారు. విద్యుత్తు కొనుగోళ్లు, గొర్రెల పంపిణీలో అక్రమాలపై అసలు నిందితులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్ ట్యాక్స్, యూకే ట్యాక్స్ బీవీ ట్యాక్స్ పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసేలా కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. రాజకీయ వ్యభిచారానికి పాల్పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

# జగన్‌పై హత్యాయత్నం కేసు

- సీఐడీ, ఐబీ మాజీ చీఫ్‌లు సునీల్‌కుమార్, పీఎస్ఆర్‌పైనా
- రఘురామరాజు ఫిర్యాదుతో.. గుంటూరు పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్

గుంటూరు, జూలై 12: మాజీ ఎంపీ, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణంరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి హత్యాయత్నం చేశారన్న ఆరోపణలతో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతోపాటు అప్పటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్, నాటి నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులుపైనా హత్యాయత్నం కేసు నమోదైంది. గురువారం రాత్రి రఘురామరాజు మెయిల్ ద్వారా గుంటూరులోని నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు పంపగా.. దాని ప్రకారం 120బీ, 166, 167, 197, 307, 326, 465, 506(34) తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇందులో ఏ-1గా సునీల్‌కుమార్, ఏ-2గా పి.సీతారామాంజనేయులు, ఏ-3గా జగన్, ఏ-4గా అప్పటి సీఐడీ అదనపు ఎస్పీ కె విజయపాల్, ఏ-5గా నాటి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ ప్రభావతిలను పేర్కొన్నారు. మూడేళ్ల కిందట అప్పటి సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంతో రఘురామరాజుపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆయనను హైదరాబాద్‌లో సీఐడీ అధికారులు బలవంతంగా అరెస్టు చేసి గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. అప్పటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్, ఇంటెలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులు అక్కడకు వచ్చి తనపై హత్యాయత్నం చేయించారని రఘురామరాజు తాజాగా ఫిర్యాదు చేశారు. ఆ రోజు రాత్రి సీఐడీ కార్యాలయంలో తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని.. తనకు బైపాస్ సర్జరీ జరిగిందని చెప్పినా వినిపించుకోకుండా తన గుండెలపై కూర్చుని ఒత్తిడి పెంచారని.. లాఠీలతో కొట్టి చంపాలని ప్రయత్నించారని అందులో పేర్కొన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రబ్బరు బెల్టుతో, లాఠీలతో తనపై విచక్షణరహితంగా దాడి చేసి కొట్టారని తెలిపారు. మర్నాడు తనను వైద్య పరీక్షలకు జీజీహెచ్‌కు తరలించగా అప్పటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి పోలీసు అధికారుల సూచన మేరకు తప్పుడు సర్టిఫికెట్ జారీ చేశారని.. తన శరీరంపై ఎటువంటి దెబ్బలు లేవని ఆమె తప్పుడు నివేదిక అందించారని పేర్కొన్నారు. వైద్య పరీక్షల అనంతరం రఘురామను గుంటూరులోని సీఐడీ కోర్టులో హాజరుపరిచారు. పోలీసుల దెబ్బలకు నడవలేని స్థితిలో ఉన్న ఆయన కుంటుకుంటూ కోర్టులోకి వెళ్లారు. పోలీసులు తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, లాఠీలతో కుళ్లబొడిచారని మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశారు. మేజిస్ట్రేట్ ఆయన వాంగ్మూలం నమోదు చేసుకుని.. జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఉత్తర్వులిచ్చారు. అయితే ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించే పరీక్షలపై నమ్మకం లేదని.. తనకు ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించాలని కోరుతూ రఘురామ హైకోర్టును ఆశ్రయించారు. జీజీహెచ్‌లో వైద్య పరీక్షల నివేదికను స్థానిక కోర్టుతోపాటు తమకూ సీల్డ్ కవర్‌లో అందించాలని న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం రఘురామ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైదరాబాద్‌లోని ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని, వైద్య పరీక్షల నివేదికను సీల్డ్ కవర్లో తమ ముందుంచాలని సర్వోన్నత న్యాయస్థానంఆదేశించింది. మూడేళ్ల తర్వాత ఇప్పుడు జగన్‌తో పాటు ఇద్దరు ఐపీఎస్ అధికారులపై హత్యాయత్నం కేసు నమోదవడం సంచలనంగా మారింది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 13 జూలై 2024

# డీఎస్సీ(ఎస్‌జీటీ) మోడల్ ప్రశ్నలు


## మేథ్స్ కంటెంట్

1. ఒక క్రమ బహుభుజి యొక్క బాహ్య కోణ, అంతర కోణాల నిష్పత్తి 2 : 3 అయితే బహుభుజిలోని భుజాల సంఖ్య?
   1. 3 2. 4 3. 5 4. 6
2. సరళరేఖకు గల అంత్య బిందువుల సంఖ్య.
   1. 2 2. 4 3. అనంతరం 4. ఉండవు
3. రెండు కోణాలు తిర్యక్‌రేఖకు ఒకేవైపున ఉండి ఒకటి అంతర కోణం రెండవది బాహ్యకోణం ఆ కోణాలు అసన్న కోణాలు కానిచో అవి?
   1. అంతర కోణాలు 2. ఏక బాహ్య కోణాలు
   3. సదృశ కోణాలు 4. ఏకాంతర కోణాలు
4. రెండు వృత్త వ్యాసార్థాల మొత్తం 20మీ, వాటి భేదం 3.5మీ. అయితే వాటి మధ్య గల స్థల వైశాల్యం ఎంత?
   1. 44 చ.మీ. 2. 220 చ.మీ. 3. 616 చ.సెం.మీ. 4. 88 చ.మీ.
5. 11, 17, 24, 32, 38, 45 ______
   1. 50 2. 51 3. 52 4. 53
6. 8 మందికి 20 రోజులకు కావాల్సిన బియ్యం వెల రూ.480 అయితే 12మందికి 15 రోజులకు కావాల్సిన బియ్యం వెల?
   1. రూ.500 2. రూ.600 3. రూ.540 4. రూ.560
7. $(4X)^3 = (4^3)^3$ అయితే X విలువ
   1. $4^6$ 2. $4^9$ 3. $4^8$ 4. $4^7$
8. P= 3750, R= 18% చొప్పున ఎంతకాలంలో రూ.5100 మొత్తం అవుతుంది?
   1. 2 సంవత్సరాలు 2. 1 సంవత్సరం ఆరు నెలలు
   3. మూడు సంవత్సరాలు 4. 4 సంవత్సరాలు
9. గుణకార ప్రక్రియలో a యొక్క తత్సమము
   1. -a 2. 0 3. 1/a 4. ఇవేవీ కాదు
10. దీర్ఘ వృత్తానికి గల సౌష్టవాక్షాలు
    1. 1 2. 2 3. 3 4. లేవు
11. కింది వాటిలో స్వీకృతం కానిది?
    1. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు
    2. ఒక తలములోని రెండు దత్త బిందువులను కలిగి ఉంటూ ఒకే సరళరేఖ ఉంటుంది 3. భూమి గోళాకారంలో ఉంది
    4. త్రిభుజంలో 3 కోణాల మొత్తం 180 డిగ్రీలు
12. A, B, Cలు ఒక వ్యాపారాన్ని రూ.8000, రూ.6000, రూ.10,000లతో ప్రారంభించారు. B 3 నెలలు ముందు, C 2 నెలలు ముందు వ్యాపారం నుంచి విరమించుకున్నారు. సంవత్సరం తరవాత వచ్చిన మొత్తం లాభం 25000 అయితే A వాటా ఎంత?
    1. 5400 2. 9600 3. 10000 4. పైవేవీకాదు
13. $X + 1/X = 3$ అయితే $X^4 + 1/X^4$
    1. 49 2. 47 3. 9 4. 7
14. 1 నుంచి 10 వరకు సంఖ్యలతో ప్రతిదానితో నిశేషంగా భాగించే కనిష్ట సంఖ్య?
    1. 3576 2. 2856 3. 2520 4. 3680
15. 70984లో 0 యొక్క స్థాన విలువ?
    1. 1000 2. 10,000 3. 0 4. 1
16. $[\{17-(5-\overline{6-5})\}+1]-6$ విలువ?
    1. 16 2. 24 3. 8 4. 12
17. a:b= 1/4:2/3:, b:c= 3/5:2/7 అయితే a:b:c
    1. 63:168:80 2. 168:80:63 3. 80:63:168 4. ఏదీకాదు
18. ఒక వృత్త రేఖాచిత్రంలో దత్తాంశములోని అంశాల్లో ఆహారానికయ్యే ఖర్చును సూచించే కోణం 60 డిగ్రీలు. అతని మొత్తం సంపాదన రూ.18000 అయితే ఆహారానికి చేసే ఖర్చు.
    1. 2500 2. 3000 3. 3500 4. 4000

**సమాధానాలు**

1) 3 2) 4 3) 3 4) 2 5) 4 6) 3 7) 4 8) 1 9) 3 10) 2 11) 4 12) 2 13) 2 14) 3 15) 3 16) 3 17) 1 18) 2

## సైన్స్ కంటెంట్



1. అల్యూమినియం ఒక లోహమైనప్పటికీ...
   1. తాంతవ్యతా లక్షణాన్ని ప్రదర్శించదు
   2. రేకులుగా సాగే గుణాన్ని ప్రదర్శించదు
   3. అధిక సాంద్రత లక్షణాన్ని ప్రదర్శించదు
   4. ఉష్ణ, విద్యుత్ వాహకంగా పనిచేయదు.
2. నిజ ప్రతిబింబం ఏర్పడటానికి కారణం
   1. పరావర్తన కిరణాలు కేంద్రీకరణ చెందడం
   2. పరావర్తన కిరణాలు వికేంద్రీకరణ చెందడం
   3. పరావర్తన కిరణాలు సమాంతరంగా ప్రయాణించడం
   4. ఏ కాంతి కిరణాలు కవల్లనైనా
3. ఏ విలువ వద్ద ఫారన్‌హీట్, సెల్సియస్ మానాలు సమానం.
   1. 40 డిగ్రీలు 2. -60 డిగ్రీలు 3. +60 డిగ్రీలు 4. -40 డిగ్రీలు
4. టెలివిజన్ ప్రధానంగా ఏ సూత్రంపై ఆధారపడి పనిచేస్తుంది?
   1. కాంతి విద్యుత్ ఫలితం
   2. ధ్వని తరంగాలు విద్యుత్ తరంగాలుగా మారడం
   3. విద్యుత్ తరంగాలు అయస్కాంత తరంగాలుగా మారడం
   4. ధ్వని తరంగాలు అయస్కాంత తరంగాలుగా మారడం.
5. ఒక ఇంధనం యొక్క ఈ కింది లక్షణాలను పరిశీలించండి.
   ఎ) అత్యధిక కెలోరిఫిక్ విలువ బి) కాలుష్యాన్ని ఏర్పర్చదు
   సి) ద్రవ ఇంధనంగా పరిమిత వినియోగంలో ఉంది
   మొదలైన ప్రత్యేక లక్షణాలను కలిగి ఉన్న ఇంధనం?
   1. కిరోసిన్ 2. పెట్రోల్ 3. ఎల్‌పీజీ 4. హైడ్రోజన్
6. కింది వాటిలో వేరుగా ఉన్నది.
   1. అయస్కాంత బలం 2. కండర బలం
   3. స్థావర విద్యుత్ బలం 4. గురుత్వాకర్షణ బలం
7. శ్వాసక్రియ ద్వారా మనం విడుదల చేసిన గాలిలోని కార్బన్‌డైయాక్సైడ్ ఉనికిని గుర్తించడానికి ఉపయోగించే పదార్థం?
   1. సున్నపునీరు 2. నిమ్మరసం 3. సున్నపురాయి 4. పొడిసున్నం
8. మంట ఎప్పుడూ నిలువగా పైకి మండుతుంది. దానికి గల కారణాన్ని కింది వాటిలో గుర్తించండి.
   ఎ. మంట వల్ల ఏర్పడిన వాయువులు చల్లగా ఉండటం వల్ల
   బి. మంట వల్ల ఏర్పడిన వాయువులు వేడిగా ఉండటం వల్ల
   సి. వేడి వాయువులు తేలికగా ఉండి పైకి కదులుట వల్ల
   డి. మంట యొక్క ఒత్తి నిలువుగా పైకి ఉండుట వల్ల
   1. ఎ, బి మాత్రమే 2. బి, సి మాత్రమే
   3. సి, ఎ మాత్రమే 4. ఎ, బి, సి మాత్రమే
9. కింది వాటిలో ఫలిత బలం, శూన్యమయ్యే సందర్భం కానిది.
   1. వస్తువు విరామస్థానంలో ఉన్నప్పుడు
   2. వస్తువు సమచలనంలో ఉన్నప్పుడు
   3. వస్తువు అసమచలనంలో ఉన్నప్పుడు
   4. పై మూడు సందర్భాల్లో
10. సూక్ష్మ జీవశాస్త్రం వేటిని గురించి తెలుపుతుంది.
    1. శైవలాలు - శిలీంధ్రాలు 2. వైరస్‌లు - బ్యాక్టీరియాలు
    3. ప్రోటోజోవాలు 4. పైవన్నీ
11. మనుషుల్లో ముష్కాలు, స్త్రీ బీజకోశాల నుంచి పురుష బీజకణాలు, స్త్రీ బీజ కణాల సంఖ్య.
    1. ఒకటి మరియు వేలల్లో
    2. వేలల్లో మరియు ఒకటి
    3. మిలియన్లు మరియు ఒకటి
    4. ఒకటి మరియు మిలియన్లు
12. చనిపోయిన ఎర్రరక్త కణాల స్థానంలో కొత్త ఎర్రరక్త కణాలు ఏర్పడటానికి కారణం.
    1. సమ విభజన
    2. క్షయ కరణ విభజన
    3. సమ, క్షయ కరణ విభజన
    4. ఏదీకాదు
13. సూక్ష్మజీవులను మరిగించడం ద్వారా చంపవచ్చని ప్రయోగాత్మకంగా నిరూపించినవారు.
    1. లూయిస్ పాశ్చర్ 2. అడ్వర్డ్ జెన్నర్
    3. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ 4. లజారో స్పాల్లాన్‌జని
14. పట్టు నూలుకు రంగు వేయడం..............
    1. నిట్టింగ్ తరవాత 2. బ్లీచింగ్‌కు తరవాత
    3. రోలింగ్ తరవాత 4. బ్లీచింగ్ తరవాత
15. కింది వాటిలో సరైనది కానిది.
    1. పరీక్షించడానికి వీలున్న సాధ్యమయ్యే సమాధానమే పరికల్పన
    2. పరికల్పన ఎల్లప్పుడూ నిజమవుతుంది
    3. ప్రక్రియ నైపుణ్యాలను ఉపయోగించి ప్రయోగాలు నిర్వహిస్తుంటారు
    4. ఒక ప్రయోగంలో చరరాశులు నియంత్రించబడతాయి
16. కింది వాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
    ఎ. స్వైన్‌ఫ్లూ వైరస్ వల్ల సంభవిస్తుంది. దోమల వల్ల వ్యాప్తి చెందుతుంది
    బి. స్వైన్‌ఫ్లూ బ్యాక్టీరియా వల్ల సంభవిస్తుంది. గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది
    సి. స్వైన్‌ఫ్లూ బ్యాక్టీరియా వల్ల సంభవిస్తుంది. నీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది
    డి. స్వైన్‌ఫ్లూ వైరస్ వల్ల సంభవిస్తుంది. గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది
    1. ఎ మాత్రమే 2. ఎ, బి 3 ఎ, బి, సి 4. ఎ, బి, సి, డి
17. పాశ్చరైజేషన్‌లో.....
    1. పాలను 700 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు 15 నుంచి 35 నిమిషాల వరకూ వేడిచేస్తారు
    2. పాలను 350 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ 10 నుంచి 15 నిమిషాలు వేడి చేస్తారు.
    3. పాలను 500 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ 15 నుంచి 30 సెకన్లు వేడిచేస్తారు
    4. పాలను 700 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ 15 నుంచి 30 సెకన్లు వేడి చేసాత
18. కింది వాటిలో సాధారణ కంటిచూపు ద్వారా పరిశీలించగలిగే జీవిని గుర్తించండి.
    1. స్పైరోగైరా 2. పెన్సిలియం
    3. టొబాకో మొజైక్ వైరస్ 4. ప్లాస్మోడియం

**సమాధానాలు**

1) 3 2) 1 3) 4 4) 3 5) 4 6) 2 7) 1 8) 2 9) 1 10) 4 11) 2 12) 1 13) 4 14) 2 15) 2 16) 3 17) 1 18) 1

ప్రశ్న పత్రాన్ని హైదరాబాద్‌లోని బాసర ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శీలం దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో సీనియర్ ఫ్యాకల్టీ బృందం రూపొందించింది.

# ఉస్మానియా వర్సిటీలో పీహెచ్‌డీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో కేటగిరీ 1 అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు కోరుతోంది. సోషల్ సైన్సెస్ విభాగాల్లో 18 ఖాళీలు, ఆర్ట్స్ విభాగాల్లో 47 ఖాళీలు ఉన్నాయి. వీటిని కేటగిరీ 1, కేటగిరీ 2 మోడ్‌లకు చెరి సమానంగా కేటాయిస్తారు. ఇంజనీరింగ్ విభాగాల్లో కూడా ఖాళీలు ఉన్నాయి. సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ ఉత్తీర్ణతతోపాటు యూజీసీ/సీఎస్ఐఆర్/ఐకార్/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ-ఇన్‌స్పయిర్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగలవారు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి నిర్దేశిత ధ్రువపత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి.

**సోషల్ సైన్సెస్ విభాగాలు-ఖాళీలు:** ఎకనామిక్స్ 1, హిస్టరీ 6, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ 5, పొలిటికల్ సైన్స్ 3, సోషియాలజీ 1, సైకాలజీ 2 ఖాళీలు ఉన్నాయి.

**ఆర్ట్స్ విభాగాలు-ఖాళీలు:** ఇంగ్లీష్ 25, హిందీ 9, కన్నడ 4, లింగ్విస్టిక్స్ 5, ఫిలాసఫీ 1, సంస్కృతం 1, పర్షియన్ 2 ఖాళీలు ఉన్నాయి.

**ఇంజనీరింగ్ విభాగాలు:** బయో-మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆర్ట్స్ విభాగాలకు జూలై 20; సోషల్ సైన్సెస్, ఇంజనీరింగ్ విభాగాలకు జూలై 22
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** జేఆర్ఎఫ్ సర్టిఫికెట్ రెండు కాపీలు; రీసెర్చ్ ప్రపోజల్ మూడు కాపీలు; పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; మైగ్రేషన్ సర్టిఫికెట్; కులం, వైకల్యం సంబంధిత ధ్రువపత్రాలు; ఆధార్ కార్డ్ రెండు కాపీలు; రెండు సొంత చిరునామా కవర్లు; రెండు ఫొటోలు
- **ఇంటర్వ్యూలు:** ఆగస్టు 5 నుంచి 14 వరకు
- **అడ్మిషన్స్‌కు ముగింపు:** ఆగస్టు 19
- **చిరునామా:** డీన్ కార్యాలయం, ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్/ఆర్ట్స్/ఇంజనీరింగ్, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్-500007.
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

## జాబ్ కార్నర్

### హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో వివిధ పోస్టులు

ఖాళీలు 1217

ప్రభుత్వ రంగ సంస్థ- హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్...ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న హెచ్‌ఎల్‌ఎల్ కేంద్రాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**ఖాళీలున్న రాష్ట్రాలు:** ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా,ఛత్తీస్‌గఢ్

1. అకౌంట్స్ ఆఫీసర్: **2 పోస్టులు**
2. అడ్మిన్ అసిస్టెంట్: **3 పోస్టులు**
3. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్: **1 పోస్టు**
4. సెంటర్ మేనేజర్: **4 పోస్టులు**
5. సీనియర్ డయాలసిస్ టెక్నీషియన్/డయాలసిస్ టెక్నీషియన్/జూనియర్ డయాలసిస్ టెక్నీషియన్/అసిస్టెంట్ డయాలసిస్ టెక్నీషియన్/అకౌంటెంట్ కమ్ స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్: **1206 పోస్టులు**

**వయోపరిమితి:** 2024 జూలై 1 నాటికి 37 ఏళ్లు మించకూడదు
**ఎంపిక ప్రక్రియ:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ దరఖాస్తులను డీజీఎం(హెచ్‌ఆర్), హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్, హెచ్‌ఎల్‌ఎల్ భవన్, 26/4, వేలచేరి - తాంబరం మెయిన్ రోడ్డు, పల్లికరణై, చెన్నై చిరునామాకు పంపించాలి.
**దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** జూలై 17
**వెబ్‌సైట్:** www.lifecarehll.com/

### ఇండియన్ బ్యాంకులో అప్రెంటిస్‌లు

చెన్నైలోని ఇండియన్ బ్యాంక్, ప్రధాన కార్యాలయం...2024-25 సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

**ఖాళీలు:** 1,500(ఆంధ్రప్రదేశ్‌లో 82, తెలంగాణలో 42 ఖాళీలు ఉన్నాయి)
**కేటగిరీ వారీగా ఖాళీలు:** ఎస్సీ-255; ఎస్టీ-77; ఓబీసీ-351; ఈడబ్ల్యూఎస్-137;యూఆర్-680
**వయోపరిమితి:** 2024 జూలై 1 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.
**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
**శిక్షణ కాలం:** 12 నెలలు
**ఎంపిక ప్రక్రియ:** ఆన్‌లైన్ రాత పరీక్ష, లోకల్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా
**స్టయిపెండ్:** నెలకు మెట్రో/అర్బన్ శాఖల్లో రూ.15,000. రూరల్/సెమీ అర్బన్ శాఖల్లో రూ.12,000.
**దరఖాస్తు రుసుము:** జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.
**ఆన్‌లైన్ రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్) అంశాలు:** రీజనింగ్ ఆప్టిట్యూడ్ అండ్ కంప్యూటర్ నాలెడ్జ్ (25 ప్రశ్నలు- 25 మార్కులు), జనరల్ ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు- 25 మార్కులు) **పరీక్ష వ్యవధి:** 60 నిమిషాలు
**తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్
**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూలై 31
**వెబ్‌సైట్:** www.indianbank.in/career/

### ఎయిమ్స్ రాజ్‌కోట్‌లో సీనియర్ రెసిడెంట్స్

రాజ్‌కోట్(గుజరాత్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

**పోస్టు:** సీనియర్ రెసిడెంట్
**విభాగాలు:** అనస్థీషియా, అనాటమీ, బయోకెమిస్ట్రీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పాథాలజీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ తదితరాలు.
**అర్హత:** సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/ఎంసీహెచ్/డీఎం, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
**వయోపరిమితి:** 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
**దరఖాస్తు ఫీజు:** రూ.1000. ఎస్సీ/ఎస్టీలకు రూ.800. దివ్యాంగ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.
**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా **చివరి తేదీ:** జూలై 25
**వెబ్‌సైట్:** aiimsrajkot.edu.in/

### ఇండియన్ నేవీలో 10+2(బీటెక్)క్యాడెట్ ఎంట్రీ స్కీమ్

భారత నౌకాదళం... ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ బ్రాంచుల్లో 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ కింద నాలుగేళ్ల బీటెక్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీలో శిక్షణ ఉంటుంది.

**బ్రాంచ్:** ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ **కోర్సు ప్రారంభం:** 2025 జనవరిలో
**ఖాళీలు:** 40(మహిళలకు 8 ఖాళీలు కేటాయించారు)
**వయోపరిమితి:** 2005 జూలై 02 నుంచి 2008 జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.
**అర్హత:** కనీసం 70 శాతం మార్కులతో సీనియర్ సెకండరీ పరీక్ష(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్) ఉత్తీర్ణతతో పాటు జేఈఈ(మెయిన్) 2024 ర్యాంక్, పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
**వెబ్‌సైట్:** https://www.joinindiannavy.gov.in/

## లిటిల్స్



### సత్య వ్రతం

కేశవ పురంలో నివసించే మాధవుడికి ఎపుడూ అసత్యం చెప్పడని మంచి పేరుండేది. ఆ దేశపు రాజుగారికి ఈ విషయం తెలిసి, 'ఒక్కసారి కూడా అబద్ధం చెప్పకుండా ఉండటం ఎలా సాధ్యంఅని, అతనితో నేను అబద్ధం ఆడిస్తాను' అన్నాడు రాజు' అదెలా మహారాజా?'అని అడిగిన మంత్రితో, 'నేను ఒక చోటికి వస్తున్నాను అని మాధవుడితో ఆ చోటికి కబురు పంపుతాను. నేను చెప్పిన ప్రకారం వెళ్లక పోతే అతను అసత్యం ఆడినట్లే కదా ఈ విధంగా అతని సత్య వ్రతంచెడిపోయినట్లే' అని నవ్వాడు రాజు. అనుకున్న ప్రకారమే తాను ఒక మారుమూల పల్లెకు రాబోతున్నట్టు మాధవుడి చేత ఆ ఊరికి వర్తమానం పంపాడు కానీ చెప్పిన సమయానికి వెళ్లలేదు ఆ మర్నాడు మంత్రిని పిలిచి ఆ పల్లెప్రజలు మాధవుడి అసత్యం గురించి ఏం అనుకుంటున్నారో తెలుసుకోమని చెప్పాడు. మంత్రి సాయంకాలం తిరిగి వచ్చి, 'మహారాజా. మాధవుడు ఆ ప్రజలకు మీరు ఆ పల్లెకు రావాలి అని అనుకున్నట్టు మాత్రమే చెప్పాడట కానీ ఖచ్చితంగా రాజుగారు వస్తారు అని మాట ఇవ్వలేదట కాబట్టి అక్కడ ఎవరూ మాధవుడిని అసత్య వాది అనుకోవడంలేదు' అని చెప్పాడు. ఈ మాటలు విన్న రాజుగారు మాధవుడి లౌక్యానికి, ముందు జాగ్రత్తకు సంతోషించి, మాధవుడికి విలువైన కానుకలు ఇచ్చాడు.




**8 తేడాలు గుర్తించండి!**





**దారి కనుక్కోండి**



**సరైన నీడ ఏది?**



**డైలీ సుడోకు - 357**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 4 | | 2 | | 8 | | | |
| | | 5 | 6 | | | | | |
| | | | | 5 | 4 | | | 7 |
| | 6 | | 4 | | | | 5 | 3 |
| | 1 | 8 | | | | 6 | 9 | |
| 3 | 5 | | | | 9 | | 8 | |
| 4 | | | 3 | 1 | | | | |
| | | | | | 6 | 3 | | |
| | | | 8 | | 5 | | 6 | 1 |

**సుడోకు - 356 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 8 | 5 | 6 | 7 | 4 | 9 | 1 | 3 |
| 1 | 4 | 3 | 8 | 5 | 9 | 7 | 2 | 6 |
| 9 | 7 | 6 | 1 | 2 | 3 | 4 | 8 | 5 |
| 8 | 3 | 9 | 5 | 6 | 7 | 1 | 4 | 2 |
| 7 | 6 | 4 | 3 | 1 | 2 | 5 | 9 | 8 |
| 5 | 1 | 2 | 4 | 9 | 8 | 3 | 6 | 7 |
| 3 | 5 | 8 | 9 | 4 | 6 | 2 | 7 | 1 |
| 4 | 2 | 1 | 7 | 8 | 5 | 6 | 3 | 9 |
| 6 | 9 | 7 | 2 | 3 | 1 | 8 | 5 | 4 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.